అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

శనివారం 26 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక





సంపుటి : 5 సంచిక : 28 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50


# దాపరికం

సమాచారం ఇవ్వకుండా మోడీ సర్కార్ దాగుడు మూతలు

## నిరుద్యోగ సమస్యపై లేబర్‌బ్యూరో సర్వే

## నల్లధనంపై ఓ అంచనాకు రాలేకపోయిన ఆర్థికశాఖ



ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ నాలుగున్నరేండ్ల కాలంలో ఏం సాధించింది..? 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చింది..? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికేవాళ్లుంటారని తెలిసే ఆయన తన ప్రభుత్వ పనితీరును అంచనా వేయాలనుకునేవారికి అంతుచిక్కని మార్గాన్ని అనుసరిస్తున్నట్టుగా అర్థమవుతోంది. అందుకే ఆయన దాగుడు-మూతల పద్ధతిని ఎంచుకున్నట్టుగా భావిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశం అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించిందంటూ ఆయన అనుంగు అనుచరగణం చెప్పటం తెల్సిందే. అయితే, వాళ్లు చెప్పేవాటికీ, అధికారిక గణాంకాలకూ పొంతనే లేకపోవడం గమనార్హం. దాంతో, అధికారిక రికార్డుల్ని నిర్వహించడంలో దాగుడుమూతలాడటం మోడీ సర్కార్ అలవరుచుకున్నది. గతంలో కాంగ్రెస్‌గానీ, దాని మిత్రపక్షాలతో కూడిన యూపీఏ కూటమిగానీ ప్రభుత్వపరంగా నిర్వహించే అధికారిక రికార్డులనైనా ఎంతోకొంత పారదర్శకంగా ఉండేవి. మోడీ పాలనలో అది కూడా లేదు. దేశ దశా, దిశను నిర్దేశించుకునే కీలక అంశాల్లో కూడా అధికారిక రికార్డుల్ని ప్రజలకు తెలియకుండా దాచేస్తున్నారు.

అందులో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం.. వివరాలు 9లో

# 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి

## విభజన చట్టం హామీలను నెరవేర్చాలి

**సీపీఐ(ఎం), సీపీఐ, జనసేన డిమాండ్**

- విశాఖలో అగ్రనేతల భేటీ
- తెలంగాణలోనూ జనసేనతో సీపీఐ(ఎం) పొత్తు


మాట్లాడుతున్న పవన్, పక్కన రాఘవులు,సురవరం

**విశాఖపట్నం:** రాష్ట్ర విభజన సమస్యలు, పర్యావరణం, మైనింగ్ విధానం, భూసేకరణ, మానవ హక్కుల అంశాలపై చర్చించినట్టు జనసేన, వామపక్ష పార్టీలు వెల్లడించాయి. శుక్రవారం విశాఖపట్నంలోని రిషికొండలో సీపీఐ(ఎం), సీపీఐ,జనసేన అగ్ర నేతలు సమావేశమై రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఈ మూడు పార్టీల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌సహా పలువురు నాయకులు హాజరయ్యారు. భూసేకరణ విషయంలో నిర్వాసితుల సమ్మతిని తీసుకోవాలని, పరిహారాన్ని ముందుగా అందించాలని మూడు పార్టీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు ...9లో



# ఎఫ్‌డీఐలతో దేశభద్రతకు ప్రమాదం

**వ్యూహాత్మకంగానే ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం**

- కాంట్రాక్టులు కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం : మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్
- హైదరాబాద్‌లో మానవహారం

వివరాలు 10లో



**ఈ దేశం అందరిదీ..** జాతినుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం వివరాలు 6లో..

# రెండో విడతలోనూ.. టీఆర్ఎస్ సత్తా

**పంచాయతీ ఎన్నికల్లో 88.26 శాతం పోలింగ్**

- యాదాద్రిలో అత్యధికంగా 83.71, జగిత్యాలలో అత్యల్పంగా 80.23శాతం..

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రెండో విడత పంచాయతీ ఎన్నికలు మరింత ఆసక్తికరంగా సాగాయి. వేడెక్కింది. అధికార టీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు సత్తా చాటారు. మొదటి విడత ఎన్నికలతో పోలిస్తే మలి దశలోనూ కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీలు అదే పరిస్థితి. వామపక్ష పార్టీలైన సీపీఐ(ఎం) సీపీఐలు బలపర్చిన అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చి పలు చోట్ల గెలుపొందారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో 88.26శాతం పోలింగ్ నమోదైంది. యాదాద్రిలో అత్యధికంగా 83.71 శాతం, అత్యల్పంగా జగిత్యాలలో 80.23 శాతం పోలింగ్ చోటు చేసుకుంది. 10 జిల్లాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. జనగామ 90.62, కామారెడ్డి 90.04, ఖమ్మం 91.91, మహబూబాబాద్ 91.05, మెదక్ 92.52, నాగర్‌కర్నూల్ 90.17, నల్గొండ 92.01, సిద్దిపేట 92.34, సూర్యాపేట 92.82 శాతం ఓటింగ్ జరిగింది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ...9లో

## 'పంచాయతీ' ఘటనలు

**బ్యాలెట్ పేపర్‌లో గుర్తుల తప్పులు**

- ఒకటి, రెండు ఓట్ల తేడాతో విజయం
- మహిళ ఆత్మహత్యాయత్నం 9లో..

## 1300 స్థానాల్లో స్వతంత్రుల హవా

**ప్రధాన పార్టీలను కంగు తినిపించిన వైనం**

- నిరంతరం ప్రజల్లో ఉండటంతోనే గెలుపు
- కలిసొచ్చిన సామాజిక ఆర్థిక బలం 9లో..



# ప్రణబ్‌కు భారత రత్న

**భుపేన్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్‌లకూ**

- అత్యున్నత పురస్కారాలను ప్రకటించిన కేంద్రం



వివరాలు 9లో



# చిన్నారిపై లైంగికదాడి

**మేడ్చల్ జిల్లాలో ఘటన**

నవతెలంగాణ - దుండిగల్

మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో దారుణం జరిగింది. అభం శుభం తెలియని చిన్నారిపై తాగిన మత్తులో ఓ ప్రబుద్ధుడు లైంగిక దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కైసర్‌నగర్‌కు చెందిన చిన్నారి(2) గురువారం సాయంత్రం పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా, ఆటో డ్రైవర్‌గా పని చేసే అదే బస్తీకి చెందిన మొహినుద్దీన్ తీసుకుపోయాడు. నిర్మానుష్య ప్రదేశంలో లైంగిక దాడి చేసి, అనంతరం సమీపంలోని ఓ స్క్రాప్ దుకాణం వద్ద వదిలి వెళ్లాడు. చిన్నారి కనపడకపోవడంతో తల్లి చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికింది. స్క్రాప్ దుకాణం వద్ద ఏడుస్తూ ఉన్న చిన్నారికి రక్తస్రావం అవుతుండటంతో వెంటనే పోలీసులకు ...9లో

పాలమూరు ఎత్తిపోతల పథకానికి

## రెండవ దశ అటవీ అనుమతులు




వివరాలు 9లో

# 'పద్మ అవార్డు'ల ప్రకటన

**తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి..**

- సిరివెన్నెలకు పద్మశ్రీ
- తెలంగాణ నుంచి జాతీయ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛత్రికి..



**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రం 'పద్మ అవార్డు'లను ప్రకటించింది. పలు రంగాలలో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు కేంద్రం ఈ అవార్డులను శుక్రవారం విడుదల చేసింది. ఇందులో భాగంగా నలుగురికి పద్మ విభూ షణ్, 14 మందికి పద్మ భూషణ్, 94 మందికి పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. పద్మ విభూషణ్ పొందిన వారిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జానపద కళాకారుడు టీజెన్ భాయ్, మహారాష్ట్రకు చెందిన నాటక రంగ కళాకారుడు బల్వంత్ మొరేశ్వర్ పురంధర్, పారిశ్రామిక రంగం నుంచి అనిల్ కుమార్ మణిభాయ్ నాయక్ ఉన్నారు. ఆఫ్రికా దేశం జిబోటికి చెందిన ఇస్మాయిల్ ఓమర్ గురెల్లా పద్మ విభూషణ్‌కు ఎంపికయ్యారు. పద్మ భూషణ్ పొందినవారిలో ప్రముఖ నటుడు మోహన్‌లాల్, ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణ్‌లతో పాటు గతేడాది మరణించిన ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ ఉన్నారు.




**సిరివెన్నెలకు పద్మశ్రీ..**

కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డులలో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి పద్మశ్రీలు దక్కాయి. వీరిలో ప్రముఖ సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, ...9లో

# నిజామాబాద్‌లో కులదురహంకార హత్య?

**పొలంలో శవమైన దళిత యువకుడు**

- పథకం ప్రకారమే హత్యచేశారు : కుటుంబీకుల ఆరోపణ


(ఫైల్)



వివరాలు 9లో

## 'కల్బుర్గీ హత్య'పై పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం



**న్యూఢిల్లీ:** హేతువాది, ప్రముఖ రచయిత ఎంఎం కల్బుర్గీ హత్య కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాలని దాఖలైన పిటిషన్‌ను భారత సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంపై ఫిబ్రవరి 26న విచారిస్తామని, వాదనలు వినిపించేందుకు పార్టీలు సిద్ధంగా ఉండాలని జస్టిస్ ఆర్ నారీ మన్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కల్బుర్గీ హత్య కేసు సీరి యస్ వ్యవహారమని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. కల్బుర్గీని 2015 ఆగస్టు 30న దుండగులు దారుణంగా హత్య చేసిన సంగతి తెలి సిందే. ఉదయం 8.40 గంటలకు కల్బుర్గీ నివాసం వద్దకు చేరుకున్న ఇద్దరు దుండగులు ఆయన శిష్యులమని చెప్పి లోపలికి ప్రవేశించారు. వారు నేరుగా కల్బుర్గీ గదిలోకెళ్లి ఆయనను కాల్చి చంపారు. కేసు విచా రణ సందర్భంగా పోలీసులు ఈ విషయాలను తెలిపారు. కాగా.. ఈ వివ రాలు మినహా ఇప్పటివరకూ కేసులో పోలీసులు ఎలాంటి పురోగతి సాధించకపోవడం గమనార్హం. దీంతో ఈ కేసును సిట్‌కు అప్పగించాలని కోరుతూ కల్బుర్గీ భార్య ఉమాదేవి సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

## సివిల్ దుస్తుల్లో భద్రత కల్పించాం

- శబరిమలలోకి మహిళల ప్రవేశంపై హైకోర్టుకు ఎస్పీ నివేదిక

**తిరువనంతపురం :** సుప్రీంకోర్టు కీలక తీర్పు తర్వాత శబరిమల ఆలయంలోకి తొలిసారిగా ఇద్దరు మహిళలు ప్రవేశించే సమయంలో సివిల్ దుస్తుల్లో ఉండి వారికి భద్రత కల్పించినట్టు ఎస్పీ టి నారాయణ్ వెల్లడించారు. ఈ మేరకు మహిళల ఆలయ ప్రవేశం, తదనంతర పరిణా మాలపై ఆయన.. కేరళ హైకోర్టుకు గురువారం ఓ అఫిడవిట్‌ను సమర్పించారు. పంబాలోని పోలీసులను కనకదుర్గ, బిందూలు కలిసి ఆలయ ప్రవేశం నేపథ్యంలో రక్షణ కల్పించాల్సిందిగా కోరినట్టు అఫిడ విట్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 2న ఆ మహిళలకు నలుగు రు పోలీసులు రక్షణగా వెళ్లారని తెలిపారు. ఆందోళనకారులెవ్వరూ గుర్తు పట్టకుండా ఉండేందుకే పోలీసులు యూనిఫాంలో కాకుండా.. సివిల్ దుస్తుల్లో వెళ్లారని కోర్టుకు వివరించారు. ఉదయం 3.52 నిమిషాలకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సభ్యులు మాత్రమే వెళ్లే గేటు గుండా మహిళలను లోపలికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఆ సమయంలో అక్కడున్న భక్తులెవరూ ఎలాంటి అభ్యంతరమూ వ్యక్తం చేయలేదని వివరించారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయస్కుల మహిళలూ ప్రవేశించవచ్చని భారత సర్వోన్నత న్యాయస్థానం గతేడాది సెప్టెంబర్‌లో సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఇంతకుముందు 10 నుంచి 50 ఏండ్ల మధ్య వయస్సున్న మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఉండేది కాదు.

## అయోధ్య కేసు విచారణలో కొత్త ధర్మాసనం ఏర్పాటు

- ఈనెల 29 నుంచి విచారణ

**న్యూఢిల్లీ:** అయోధ్య వివాదంపై దాఖలైన పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టులో ఐదుగురు సభ్యుల కొత్త ధర్మాసనం ఏర్పాటయ్యింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నూతన ధర్మాసనాన్ని ప్రకటించారు. రంజన్ గొగోయ్ నేతృత్వం వహిస్తున్న ఈ బెంచ్‌లో జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్‌లను కొత్తగా తీసుకున్నారు. వీరితో పాటు జస్టిస్ ఎస్ఎ బోడ్డే, జస్టిస్ డివై చంద్రచూడ్‌లు ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. గతంలో ఐదుగురి బెంచ్‌లో సభ్యుడిగా ఉన్న జస్టిస్ ఎన్‌వి రమణను కొత్త బెంచ్ నుంచి పక్కనబెట్టారు. కాగా, ఈ కేసు విచారణ ఈనెల 29 నుంచి ప్రారంభం కానుంది. కేసు విచారణలో భాగంగా ఈనెల 11న అప్పటి ఐదుగురి సభ్యుల ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ యు యు లలిత్.. ఈ కేసు నుంచి తప్పుకున్న విషయం విదితమే.

## మోడీతో పోరాడతా.. కానీ ద్వేషించను

- రాహుల్ గాంధీ



**భువనేశ్వర్:** ప్రజా సమస్యలపై ప్రధాని మోడీతో పోరాడతానని ఆయనను ద్వేషించనని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'మోడీ నన్ను దూషించేపుడు నేను ఆయనను చూస్తాను. కానీ, నేను ఆయ నను తిరిగి దూషించాలనుకోను. ఆయనను ఆలింగనం చేసు కోవాలని అనుకుంటాను. మోడీకి, ఆయన పార్టీకి కాంగ్రెస్ అంటే పడదు. కానీ, దీనికి మేం ఆయనపై ద్వేషం పెంచుకోం. మేం ప్రజలను ప్రేమిస్తాం' అని అన్నారు. గతంలోనూ పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాహుల్.. మోడీ దగ్గరికెళ్లి ఆలింగనం చేసుకోవడం, ఎంపీ జ్యోతిరాదిత్య సింది యాను చూస్తూ కన్ను గీటిన సంగతి తెలిసిందే. ఇంకా రాహుల్ మాట్లా డుతూ.. రాజ్యాంగ వ్యవస్థలలోకి ఆరెస్సెస్ ప్రవేశించి వాటిని తమకను గుణంగా మార్చుకుంటున్నదని ఆరోపించారు. కేంద్ర మంత్రులందరూ ఆరెస్సెస్ చెప్పిన విధంగానే నడుచుకుంటున్నారని విమర్శించారు.

## శబరిమల తీర్పు అమలుకు కట్టుబడి ఉన్నాం

**తిరువనంతపురం :** శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళలను అనుమతిస్తూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును అమలు చేసేందుకు కేరళలోని సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఆ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ పి. సదాశివం తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నదని చెప్పారు. లింగ సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హుందాతనాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ కృషిని ఆయన ప్రశంసించారు. "రాష్ట్రంలోని మా ప్రభుత్వం లింగ సమానత్వానికి హామీ ఇస్తోంది. మహిళల శబరి మల ఆలయ ప్రవేశానికి వయస్సుకు సంబంధించి ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ తీర్పును అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది." అని సదాశివం అన్నారు.

## రక్షణ రంగ ఉద్యోగులకు సీటూ అభినందనలు

**న్యూఢిల్లీ:** దేశ రక్షణ ఉత్పత్తులు, సేవల రంగాన్ని పరిరక్షించుకునేందుకు మూడు రోజులు వీరోచిత పోరాటాన్ని విజయవంతంగా నిర్వహించిన రక్షణ రంగ సివిలియన్ ఉద్యోగులు, వారి సంఘాలకు సీఐటీయూ అభినందనలు తెలియచేసింది. రక్షణ రంగ ఉత్పత్తులు, సేవల రంగాన్ని ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టారని సీటూ తన ప్రకటనలో పేర్కొంది. రక్షణ ఉత్పత్తులు, సేవల రంగాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెడుతున్న బిజెపి సర్కారు ప్రయత్నాలను ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌తో సహా రక్షణ రంగంలోని ఉద్యోగసంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాయని తెలిపింది. 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, డీఆర్‌డీఓ, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ సెంటర్లు, ఆర్మీ స్టేషన్ వర్క్‌షాపుల వంటి వ్యవస్థలు దేశ సైన్యానికి అందిస్తున్న పరికరాలు సేవలను దేశ విదేశీ కంపెనీలకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించటం సిగ్గుచేటని సీటూ విమర్శించింది.



## కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారం పెంపు

### ఒప్పందంపై సంతకాలు చేసిన భారత్, దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ :** మూడేండ్లపాటు కొనసాగే వ్యూహాత్మక మార్గానికి కార్యక్రమానికి భారత్, దక్షిణాఫ్రికాలు శుక్రవారం ఆమోదముద్ర వేశాయి. కీలకమైన పలు రంగాల్లో సహకారాన్ని మరింత పెంచేందుకు ఈ కార్యక్రమం పూతమివ్వనుంది. ప్రధాని నరేంద్ర మోడీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా మధ్య చర్చలు ముగిసిన అనంతరం ప్రధాన మంత్రి కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. విస్తృతమైన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకునే లక్ష్యంతో ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలను ఉభయపక్షాలు చర్చించాయని చెప్పారు. రమఫోసా మాట్లాడుతూ, ఈ మూడేళ్ల వ్యూహాత్మక కార్యక్రమాన్ని అమలు పరచడం ద్వారా భారత్‌తో ఫలితాన్నిచ్చే భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, మత్స్య పరిశ్రమ, పర్యాటకం, ఐటీ, వ్యవసాయం వంటి రంగాల్లో సహకారం పెంపునకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. శుక్రవారం ఉదయమే ఢిల్లీ చేరుకున్న రమఫోసా శనివారం భారత గణతంత్ర దినోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు.

**గాంధీ సమాధిని సందర్శించిన దక్షిణాఫ్రికా నేత**

భారత్‌లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన రమఫోసాకు ఇక్కడి రాష్ట్రపతి భవన్ వద్ద ఘన స్వాగతం లభించింది. తర్వాత ఆయన మహాత్మా గాంధీ సమాధిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్‌ను సందర్శించడం చాలా సంతోషంగా వుందన్నారు. మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మానవ హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం పట్ల ఇరువురు నేతలకు గొప్ప గౌరవం వుందన్నారు.



రాజ్‌పథ్‌లో గాంధీ సమాధిని సందర్శించిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా దంపతులు

# పౌరసత్వ బిల్లును ఉపసంహరించండి

## సీపీఐ(ఎం) డిమాండ్

- ఫిబ్రవరి 4న దేశ వ్యాప్త ఆందోళనలకు పిలుపు

**న్యూఢిల్లీ :** జాతీయ పౌరసత్వ నమోదు (సవరణ) బిల్లును తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 4న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొంది రాజ్యసభ ఆమోదానికై వేచిఉన్న ప్రతిపాదిత బిల్లుపై ఈ శాన్య రాష్ట్రాలలో వెల్లువెత్తుతున్న నిరసనలపట్ల పొలిట్ బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జాతి, మత, కుల, సాంస్కృతిక వైవిధ్యాలకు అతీతంగా ప్రజలందరికీ పౌరసత్వం కల్పించాలన్న రాజ్యాంగ మూల సూత్రాన్ని ఈ పౌరసత్వ (సవరణ) బిల్లు ఉల్లంఘిస్తోందని పొలిట్ బ్యూరో పేర్కొంది. ఈ ప్రతిపాదిత బిల్లుతో భిన్నత్వంలో ఏకత్వమనే భావన దెబ్బతినే ప్రమాదముందన్నారు. ఈ బిల్లు మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పిస్తోందని పేర్కొంది. దేశంలో వైవిధ్యాలకు నిలయంగా ఈశాన్య రాష్ట్రాలున్నాయని తెలిపింది. ఈ ప్రాంతంలోని వివిధ తరగతులకు చెందిన భిన్నమైన ప్రజల మధ్య జీవనోపాధి విషయంలో అభద్రత కొనసాగుతున్నదని పేర్కొంది. ఈశాన్య ప్రాంతంలో పౌరసత్వ (సవరణ) బిల్లు అక్కడి స్థిరత్వాన్నిదెబ్బతీస్తున్నదని తెలిపింది. అస్సాంతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలలో ప్రజలు వీధుల్లోకి వచ్చి బిల్లుపై నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం ప్రజలలో అభద్రతా భావాన్ని, ఉద్రిక్తతకు దారి తీస్తున్న పరిణామాలను గుర్తించి, పరిస్థితులు చేజారకముందే ప్రతిపాదిత బిల్లును ఉపసంహరించుకోవాలని పొలిట్ బ్యూరో పేర్కొంది. ప్రతిపాదిత బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 4న దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పార్టీ శాఖలన్నిటికీ పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది.

**ఆ ప్రమాణాలను వ్యతిరేకిస్తున్నాం**

పది శాతం ఈబీసీ రిజర్వేషన్లకోసం కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న అర్హతా ప్రమాణాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం(ఐ) ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రిజర్వేషన్లకు నిర్దేశించిన అర్హతా ప్రమాణాలు ఆర్థిక వెనుకబాటు తనాన్ని అసహాస్యం చేసే రీతిలో వున్నాయనిపేర్కొంది. అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులకు 18 వేల కనీస వేతనాన్ని ప్రకటించాలన్న డిమాండ్‌ను అంగీకరించని ప్రభుత్వం ఇప్పుడు ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు 70వేల నెలసరి ఆదాయాన్ని నిర్దేశించటం విడ్డూరంగా వుందని విమర్శించింది.

**వెనిజులాపై అమెరికా కుట్రను వ్యతిరేకించండి**

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రధాని నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రధానికి ఒక లేఖ రాశారు. వెనిజులా ప్రతిపక్ష నేతను ఆ దేశ అధ్యక్షుడిగా గుర్తించినట్టు ప్రకటించటం ద్వారా అమెరికా ప్రజల తీర్పును కాలరాసిందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మదురో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యారని, ఈ ఎన్నికలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా జరిగాయని వివిధ దేశాల నుండి వచ్చిన పరిశీలకులు నిర్ధారించారని ఏచూరి తన లేఖలో గుర్తు చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను భారత ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చా లని ఆయన కోరారు. అదే విధంగా వెనిజులాపై విధించిన ఆర్థిక ఆంక్షలను,సైనికచర్య బెదిరింపు లను ఖండించాలని ఏచూరి విజ్ఞప్తి చేశారు. అమెరికా చర్యలు ఐరాస ఛార్టర్‌కు పూర్తివిరుద్ధమైనవన్న విష యాన్ని ప్రధాని అంగీకరిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



## అందంగా ఉంటే ఓట్లు పడవు

### ప్రియాంకా గాంధీపై బీజేపీ నేతనోటి దురుసు

- సున్నాకు సున్నా కలిస్తే ప్రయోజనమేమీ ?: యోగి

**పాట్నా :** కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీపై బీజేపీ నేత, బీహార్ మంత్రి వినోద్ నారాయణ్ ఝా నోరు పారేసుకున్నారు. ఆమె అందమైన ముఖాన్ని కలిగి ఉన్నప్పటికీ రాజకీయపరమైన సామర్థ్యం లేదంటూ శు క్రవారం ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. అంతటితో ఆగకుండా ఆమె అందం ఓట్లను రాబట్టుకోలేదంటూ ఎద్దేవా చేశారు. ప్రియాంకకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా, ఉత్తరప్రదేశ్(తూర్పు) ఇంచార్జిగా కాంగ్రెస్ హైకమాండ్ బుధవారం బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. కాగా.. ఈ వ్యవహారంపై వినోద్ నారాయణ్ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంకాగాంధీ ప్రభావం ఉండబోదని అన్నారు. అంతేకాక.. ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాకు భూ కుంభకోణం, ఇతర అవినీతి కేసుల్లో ప్రమేయం ఉన్నదని ఆరోపించారు. వినోద్ వ్యాఖ్యలను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇతర పార్టీల నేతలను తిట్టేందుకు సీఎం నితీశ్‌కుమార్ ఓ సంస్థను ఏర్పాటు చేశాడని, అక్కడ బీహార్ క్యాబినెట్ మంత్రులు తర్ఫీదు పొందుతున్నారని ఆయన విమర్శించారు. వినోద్ నారాయణ్‌పై వెంటనే వేటు వేయాలని సీఎం నితీశ్‌కుమార్‌ను కాంగ్రెస్ నేత ప్రేమ్ చంద్రమిశ్రా డిమాండ్ చేశారు. మరోవైపు.. ప్రియాంక ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి రావడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎట్టకేలకు పెదవి విప్పారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆమె రాజకీయ ప్రవేశం కారణంగా రాష్ట్రంలో ఎలాంటి మార్పు ఉండబోదని అన్నారు. సున్నాకు మరో సున్నా తోడైందని, దీంతో ప్రయోజనమేమీ ఉండదని విమర్శించారు. ప్రియాంక పొలిటికల్ ఎంట్రీ ద్వారా కాంగ్రెస్‌కు వచ్చే ఫలితం కూడా సున్నానే అంటూ ఎద్దేవా చేశారు. ఆమెకు యూపీ(తూర్పు) ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించడం ద్వారా కాంగ్రెస్ కుటుంబ పార్టీ అని మరోసారి రుజువైందని యోగి అన్నారు.

## ఆ బిల్లును రద్దు చేయాల్సిందే...

- లేదంటే..ఎన్డీయే నుంచి బయటకు : మిజోరాం సీఎం

**న్యూఢిల్లీ :** పౌరసత్వ బిల్లు వెనెక్కి తీసుకోకపోతే, భారతీయ జనతా పార్టీతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటామని మిజోరాం సీఎం జోరాంతాంగా హెచ్చరించారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండా తమ ప్రభుత్వం, తమ పార్టీ అన్నివిధాలా ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. శీతాకాలం పార్లమెంట్ సమావేశాల్లో పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపగా, బడ్జెట్ సమావేశాల్లో బిల్లు రాజ్యసభ ఆమోదానికి రానున్నది.

ఈనేపథ్యంలో ఈశాన్య రాష్ట్రాల్లో అనేక పార్టీలు బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తాయి. దీనిపై తాజాగా మీడియాతో సీఎం జోరాంతాంగా మాట్లాడుతూ, "బిల్లును రద్దు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి మా వ్యతిరేకత, నిరసనను తెలియజేశా"మని అన్నారు.

గతేడాది డిసెంబరులో మిజోరాం అసెంబ్లీకి ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో 40 స్థానాలకుగాను 26స్థానాల్ని మిజో నేషనల్ ఫ్రంట్ కైవసం చేసుకొని అధికారాన్ని చేపట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ పార్టీలతో బీజేపీ 'నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయెన్స్' కూటమిని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ కూటమిలో మిజో నేషనల్ ఫ్రంట్ కూడా ఒక పార్టీగా కొనసాగుతోంది.

### ఆరెస్సెస్‌ను విమర్శించినందుకు...

## జాతీయ అవార్డు గ్రహీతపై దాడి

**తిరువనంతపురం:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) పై ఫేస్‌బుక్‌లో విమర్శలు చేసినందుకు గానూ ప్రముఖ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత ప్రియా నందన్‌పై అదే సంస్థకు చెందిన వ్యక్తి ఒకరు దాడికి దిగిన ఘటన కేరళలోని చెర్పూలో శు క్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రియా నందన్ తన ఫేస్‌బుక్ పేజీలో ఆరెస్సెస్, శబరిమల అంశాలపై రెండు రోజుల క్రితం పలు వ్యాఖ్యలు చేశాడు. శు క్రవారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయనపై ఆరెస్సెస్ వ్యక్తి ఒకరు దాడికి దిగారు. నీళ్లు కలిపిన ఆవు పేడను ఆయనపై పారబోసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని నందన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఒక్క వ్యక్తి చేసిన దాడి కాదని.. దీని వెనక కొంతమంది కుట్ర దాగి ఉన్నదని ఆయన ఆరోపించారు. నిందితుడిని ఇంకా గుర్తించాల్సి ఉంది. నందన్ ఫిర్యాదు మేరకు నిందితుడి మీద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, ఈ ఘటనను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. 2006లో ప్రియా నందన్ దర్శకత్వం వహించిన 'పులి జన్మ' చిత్రానికి నేషనల్ ఫిల్మ్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అవార్డును అందుకున్నారు.



## 'ఉజ్వల' ఉంటే పేదోళ్లు కారట..

- గ్యాస్ కనెక్షన్ పొందితే రేషన్ బంద్
- మోడల్ గుజరాత్ సర్కారు తీరిది

**అహ్మదాబాద్ :** నిరుపేద కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించాలన్న ఉద్దేశంతో మోడీ సర్కారు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. అదేందో గానీ అభివృద్ధికి మోడల్‌గా బీజేపీ చూపిస్తున్న గుజరాత్‌లో ఈ పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందగానే పేద ప్రజలు ఒక్కసారిగా ధనవంతులు అవుతున్నారట. ఆ రాష్ట్ర సర్కారు అవలంభిస్తున్న తీరుతో లబ్ధిదారులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. పంచామహల్ జిల్లా మెఖార్ మోర్వా గ్రామానికి చెందిన శారదాబెన్ మాన్‌సిన్హా అనే మహిళ ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందారు. ఇంకేముంది వెంటనే ఆమెది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న(బీపీఎల్) కుటుంబం కాదంటూ రేషన్ బంద్ చేశారు. ఇదేంటని రేషన్ షాపు నిర్వాహకుడిని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగానే తాము పని చేస్తున్నామంటూ ఆమెకు సమాధానమిచ్చాడు. గ్యాస్ కనెక్షన్ పొందిన వారు బీపీఎల్ పరిధిలోకి రారని, కిరోసిన్, ఇతర రేషన్ సరుకులు అందవని అతడు తేల్చి చెప్పాడు. సబార్కంఠ జిల్లాకు చెందిన మరో మహిళ లిలాబెన్ కొనాబాయి పరిస్థితి కూడా ఇంతే. ఉజ్వల కింద గ్యాస్ కనెక్షన్ పొందడంతో ఆమె కుటుంబానికి అంత్యోదయ పథకం వర్తింపజేయకుండా చేశారు అధికారులు. ఈ విషయం తెలియడంతో గ్యాస్ కనెక్షన్‌ను తిరిగి ఇచ్చేస్తానని, అంత్యోదయ పథకం ద్వారా రేషన్ సరుకులు ఇవ్వాలని ఆమె మొరపెట్టుకున్నా సంబంధిత అధికారులు కుదరదని తేల్చి చెప్పారు. ఉజ్వల పథకం లబ్దిదారులను బీపీఎల్ సెక్షన్‌లో నుంచి తొలగించి ఏపీఎల్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని ఆమె వాపోయారు.



ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ పొందిన చాలామంది లబ్దిదారులు పేదరికం కారణంగా మరోసారి గ్యాస్‌ను రీఫిల్ చేసుకోవడం లేదు. కనెక్షన్ సమయంలో వచ్చిన ఎల్‌పీజీ గ్యాస్ అయిపోగానే కట్టెల పొయ్యి, కిరోసిన్ స్టవ్‌లపై ఆధారపడాల్సిన దుస్థితి తలెత్తుతున్నది. వంటగ్యాస్‌పై ధరల బాదుడు కూడా దీనికి ఓ కారణమవుతున్నది. దీంతో లబ్దిదారులు బ్లాక్ మార్కెట్లో కిరోసిన్‌ను కొనుక్కోక తప్పడం లేదు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. ఉజ్వల పథకం(2016 ఫిబ్రవరిలో అమల్లోకొచ్చింది) ద్వారా గతేడాది జులై వరకు 4.7 కోట్ల మంది గ్యాస్ కనెక్షన్‌ను పొందారు. కానీ, వారిలో 2.70 కోట్ల మంది(58 శాతం) మంది మాత్రమే రెండోసారి గ్యాస్‌ను రీఫిల్ చేసుకోవడం గమనార్హం. మూడోసారికి ఈ సంఖ్య మళ్లీ తగ్గింది. దాదాపు 2 కోట్ల మంది(44 శాతం) మూడోసారి రీఫిల్ చేసుకున్నట్టు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

## ఈబీసీ 10 శాతం రిజర్వేషన్లపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

- 4 వారాల్లో సమాధానమివ్వాలని కేంద్రానికి ఆదేశం

**న్యూఢిల్లీ:** అగ్ర కులాలలోని పేదలకు(ఈడబ్ల్యూఎస్) 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం అమలు కాకుండా స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, 10 శాతం రిజర్వేషన్లకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణకు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల ధర్మాసనం అంగీకరించింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధర్మాసనం నోటీస్ జారీ చేసింది.

అగ్రకులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాజ్యాంగానికి 103వ సవరణ చట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థతోపాటు మరో ముగ్గురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేవలం ఆర్థిక వెనకబాటుతనంతో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివరణ తీసుకున్న తర్వాత సమగ్రంగా పరిశీలించనున్నట్టు ధర్మాసనం తెలిపింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## సాధించినవి 3,000 ఎన్‌కౌంటర్లు!

- జనవరి 26న వీటిని విజయాలుగా చాటిచెప్పాలనుకుంటున్న యూపీ సర్కారు
- బూటకపు ఎన్‌కౌంటర్లు తప్ప అభివృద్ధి శూన్యం : సమాజ్‌వాదీ పార్టీ

**లక్నో :** ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యానాథ్ హయాంలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లను ఈ గణతంత్ర దినోత్సవాల్లో ప్రభుత్వ విజయాలుగా చాటిచెప్పేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధమవుతున్నది. ప్రభుత్వ విజయాల జాబితాలో 2017 మార్చి నుంచి 2018 జూలై మధ్యకాలంలో జరిగిన 3,026 ఎన్‌కౌంటర్లనూ చేర్చింది. ఈ ఎన్‌కౌంటర్లను గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వం సాధించిన విజయాలుగా వివరించాల్సిందిగా యోగి సర్కారు భావిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుప్ చంద్ర పాండే జిల్లా మెజిస్ట్రేటులకు ఉత్తర్వులు జారీ చేశారు. 3,026 పోలీసు ఎన్‌కౌంటర్లలో 69 మంది 'నేరగాళ్లు' మృతి చెందగా, 838మంది గాయాలపాలైనట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్లతోపాటు స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) జరిపిన ఒక ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది నేరగాళ్లు చనిపోగా, పలు క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న 139 మంది అరెస్టయినట్టు వివరించారు. కాగా, ఎన్‌కౌంటర్లను ప్రభుత్వం సాధించిన విజయాలుగా చెప్పనుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి సునీల్ సింగ్ మాట్లాడుతూ.. 'విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనపై యోగి ప్రభుత్వం ఏమీ చేయలేదు. కానీ ఎక్కడబడితే అక్కడ బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నది. వీటిపై సీబీఐతో దర్యాప్తు నిర్వహించితే సీఎం సహా టాప్ పోలీసు అధికారులూ బయటకు వస్తార'ని విమర్శించారు. కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ స్పందిస్తూ.. 'రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోతున్నాయి. నిత్యం హత్యలు జరుగుతున్నాయి. ఈ 'బూటకపు ఎన్‌కౌంటర్ల'పై వివరణ ఇవ్వాల్సిందిగా రాష్ట్ర సర్కారుకు సుప్రీం కోర్టు ఇదివరకే నోటీసులు పంపింది. ఎన్‌కౌంటర్లను గొప్పగా చెప్పాలనుకుంటున్నదంటే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమలేవీ చేపట్టలేదని అర్థమవుతోంద'ని అన్నారు.



## ఎరుపెక్కిన పాట్నా

- కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన
- ఉత్తర్వులు జారీ చేసేవరకు సమ్మె: కార్మిక సంఘాలు

**పాట్నా:** కనీస వేతనం, సామాజిక భద్రత, కార్మిక చట్టాల అమలు కోసం బీహార్‌లో ఈ నెల 7 నుంచి వేల సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. గతవారం ప్రకటించినట్టుగానే 23న, 24న బీహార్ సీఎం నితీశ్ కుమార్ అధికారిక నివాసం వద్ద ఘెరావ్ కార్యక్రమాన్ని చేపట్టారు. దిగొచ్చిన నితీశ్ కుమార్ ప్రభుత్వం కార్మిక నేతలతో చర్చలు జరిపి వచ్చే నెల 1లోపు డిమాండ్లను పరిగణనలోకి తీసుకుంటామని హామీనిచ్చింది. అయితే దీనికి సంబంధించి అధికారికి ఉత్తర్వులు జారీ అయ్యేవరకు సమ్మె విరమించబోమని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.రాష్ట్రంలోని మొత్తం 38 జిల్లాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు రాజధాని నగరం పాట్నాకు కదలివచ్చారు. పాట్నాలోని గర్దానిబాగ్ పోలీసు స్టేషన్ నుంచి గర్దానిబాగ్ ప్రభుత్వ ఆస్పత్రి వరకు దారి పొడవునా ఎర్ర జెండాలు, బ్యానర్లు, పోస్టర్లతో కార్మికులు ఆందోళనకు దిగారు. బుధవారం(ఈ నెల 23) రాత్రి ఆ దారి పక్కనే వంటలు చేసుకుని తిని అక్కడే పడుకున్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో కార్మికులు ఈ నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఆందోళనకు దిగినవారిలో దాదాపు 90 శాతం మంది మహిళలే కావడం గమనార్హం. ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో చేపడతామని, తదుపరిగా తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ నేత వినోద్ కుమార్ హెచ్చరించారు.



# 90 శాతం పోలింగ్ నా కల

## జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్



'నా ఓటు' పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న గవర్నర్ తదితరులు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 90 శాతం పోలింగ్‌ను చూడాలన్నది తన "కల" అనితెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ జరిగేందుకు ఓటర్లను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు అందరి హక్కు అని, ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను నిందించకుండా అందరూ ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం మన చేతిల్లోనే ఉందని, ఓటు వేసి మీ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని యువతకు సూచించారు. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ విజయవంతంగా నిర్వహించారని గవర్నర్ కితాబిచ్చారు. ప్రధానంగా వికలాంగులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

**స్వేచ్ఛగా ఓటు వేస్తాం**

ఎటువంటి ఒత్తిళ్లలకు లోను కాకుండా స్వేచ్ఛగా, ఓటు వేస్తాం..అని జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో విద్యార్థుల చేత గవర్నర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటర్స్ హెల్ప్‌లైన్ 1950ను ప్రారంభించారు.

**పారదర్శంగా ముందస్తు ఎన్నికలు**

రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ రజత్‌కుమార్ మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు పోలింగ్ శాతాన్ని కూడా పెంచామని చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, రాష్ట్రంలో రీ పోలింగ్ జరపాల్సిన పరిస్థితి తలెత్తలేదన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను కూడా ప్రశాంతంగా నిర్వహిస్తామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం అన్ని రంగాల్లోనూ టాప్ 10లో ఉందన్నారు.

మన దేశం గొప్ప ప్రజాస్వామ్య దేశమని, ఇక్కడ అందరూ కలిసి మెలిసి ఉంటారని వివరించారు పంచాయతీ రాజ్ రెండో విడత ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్, అదనపు సీఈఓ ఆమ్రాపాలి, నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





## విద్యా ప్రమాణాల్లో తీసుకున్న చర్యలేవి?

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా మండల గ్రామ ప్రాంతాల్లోని ప్రభుత్వపాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుదలకు తీసుకునే చర్యల్ని వివరించాలనిప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విద్యా ప్రమాణాల్లో నాణ్యత పెంపునకు, విద్యార్థులు తగ్గిపోకుండా ఉండేందుకు తీసుకునే చర్యలపై నివేదికసమర్పించాలని విద్యా శాఖకు సూచించింది. మూడు వారాల్లో నివేదిక అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధా కృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనంస్పష్టం చేసింది. ప్రమాణాలు పడిపోయిన, డ్రాపౌట్స్ ఎక్కువ పాఠశాలల్లోవాటిని తగ్గించేందుకు తీసుకోబోయే అధ్యయన నివేదికను అందజేయాలని కోరింది.ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాల క్షీణతపై ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధిఆర్.వెంకటరెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ధర్మాసనం శుక్రవారంమరోసారి విచారించింది.రాష్ట్ర విద్యా అధ్యయన శిక్షణా మండలి(ఎస్‌సిఇఆర్‌టి) అభిప్రాయాల్ని కూడా ఆ నివేదికలో పొందుపర్చాలనిఅభిప్రాయపడింది. ప్రభుత్వ పాఠశాల్లో చదివే పిల్లల తల్లిదండ్రుల్లో విశ్వాసంపెంపొందించేందుకు, ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకుఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వన్యాయవాదిని ధర్మాసనం కోరింది. దశల వారీగా ఉన్నత ప్రమాణాలు కల్పించకపోతేనమ్మకమే సన్నగిల్లే ప్రమాదం ఉంటుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేసింది. గత మంగళవారం జరిగిన విచారణ సమయంలో విద్యా ప్రమాణాల వద్ధికి విద్యావంతులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచన చేసిన విషయం తెలిసిందే. విద్యా ప్రమాణాలు పెంపుకోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఉపాధ్యాయులకు తగిన శిక్షణఇస్తున్నామని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తరపున ప్రభుత్వ న్యాయవాది సి.వాణిరెడ్డి చెప్పారు.

## రాష్ట్ర పోలీసులకు 'రాష్ట్రపతి' పతకాలు

- ఒకరికి పీపీఎం, 13 మందికి ఐపీఎంలు
- అవార్డులు వరించిన వారికి డీజీపీ అభినందనలు



మధుసూదన్‌రెడ్డి



నారాయణ

**నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి**

విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన 14 మంది రాష్ట్ర పోలీసు అధికారులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాకరమైన రాష్ట్రపతి పోలీసు పతకాలను శుక్రవారం ప్రకటించింది. ఇందులో ఒకరికి విశిష్టమైన రాష్ట్రపతి పోలీసు పతకం, 13 మందికి ఇండియన్ పోలీసు మెడల్స్‌కు ఎంపిక చేశారు. రాష్ట్రపతి పోలీసు పతకాన్ని పొందిన వారిలో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్పీ ఎం.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. అలాగే ఇండియన్ పోలీసు మెడల్స్ పొందిన వారిలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ ఎస్.చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర పోలీసు పరిపాలనా విభాగం ఎస్పీ ఎం.నారాయణ, గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ ఫ్రాన్సిస్, 15వ టీఎస్ఎస్‌పీ బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్, భువనగిరి డీసీపీ ఇ.రామచంద్రారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం అదనపు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీఐడీ ఫింగర్ ప్రింట్స్ బ్యూరో డీఎస్పీ ఎస్.ప్రభాకర్‌రావు, సీఐడీ ఎస్‌సీఆర్‌బీ డీఎస్పీ వి.సూర్యచంద్రరావు, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఎస్ఐ ఖాజా మోయినుద్దీన్, వరంగల్ సీఎస్‌బీ ఎస్ఐ సయ్యద్ మక్బూల్ పాషా, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఏఆర్ ఎస్ఐ మహ్మద్ అలీ ఖాన్ ముక్తార్, ఎస్ఐబీ హెడ్ కానిస్టేబుల్ జివెల్ నర్సింహ్మారావు, ఏసీబీ వరంగల్ రేంజ్ కానిస్టేబుల్ మహ్మద్ అజీజుద్దీన్‌లు ఉన్నారు.

**పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలి : డీజీపీ**

రాష్ట్రపతి పతకాలు పొందిన అధికారులకు రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. దేశంలో అత్యంత విశిష్టమైన రాష్ట్రపతి పతకాలు పొందడం గర్వించదగ్గ విషయమని అన్నారు. పతకాలు పొందడం వలన వారి గౌరవం పెరగడమే గాక ఇటు పోలీసు శాఖ ప్రతిష్ట కూడా ఇనుమడిస్తుందని అన్నారు. అదే సమయంలో సమాజానికి సేవ చేసే దిశలో వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీని పతకాలు పొందిన కొందరు అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.







## రజత్‌కుమార్‌పై మర్రి ఆరోపణలు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ముందస్తు ఎన్నికల నిర్వహణపై కేసీఆర్ ఏం చెబితే ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ అదే చేశారని మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

## నిరుద్యోగులకు 'విస్డమ్' టోకరా

- నకిలీ ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్లు
- రూ.200 కోట్లు కొల్లగొట్టినట్టు అంచనా..

**నవతెలంగాణ- సిటీబ్యూరో**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో క్యూనెట్, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో రూ.100 కోట్లు కొల్లగొట్టిన మోసాలు మరువక ముందే హైదరాబాద్‌లో మరో ఘరానా మోసం వెలుగు చూసింది. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ మోసాలు వరుసగా బయటపడుతున్నాయి. ఉద్యోగాల పేరుతో భారత్‌తో పాటు విదేశాలకు చెందిన లక్షలాది మంది నిరుద్యోగులను విస్డమ్ జాబ్స్ సంస్థ భారీ స్థాయిలో మోసం చేసింది. సంస్థ డైరెక్టర్ అజయ్ కొల్లాతో పాటు సహ ఉద్యోగులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ శుక్రవారం మీడియాకు వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సజ్జనార్

హైదరాబాద్ నగరానికి చెందిన అజయ్‌కల్లా బీటెక్ పూర్తి చేశాడు. 2009లో మాదాపూర్ హైటెక్‌సిటీ భవనంలోని 7వ అంతస్తులో విస్డమ్ జాబ్ గల్ఫ్ డాట్ కామ్ పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించాడు. దీంతో పాటు విస్డమ్ పేరుతో మరో రెండు మూడు వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యవ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలిపిస్తామని ప్రచారం చేశాడు. కొందరిని తమ సంస్థలో నిర్వహణ కోసం నియమించుకున్నాడు. ఉద్యోగం కావాల్సిన వారికి రెజ్యూమ్ తయారు చేయడం, దానిని ప్రముఖ కంపెనీలకు పంపించడం, ఉద్యోగం వచ్చేలా చేయడం అంతా తామే చూసుకుంటామని నమ్మించారు. ఇందుకుగాను విదేశాల్లో 150 నుంచి 500 డాలర్ల వరకు ఫీజులుగా వసూలు చేసేవారు. మన దేశంలో రూ.10వేలకు పైగా తీసుకున్నారు. వీరి మాటలు నమ్మిన నిరుద్యోగులు వెబ్‌సైట్ల ద్వారా ఉద్యోగాల కోసం ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిగా దరఖాస్తు చేసుకున్నారు. అందులో కొందరికి రావన్ జనరల్ పెంట్రోలియం పేరిట ఫోన్లు చేసేవారు. వారి దరఖాస్తులను పరిశీలించామని అందుకు ఫోన్ ఇంటర్వ్యూ ఉంటుందనీ.. ఖర్చులకు ఇంకా డబ్బులు కావాలని వసూలు చేసేవారు. ఆ తర్వాత మరో వ్యక్తి ఫోన్ చేసి 40 నుంచి 50 నిమిషాల పాటు ఇంటర్వ్యూ నిర్వహించేవారు. తర్వాత మరో మహిళ ఫోన్ చేసి ఉద్యోగం వచ్చిందనీ, సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్నామనీ చెప్పేది. సెక్యూరిటీ డిపాజిట్ కింద డబ్బులు కట్టించుకునే వారు. ఇలా ఇండియాతోపాటు మిడిల్‌ఈస్ట్ సౌత్ ఆఫ్రికా, ఈజిప్ట్, ఖతార్, నెదర్లాండ్, జోర్డాన్, లెబనాన్, యూకె, శ్రీలంక, ఆస్ట్రేలియా, మలేషియా తదితర దేశాల్లో నిరుద్యోగుల నుంచి రూ.200 కోట్ల వరకు వసూలు చేసినట్టు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ సంస్థకు ఎలాంటి అనుమతులూ లేనప్పటికీ పదేండ్ల నుంచి నిరుద్యోగులను మోసం చేస్తోంది. ఏడు కొండలు అనే నిరుద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. ఈ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగుల డేటాను ఇతర కంపెనీలకు అమ్ముకుంటున్నట్టు తేలింది. బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ప్రధాన సూత్రధారి అజయ్ కొల్లాతో పాటు ఆయనకు సహకరించిన మరో 14 మందిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వారి బ్యాంకు ఖాతాల్లోని రూ.23 కోట్లను సీజ్ చేశారు.









## ప్రజలకు 'గణతంత్ర' శుభాకాంక్షలు : సీఎం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ గనతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజమైన సమాఖ్య స్ఫూర్తి ఫరిడవిల్లేలా భారత ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ బలపడాలని సీఎం ఆకాంక్షించారు.

**ప్రణబ్‌ముఖర్జీకి భారతరత్నపై హర్షం**

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రతిష్టాత్మక భారతరత్న పురస్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారానికి ప్రణబ్ ముఖర్జీ సంపూర్ణ అర్హుడని అభిప్రాయపడ్డారు. భారదేశం ప్రజాస్వామ్య వ్యవస్థలను పటిష్టపర్చడానికి రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రణబ్ ముఖర్జీ ఎంతో చొరవ చూపారని సీఎం కొనియాడారు.

## సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజకు అరుదైన గౌరవం

- వికలాంగులను ఓటర్లుగా నమోదు చేసినందుకు రాష్ట్రపతి అవార్డు



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న శైలజ

**నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో**

వికలాంగులను ఓటర్లుగా నమోదు చేయించడంలో కషి చేసిన తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి శైలజకు కేంద్ర ఎన్నికల సంఘం తరుపున ప్రత్యేక అవార్డు లభించింది. శుక్రవారమిక్కడ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 10 మంది ఉత్తమ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం అవార్డులను అందించింది. ఇటీవల తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికలలో వికలాంగులను ఓటర్లుగా నమోదు చేయించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నందుకు అవార్డు లభించినట్టు ఆమె వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా శైలజ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని వికలాంగులందరూ ఓటు వినియోగించుకోవాలన్న లక్ష్యంతో పని చేసినందుకు తగిన గుర్తింపు లభించిందని తెలిపారు. అంగ వైకల్యం ఓటు హక్కుకు అడ్డుకాదన్నదే తమ నినాదమని వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలిసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అంధులైన ఓటర్లకు ఏపిక్ కార్డు అందించామన్నారు. అదేవిధంగా అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించామని చెప్పారు. బధిరులకు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ బూత్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కల్పించామని వివరించారు. దాదాపు 21 విభాగాల్లో గల వికలాంగులకు ఓటు హక్కు కల్పించాలన్నదే తమ లక్ష్యంగా పెట్టుకొని కేవలం 45 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా దాదాపు 2 లక్షల 75 వేల వికలాంగులైన ఓటర్లను గుర్తించగలిగామన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్రపతి అవార్డు నూతనోత్సాహాన్ని నింపిందని ఆనందం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

# ప్రియాంక ప్రవేశం

ఎట్టకేలకు తాను బ్రహ్మాస్త్రంగా భావిస్తున్న ప్రియాంకను కాంగ్రెస్ పార్టీ బయటకు తీసింది. రోజురోజుకూ మోడీ గ్రాఫ్ పడిపోతున్నంత మేర కాంగ్రెస్ గ్రాఫ్ పుంజుకోవాలన్న తపన, మరోవైపు రాష్ట్రాల స్థాయిలో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌కు అతీతంగా ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతుండడంతో కాంగ్రెస్‌కు ప్రియాంకను బరిలోకి దింపడం అనివార్యమైంది. ముఖ్యంగా, కేంద్రంలో అధికారానికి కీలకమైన 80 పార్లమెంటు స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో తమను కనీసం సంప్రదించకుండా ఎస్పీ, బీఎస్పీలు జట్టుకట్టి తమ ముఖాన ముష్టి వేసినట్టుగా కేవలం రెండ్లు సీట్లు కేటాయించడంతో కంగుతున్న కాంగ్రెస్ ఆమెకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలు అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రియాంకాగమనం కాంగ్రెస్ శ్రేణులను కొంత ఉత్సాహపరచగలిగినప్పటికీ ఎన్నికల యుద్ధంలో ఏ మేరకు తోడ్పడగలదన్న దానిపై అనేక సందేహాలున్నాయి. ప్రియాంక కేంద్రీకరణ అంతా ఉత్తరప్రదేశ్‌కు పరిమితం కానున్న దృష్ట్యా అక్కడి తీవ్ర అననుకూల పరిస్థితులను ఆమె ఏ మేరకు చక్కదిద్ది పార్టీకి విజయం చేకూర్చగలరన్నది ప్రశ్న.

**ప్రజలకు ఇప్పుడు కావాల్సింది ఈ పాలనకు అన్ని రంగాలలో ప్రత్యామ్నాయం చూపగల నాయకత్వం. ఆ నాయకత్వాన్ని అందించేందుకు ప్రజాస్వామ్యవాదులు, ప్రజా శ్రేయోభిలాషులంతా తరలిరావాల్సిన తరుణమిది. లేకుంటే, పాలకుల ముఖాలు మారతాయే కాని, పాలనాతీరు మారదు. అది ఈ దేశానికి క్షేమదాయకం కాదు.**


మన దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి ఉత్తరప్రదేశ్ గుండెకాయ లాంటిది. ఈ దేశ ఎన్నికలలో కుల సమీకరణాల కీలకాన్ని అర్థం చేసుకున్న కాంగ్రెస్ అధినేతలు 85 పార్లమెంటు స్థానాలతో కూడిన ఉమ్మడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పరచుకున్నారు. ఉమ్మడి ఉత్తరప్రదేశ్‌లో భూ ఆధిపత్యం కలిగిన బ్రాహ్మణుల జనాభా 14.70 శాతం. ముస్లీంలు 19.03 శాతం కాగా, ఎస్సీలు 21.1 శాతం. బ్రాహ్మణుల నాయకత్వంలో 'బ్రాహ్మణ- ముస్లీం- దళిత' కలయికతో 50.4 శాతం ఓట్ బ్యాంకును ఏర్పరచుకున్న కాంగ్రెస్ పార్టీకి 1980వ దశకం వరకూ ఉత్తరప్రదేశ్‌తో పాటు దేశంలోనే తిరుగులేకుండా పోయింది. దేశమంతా కాంగ్రెస్ ప్రభంజనం వీచి జనతాపార్టీ అధికారంలోకి వచ్చినా అది మూన్నాళ్ల ముచ్చటే.. తిరిగి అధికారం కాంగ్రెస్ చేతికొచ్చింది. కాగా, సంఘ్ పరివార్ శక్తులు రామజన్మభూమి ఉద్యమయత్నాలు చేస్తున్న



తొలినాళ్లలో వారికి అవకాశం ఇవ్వకూడదని తలపోసిన నాటి ప్రధాని రాజీవ్ గాంధీ 1986లో వివాదాస్పద ' రామజన్మ భూమి- బాబ్రీ మసీదు' తాళాలు తొలగించి పూజలకు అనుమతినివ్వడంతో ముస్లిం ఓట్‌బ్యాంకు దూరమై మొదటి వేటు పడింది. 1989 ఎన్నికల్లో అప్పటికే ఓబీసీల సారథ్యంలో బలం పుంజుకుంటూ ఉన్న జనతాదళ్‌కు ముస్లిం ఓటు తోడవ్వడంతో కాంగ్రెస్ పతనం ప్రారంభమయ్యింది. అప్పటికే రామజన్మభూమి సమర్ధకులలో అత్యధికులైన అగ్రకులస్తులు బీజేపీ చెంత చేరారు. హీనమైన కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం ఎంచుకోవడం అనివార్యమై దళితులు బీఎస్పీని సృష్టించుకున్నారు. ఈ ఓట్ల పునస్సమీకరణ 1992 బాబ్రీ మసీదు కూల్చివేతతో పూర్తయి కాంగ్రెస్‌పార్టీ యూపీలో పూర్తిగా మునిగిపోయింది. లౌకికవాదులు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. ఇక అప్పటి నుంచీ ఇప్పటి వరకూ యూపీ ఎన్నికల యుద్ధరంగాన్ని ఎస్పీ, బీఎస్పీ, బీజేపీ ఆక్రమించగా కాంగ్రెస్ నామమాత్రంగా మిగిలిపోయింది. 2014 పార్లమెంటు ఎన్నికలలో 7 శాతం ఓట్లతో కేవలం రెండు (అమేథీ- రాహూల్, రాయ్‌బరేలి- సోనియా) సీట్లకే పరిమితమయిందంటే దాని దీనస్థితి అర్థంచేసుకోవచ్చు. ఇప్పుడు తాము జారవిడుచుకున్న వర్గాలను తిరిగి దగ్గర చేర్చుకునే మౌలిక విధానాలను ప్రకటించకుండా వ్యక్తి ప్రతిష్ట మీద ఆధారపడి పూర్వవైభవాన్ని పొందాలనుకోవడం అత్యాశే అవుతుంది.

ఈ దిశలో కాంగ్రెస్ పయనిస్తుండబట్టే, ఎస్పీ- బీఎస్పీల నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికల యుద్ధానికి ముందే ఘోర పరాభవం ఎదురయ్యింది. అయినా, ఎస్పీ- బీఎస్పీల నిర్ణయాన్ని తాము ఆహ్వానిస్తున్నామని రాహుల్ ప్రకటించక తప్పలేదు. ఈ నేపథ్యంలో ప్రియాంక ఆగమనం కాంగ్రెస్‌కు పెద్ద ప్రయోజనం చేకూర్చలేదనే చెప్పవచ్చు. అయితే, ఇదంతా కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారం. కానీ, పోలికలూ, వాగ్ధాటిపరంగా నాయనమ్మ ఇందిర ప్రతిరూపంగా కాంగ్రెస్ నేతలు ప్రచారం హోరెత్తించి ఓట్లు దండుకోవాలనుకోవడం మాత్రం ఆక్షేపణీయం. ప్రజలకు కావాల్సింది. రూపలావన్యాలు, హావభావ విన్యాసాలు కావు. నాయకుల వ్యక్తిగత ఆకర్షణలు ప్రజల భవిష్యత్‌కు హామీ ఇవ్వలేవు. అవును! ఈ ఐదేండ్లలో మోడీ ప్రజావ్యతిరేక, మనువాద పాలనలో క్షణమొక నరకం, దినమొక గండంగా రోజులెళ్లదీస్తున్న ప్రజలకు ఇప్పుడు కావాల్సింది ఈ పాలనకు అన్ని రంగాలలో ప్రత్యామ్నాయం చూపగల నాయకత్వం. ఆ నాయకత్వాన్ని అందించేందుకు ప్రజాస్వామ్యవాదులు, ప్రజా శ్రేయోభిలాషులంతా తరలిరావాల్సిన తరుణమిది. లేకుంటే, పాలకుల ముఖాలు మారతాయే కాని, పాలనాతీరు మారదు. అది ఈ దేశానికి క్షేమదాయకం కాదు.

# రాజ్యాంగం మౌలిక విలువలకు ముప్పు



**ఆర్. రాజేశమ్**

నేడు భారత జాతి 70వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నది. 1950లో ఇదే రోజున అంబేద్కర్ మహనీయుడు అందించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భానికి గుర్తుగా.. దేశ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల సాఫల్యానికి చిహ్నంగా ఈ గణతంత్ర సంబరాలు నిలుస్తాయి.

స్వాతంత్ర్యానంతరం... సుమారు రెండేండ్ల పాటు దేశవ్యాప్తంగా జరిగిన చర్చోపచర్చల పర్యవసానంగా దేశం గణతంత్రంగా అవతరించింది. ఎందరో త్యాగధనుల పోరాటాల ఫలితంగా సముపార్జించిన స్వాతంత్ర్యాన్ని.. అంతకు ముందున్న

**ఈ దేశంలో సామాజిక న్యాయం వెల్లివిరియడం, అసమానతల మను వ్యవస్థ అంతం కావడమనేది ఏ కొందరి ప్రయోజనాల కోసమో కానే కాదు. మనువాదం అంతమయితేనే భారత జాతి ఐక్యంగా నిలబడగలదు. భారత దేశ ఐక్యత, సమగ్రత.. భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమసమాజ భావనల పైన ఆధారపడి ఉన్నది. మనువాదుల విషపు పడగల నుండి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, నేడు దేశ భక్త పౌరులందరి ప్రథమ కర్తవ్యంగా నిలిచి ఉన్నది.**

రాజులూ మహారాజుల చేతుల్లో పెట్టకుండా.. ప్రజలనే ప్రభువులుగా ప్రకటిస్తూ ప్రజాతంత్రంగా మారడం.. గణతంత్ర దినోత్సవ విశిష్టతకు నిదర్శనం. నేడు దేశంలో స్వైర విహారం చేస్తున్న మతోన్మాద మనువాద మూకలు.. నాడు.. పంద్రాగస్టుకు, చబ్బీస్ జనవరికి మధ్యనున్న రెండేండ్ల సంధి కాలంలో సైతం జబర్దస్తీ చేస్తూ.. తమ తిరోగామి పంథాని దేశ ప్రజల మీద రుద్దాలని ప్రయత్నించారు. స్వతంత్ర భారతం ఏ పంథాలో నడవాలి.. దేశంలో ఏ రాజకీయ వ్యవస్థను నిలపాలి అనే అంశంపై ఆరెస్సెస్, హిందూ మహాసభ, రామరాజ్య పరిషద్ ఇత్యాది సంస్థలు.. తమ రాచరిక అనుకూల ధోరణులకు అనుగుణమైన ప్రతిపాదనలు తీసుకొచ్చారు. పైగా తాము చెప్పినదే సనాతన భారతీయ పంథా అంటూ.. ప్రజాస్వామ్యమనే విదేశీ పోకడలు మనకొద్దు అంటూ దుష్ప్రచారం మొదలుపెట్టారు. బ్రిటిష్ వాడిని వెల్లగొట్టాము కాబట్టి.. ఆ బ్రిటీషువాడు ఎవరినైతే కూలదోసాడో.. ఆ దేశీయ రాజులు, మహారాజులను మళ్లీ తీసుకొచ్చి, వాళ్లకి మళ్లీ పట్టం కట్టి, అధికారం వాళ్ళ చేతుల్లో పెట్టడమే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం అంటూ విపరీత వ్యాఖ్యానాలు చేశారు. ఈ కుత్సిత వాదనలన్నింటినీ గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేద్కర్, మౌలానా అబ్దుల్ కలాం.. ఇతర జాతీయ నాయకులు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఇక వెనక్కి పోయేది లేదు.. దేశం చూపు ముందు వైపే ఉంటుందటూ స్పష్టీకరించారు. దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య గణతంత్రం వైపు నడిపించారు.

బ్రిటిష్ వాడి వలసవాద సంకెళ్ళు మన దేశాన్ని చుట్టుముట్టక ముందు.. వలసవాదంతో పోలిస్తే మరింత విషపూరితమైన మనువాద వ్యవస్థ ఈ దేశంలో రాజ్యమేలింది. సుమారు మూడు వేల ఏండ్ల పాటు మనువాద వ్యవస్థ పన్నిన విషవలయంలో ఈ దేశం బందీ అయింది.. బానిసగా బతికింది. మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన అమానుష వ్యవస్థ - మనుధర్మం. కాయకష్టం చేసి సంపదను సృష్టించే శ్రమజీవులను శూద్రులను, ఛండాలురను చేసి.. ఏ పనీ చేయకుండా సోమరిపోతులుగా మెలగుతూ, పక్క వాడి కష్టార్జితాన్ని దోచుకుతినే స్వార్థపరులను ఉన్నత స్థానంలో నిలబెట్టింది ఈ మను వ్యవస్థ. 90 శాతంగా ఉన్న శ్రామిక జనాలను బానిసలుగా మార్చేసింది. రాజ్యమేదైనా, రాజులెవరైనా, వంశమేదైనా.. భారత ఉపఖండమంతటా మనుస్మృతియే రాజ్యాంగంగా అమలయింది. భారతీయులందరూ వేల ఏండ్లుగా పూజించిన గ్రంథాలన్నీ ఒకటే నీతి బోధించేవి. రాజులు ఎవరైనా సరే.. ధర్మం తప్పక పరిపాలన కొనసాగించాలని. ధర్మమంటే.. మనుధర్మమే! శ్రీరాముడంతటివాడు సైతం శంభూకుడి తలను నిర్దాక్షిణ్యంగా తెగనరికింది.. అందుకోసమే!

మన రాజ్యాంగం విశిష్టత ఏమిటంటే.. రెండువందల ఏండ్ల బ్రిటిష్ వాడి బానిసత్వాన్ని నిర్మూలించడం తోటే ఆగిపోలేదది. బ్రిటీషువాడు రాకముందు.. మూడు వేల ఏండ్ల పాటు ఈ దేశంలో రాజ్యమేలిన మనుస్మృతి తీసుకొచ్చిన కులవ్యవస్థ బానిసత్వాన్ని సైతం రాజ్యాంగం భూస్థాపితం చేసింది. వేల యేండ్ల మన దేశ చరిత్రలో.. రాజ్యాంగ అవతరణ తర్వాతనే.. మొట్టమొదటిసారిగా దేశ ప్రజలందరికీ కుల మత ప్రాంత లింగ విభేదాలు లేకుండా సమాన హోదా లభించింది. మనిషిని మనిషిగా చూసింది.. మనుషులందరికీ ఈ దేశంలో మొదటిసారిగా సమాన హక్కులనిచ్చింది... రాజ్యాంగమే. ఈ గడ్డ మీద పుట్టిన మనుషులందరూ సమానులేనన్న మానవతా సూత్రాన్ని మొట్టమొదటిసారిగా శాసన బద్ధం చేసింది మన భారత రాజ్యాంగం!

సామాజిక విప్లవ మూర్తులు బుద్ధుడు పూలే అంబేద్కర్‌లు కొట్టిన సమ్మెట దెబ్బల కారణంగా తమ ప్రాభవాన్ని కోల్పోయిన కులదురహంకారుల ముఠా.. తమ స్వార్థ ప్రయోజనాలకు రక్షణగా ఉన్న కుత్సిత మనుధర్మాన్ని ఎట్లాగైనా దేశం మొత్తం మీద పునస్థాపించాలనే కుతంత్రంలో భాగంగానే 1925లో ఆరెస్సెస్‌ను స్థాపించారు. 18వ శతాబ్దంలో... మహారాష్ట్రలో పీష్వాలుగా రాజ్యాధికారం చెలాయించిన "చితపవన్" బ్రాహ్మణులు... మనువ్యవస్థను నూటికి నూరుపాళ్ళూ నిర్దాక్షిణ్యంగా అమలు పరిచారు. దళితులను పశువుల కంటే హీనంగా చూసే "ముడ్డికి చీపురు... మూతికి ముంత" విధానం వీళ్ళ హయాంలోనే అమలయింది. దేశ ప్రజలలో స్వేచ్ఛా స్ఫూర్తిని నింపిన ఇంగ్లీష్ విద్యకు తోడు.. మానవతామూర్తులు తీసుకొచ్చిన సాంఘిక తిరుగుబాట్ల కారణంగా.. మరణశయ్యకు చేరువైన మనుధర్మాన్ని... జాతీయత, దేశభక్తి అనే మాయమాటలతో... ఎలాగోలా పునరుజ్జీవింపచేయాలనే తలంపే ఆరెస్సెస్ ఆవిర్భావానికి కారణమయింది. మహారాష్ట్రలోని నాగపూర్ ఈ సంస్థకు కేంద్ర స్థానం కావడం.. హిందూత్వ నాయకులంతా మహారాష్ట్ర 'చితపవన్' బ్రాహ్మణులే కావడము వెనుకనున్న మతలబు అదే!

మనుస్మృతి ఆరెస్సెస్ దృష్టిలో అతి పవిత్రమైనది. హిందూమతానికి మనువాదం, కులవ్యవస్థే కీలకమనీ... అవి లేకపోతే హిందూమతమే లేదని ఆరెస్సెస్‌వారు ప్రగాఢంగా విశ్వసిస్తారు... ఆచరిస్తారు. "వేదాల తర్వాత.. హిందువులకు అత్యంత పవిత్రమైనది మనుస్మతి" అని సావర్కార్ పేర్కొంటాడు. ఆరెస్సెస్ రెండవ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ తన రచన 'బంచ్ ఆఫ్ థాట్స్'లో.. "అసమానతలు పక తిలో భాగం... కులాల పేరిట అసమానతల్లో తప్పేమీలేదు" అని స్పష్టీకరిస్తాడు. ప్రపంచంలోనే గొప్ప స్మృతికారుడైన మనువు రాసిన చట్టాలను హిందువులందరూ విధిగా పాటించాల్సిందేనని తేల్చి చెబుతాడు.

దేశ ప్రజలని కులాల వారీగా చీల్చి దేశ అనైక్యతకు, వెనుకబాటుతనానికీ మూలకారణంగా నిలిచిన మనుస్మృతియే అసలు రాజ్యాంగంగా భావిస్తున్న మనువాద శక్తులు.. మొదటి



నుంచి భారత రాజ్యాంగాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. అందులోనూ.. మనుస్మతి ప్రకారం హీన జాతి వాడైన అంబేద్కర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచన జరగడం మనువాదులకు మింగుడు పడని విషయంగా పరిణమించింది. "మనువు స్థానంలో పంచముడైన అంబేద్కర్ని ఎట్లా ఒప్పుకుంటాం..?" అంటూ దురహంకార పూరితంగా హుంకరించారు. స్వతంత్ర భారత రాజ్యాంగం.. మనుధర్మ సూత్రాలకు అనుగుణంగా ఉండాలంటూ డిమాండ్ చేసారు. 26 నవంబరు 1949న దేశ రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని స్వీకరించిన తరువాత.. 30 నవంబరు 1949 సంచికలో ఆరెస్సెస్ అధికార పత్రిక "ఆర్గనైజర్" భారత రాజ్యాంగాన్ని తూలనాడుతూ ఇలా రాసింది: "భారతదేశానికి రాజ్యాంగం ఇప్పుడు కొత్తగా రాయాల్సిన అవసరం లేదు. ప్రాచీన కాలంలో మనువు రాసిన సూత్రాలు ఉన్నప్పటికీ వాటి ప్రస్తావనే రాజ్యాంగంలో లేకపోవడం పెద్ద అపరాధం. ప్రపంచానికే ఉత్తేజంతో దారి చూపగల ఆరాధనపూరితమైన మనుధర్మ శాస్త్రం.. అంబేద్కర్‌కూ, రాజ్యాంగ పండితులకూ గుర్తు కూడా రాలేదు"

నేటి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తన గురువుగా చెప్పుకునే ఎం.ఎస్. గోల్వాల్కర్ (ఆర్‌ఎస్‌ఎస్ రెండవ సర్ సంఘచాలక్) అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అసలు విలువ లేనిదంటూ తేల్చిపారేశాడు. "పాశ్చాత్య దేశాల రాజ్యాంగాల నుంచి అక్కడో ముక్క, ఇక్కడో ముక్క పేర్చి.. భారత రాజ్యాంగమంటూ వీళ్ళు మనకు చూపెడుతున్నారు. అంబేద్కర్ రాసిన ఈ రాజ్యాంగంలో భారతీయమైనదంటూ ఏదీ లేదు.. అంతా పరాయిదే" నంటూ తేల్చేసాడాయన. కులం పేరుతో తన సోదరులను బానిసలుగా చూడడం గోల్వాల్కర్ గారి దృష్టిలో భారతీయత. దేశ ప్రజలందరూ సమానులేనని చెబితే.. అది పరాయి భావన. ఇలా ఉన్నది ఈ దేశ భక్తుల కుతర్కం!

నాడు దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనకుండా విదేశీ ప్రభువులకు వత్తాసు పలికిన సంఘ పరివారం.. నేడు స్వతంత్ర భారత రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకుని ఢిల్లీ గద్దెపై కూర్చున్నది. తన రాజకీయ అంగమైన బీజేపీ ద్వారా నేడు ఆర్ ఎస్ ఎస్ దేశ పరిపాలనను తన చేతుల్లోకి తీసుకున్నది. స్వయంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అయిన నరేంద్ర మోడీ నేడు రాజ్యాంగం మీద ప్రమాణం చేసి దేశ ప్రధాని పదవిలో కూర్చున్నాడు. అయితే సంఘ పరివారపు భావజాలంలో భారత రాజ్యాంగం పట్ల వ్యతిరేకత ఏ మాత్రమూ తగ్గలేదు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాదు.. మనుస్మ తియే మాకు శిరోధార్యమంటూ ఎన్నో సార్లు ఆర్‌ఎస్‌ఎస్ నేతలు తేల్చి చెప్పారు. 1992లో డిసెంబర్ ఆరెస్సెస్ ఏర్పాటు చేసిన ధర్మసంసద్‌లో ప్రస్తుత రాజ్యాంగం హిందూవ్యతిరేకమైనదనీ.. మనుస్మతిని రాజ్యాంగంగా స్వీకరించాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించారు. మోడీ క్యాబినెట్ లోని మంత్రి అనంత్ కుమార్ హెగ్డే 2016 డిసెంబర్ లో కర్ణాటకలో ఒక కుల సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిందే రాజ్యాంగాన్ని మార్చడానికి.. కాబట్టి ఖచ్చితంగా రాజ్యాంగాన్ని మార్చి తీరుతామని తేల్చి చెప్పాడు.

నేడు కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్న సంఘ్ పరివార్ నేతలు భారత రాజ్యాంగం పట్ల కపట భక్తిని ప్రదర్శిస్తున్నారు. మానవతా మూర్తులైన సాంఘిక విప్లవకారులు తీసుకొచ్చిన మార్పుల వలన నేడు మనువాదం బలహీన పడింది కాబట్టి.. సమయం కోసం వేచి చూస్తున్నారు. దేశ ప్రజల్లో క్రమక్రమంగా మతోన్మాద, మనువాద విషబీజాలను నాటి దేశంలో మళ్లీ మనువాద రాజ్యాన్ని స్థాపించాలనేదే వారి కుట్రల సారాంశం. దేశ ప్రజలలో సమతా, మమతా వెల్లివిరిసి.. అభివ ద్ధి పథంలో దేశం సమున్నతంగా ముందడుగు వేయాలని ఆకాంక్షించే దేశభక్త పౌరులందరూ నేడు మతోన్మాద - మనువాద ముఠాల కుతంత్రాల పట్ల జాగ్రత్త వహించాలి. ఈ దేశంలో సామాజిక న్యాయం వెల్లివిరియడం, అసమానతల మను వ్యవస్థ అంతం కావడమనేది ఏ కొందరి ప్రయోజనాల కోసమో కానే కాదు. మనువాదం అంతమయితేనే భారత జాతి ఐక్యంగా నిలబడగలదు. భారత దేశ ఐక్యత, సమగ్రత.. భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సమసమాజ భావనల పైన ఆధారపడి ఉన్నది. మనువాదుల విషపు పడగల నుండి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, నేడు దేశ భక్త పౌరులందరి ప్రథమ కర్తవ్యంగా నిలిచి ఉన్నది.

సెల్ : 9440443183

మెయిల్ @ నవతెలంగాణ

## యెల్లో జాకెట్ ఉద్యమం

**అథర్వ్**

సుమారు రెండు మాసాలుగా ఫ్రాన్సులో పచ్చ జాకెట్ ఉద్యమం(యెల్లో జాకెట్ మూవ్‌మెంట్) నడుస్తోంది. ఇంధనంపై పన్ను పెంపునకు నిరసనగా 17 నవంబరు, 2018 నుంచి ఈ ఉద్యమం మొదలయింది, ఇంకా నడుస్తున్నది. తీవ్రమైన ప్రదర్శనలు ఎదురవటంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ ఇంధనంపై పన్ను ప్రతిపాదన రద్దు చేసినా ఉద్యమం మాత్రం ఆగలేదు. ఇంధన చమురు ధర పెంచిన కారణంగా ఉద్యమం మొదలయినా దాని విస్తృతి, తీవ్రత పెరగుతున్నకొద్దీ డిమాండ్లు కూడా పెరిగినాయి. ఉద్యమకారులు ఈ డిమాండ్లన్నీ ప్రజా ప్రయోజనానికేనని అంటున్నారు. కనీస పింఛన్, పన్ను నిర్మాణంలో సమూల మార్పులు, పదవీ విరమణ వయసు తగ్గింపు సహా 40 కంటే ఎక్కువ డిమాండ్లు ఉన్నాయి వారి జాబితాలో. ఈ డిమాండ్లున్నప్పటికీ 'పచ్చ జాకెట్' ఉద్యమం మెల్లమెల్లగా ఫ్రాన్సు అధ్యక్షుడి ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఇంకా విస్తృతమైన ఉద్యమంగా మారింది. ఉద్యమం తీవ్రత పెరగటంతో పాటు పోటీగా హింస కూడా పెరిగింది. నిరసనకారులను అడ్డుకోవటానికి మొదటి దశలో ప్రభుత్వం 90వేలమంది పోలీసులను దింపింది. జాతీయ రహదారి అవరోధం నుంచి చమురు డిపోలు, పెట్రోల్ పంపుపై దాడిసహా పోలీసుతో పెద్దఎత్తున సంఘర్షణ కూడా చోటుచేసుకుంది. ప్యారిస్ నగరపు అబిజాతవర్గాలు ఉండే ప్రాంతంలో పెద్ద పెద్ద దుకాణాలు, బ్యాంకులపై దాడులు జరిగాయి. వాహనాలు తగలబడినాయి.చావులు, గాయాలు, వేలకొద్దీ అరెస్టుల సంఘటనల విషయంలో ఇతర ఉద్యమాలను మించిపోయింది ప్రస్తుత ఉద్యమం. ఫ్రాన్స్‌లో ప్రతి వాహన డ్రైవర్ ఒక ఫ్లోరిసెంట్ (చీకటిలోమెరిసేది) జాకెట్ పెట్టుకోవాలి. ప్రదర్శనకారులు ప్రతీకగా ఈ పచ్చ జాకెట్ వేసుకుని వీధుల్లోకి వస్తున్నారు కనక వారి ఉద్యమానికి 'జిలెజూన్' అంటే పచ్చ జాకెట్ పేరు వచ్చింది. సుమారు రెండు నెలల నుంచి నడుస్తున్న ఈ ఉద్యమం, ప్రదర్శనలు ఫ్రాన్స్ నగరాల నుంచి గ్రామాలకు పాకాయి. ప్రతి సెలవు రోజైన శనివారం ప్రదర్శనకారులు ఇప్పటికీ వీధుల్లోకి వస్తున్నారు. కేవలం సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా స్వయం స్ఫూర్తితో ఉద్యమ సమీకరణ జరుగుతోంది. బహిరంగంగా ఏ రాజకీయ పక్షం కూడా ముందు పీఠాన లేకపోయినా వామపక్షాలు సహా చాలా మంది సమర్థన ఉన్నది. ఉద్యమం తీవ్ర రూపం దాల్చినప్పుడు ఒక దశలో ఈఫిల్‌టవర్ నుంచి లూవర్ మ్యూజియంసహా పారిస్‌లో అన్ని ఆసక్తి స్థలాలు మూసేయాల్సి వచ్చింది. దుకాణాలు ప్రస్తుతం తెరిచినా చీకటి పడగానే అవి మూతపడుతున్నాయి. ఉద్యమం మొదటి దశలో నిరసనకారులు, పోలీసు దాడి చేసే ధోరణిలో ఉన్నా ఇప్పుడు మాత్రం అదంతా చాలా మటుకు సద్దుమణిగింది. కానీ ఉద్యమం మాత్రం ఆగలేదు.

విస్తృతమైన నిరసనల కారణంగా ఫ్రెంచి ప్రభుత్వం ఆఖరుకి వెనక్కి తగ్గి ఇంధనం ధర పెంపుదల ప్రస్తావన ఆరు నెలల కోసం నిలిపి వేసింది. ఈ ఆరు నెలలలో ప్రభుత్వ, ఉద్యమకారుల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతాయని ప్రభుత్వం హామీ ఇచ్చింది. చర్చల ఆధారంగా ఏ సూత్రం ఏర్పడితే దానిబట్టే ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడుతుంది. కాని ఈ ప్రభుత్వ హామీని ఉద్యమకారులు పెడచెవిన పెట్టారు. నిరసనలు అలాగే సాగుతున్నాయి. అసలు సమస్య ఉండిపోయిందనేది వారి వాదన. పింఛను పెంపు, పన్నుల నిర్మాణంలో సమూల మార్పులు, దిన వేతనాల పెంపు వంటి డిమాండ్ల సంగతేమనేదాని గురించి ప్రభుత్వం ఏమీ చెప్పటం లేదు. కానీ ఉద్యమకారుల కొన్ని డిమాండ్లను ఒప్పుకుని ప్రభుత్వం వెనక్కి తగ్గటంతో ఫ్రాన్స్ ప్రభుత్వం ఇప్పటి నుంచి ఒకటి తరువాత ఒకటి సంఘటనల ఒత్తిడి ఎదుర్కోవల్సి వస్తుంది. 2017లో అధ్యక్షుడు మాక్రాన్ అధికారంలోకి వచ్చిన తరువాత తన విధానపరమైన వైఖరి నుంచి పక్కకు జరిగి నిరసనకారులకు కొన్ని రాయితీలు ఇవ్వటం ఇదే మొదటి సారి. రాజకీయ వర్గాల అభిప్రాయం ప్రకారం ఫ్రాన్స్ దేశం ఇటీవల చరిత్రలో ఇదే అన్నిటికంటే పెద్ద ప్రజా నిరసన. జనవరి 12న 80వేలమంది పచ్చ జాకెట్ వేసుకున్నవారు ఫ్రాన్స్‌లో వివిధ నగరాల్లో తీవ్రమైన నిరసన తెలియజేశారు. విద్యా రంగంలో సంస్కరణలు, ఉద్యోగ- కార్మికుల పని గంటలు పెంచటం, శ్రామిక చట్టాల సంస్కరణల పేరుతో ఉద్యోగ- కార్మికుల ప్రయోజనాలను దెబ్బ తీయటం, ఉద్యమాలు చేసే హక్కుపై పరిమితులు విధించే ప్రయత్నం వగైరాకు వ్యతిరేకంగా ప్రభుత్వోద్యోగులు, రైల్వే, తపాలాశాఖ సహా వివిధ వృత్తుల్లో ఉన్న కార్మికులు ప్రభుత్వ వ్యతిరేక ధోరణిలో ఉన్నారు. 2017లో అధికారంలోకి వచ్చి మాక్రాన్ ఫ్రాన్స్ ప్రజల మధ్య ఐక్యత సాధించటం తన మొదటి పనిగా ఉంటుందని హామీ ఇచ్చారు. పచ్చ జ్యాకెట్ ఉద్యమం కారణంగా అతని ఆ హామి దెబ్బ తిన్నది. ప్రజాభిప్రాయ సమీక్షలో అధ్యక్షుడు మాక్రాన్ పట్ల ప్రజా సమర్థన కనిష్ఠస్థాయికి చేరుకున్నదని వెల్లడైంది.


# లాభాలపై సీలింగ్ లేనందుకే ఈ అసమానతలు



**జి. తిరుపతయ్య**

"అందరం కలిసి చేసిన ఈ అందమైన వస్తు సముదాయం అంతా, ఎక్కడో ఒక్కడే వచ్చి ఎత్తుకు పోతూ ఉంటే చూసి, అన్యాయం అన్యాయం.. ఘోరం ఇది! దారుణం ఇది!... అంటే, ఆచారం... అడుగు దాటరాదు అంటాడు, అనుభవించాలి మీ కర్మం అంటాడు" 1937లో మహా కవి శ్రీ శ్రీ రచించిన ఈ కవిత, దాదాపు 90 ఏండ్ల తర్వాత కూడా స్వతంత్ర భారతదేశానికే కాదు, అంతర్జాతీయ పరిస్థితులకూ అద్దం పడుతోంది...! గద్దెనెక్కిన ప్రతివాడు "ఉద్ధరిస్తాను" అని శపథం చేస్తాడు. కానీ ఎవరిని ఉద్ధరిస్తున్నాడు? ప్రతి నెలా, ప్రతి సంవత్సరం ప్రభుత్వ ప్రైవేటు సంస్థల నివేదికలలో బయట పడుతున్న అసమానతలూ, అంతరాలే మరింత తీవ్రమవుతూ మళ్లీ మళ్లీ అవే పునరావృతమవుతున్నాయి. అంతర్జాతీయ హక్కుల సంస్థ గా పేరున్న ఆక్స్‌ఫామ్ 19 జనవరిన ఇచ్చిన రిపోర్టు దిగ్భ్రాంతికర సమాచారాన్ని బయట పెట్టింది. అన్ని దేశాల్లోనూ అధికార పీఠం కోసం గడ్డి కరుస్తున్న నేతల ఆశ్రిత విధానాలే ఇందుకు దారితీశాయా? లేక మరి ఏమైనా కారణాలు ఉన్నాయా? ప్రభుత్వాలు కనీసం కారణమైనా అన్వేషణ చేయాలి. ఎందరు ఎన్ని నిర్ధారణలు చేసినా పెట్టుబడికి ఉన్న అతి క్రూరమైన లక్షణం కళ్ళెం లేని "లాభాపేక్ష". ఇదే ఈ అవినీతికి, అసమానతలకు కారణం.

ఆక్స్‌ఫామ్ రిపోర్టు ప్రకారం, ప్రపంచంలో కేవలం 26 మంది దగ్గర 380 కోట్ల జనాభా దగ్గర ఉన్నంత సంపద ఉన్నది. గత సంవత్సరం 47 మందిగా ఉన్న ఈ సంఖ్య ఈ యేడాది 26 మందికి తగ్గింది. దీనిని బట్టి ఎంత త్వరితంగా సంపద కేంద్రీక తమౌతుందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో కేవలం తొమ్మిది మంది దగ్గర ఉన్న సంపద దేశంలో తక్కువ ఆదాయం కలిగిన 70 కోట్ల మంది దగ్గర ఉన్న సంపద తో సమానంగా ఉన్నది. కేవలం తొమ్మిదిమంది ఇంత సంపదను కలిగి ఉండటం సమంజసమేనా? భారత్‌లో 10 శాతం జనాబా దగ్గర 77.4 శాతం సంపద చేకూరి ఉన్నది. ఒక శాతం మంది దగ్గర 51.5 3% సంపద ఉన్నది. 60 శాతం ప్రజలు కేవలం 4.8 శాతం మాత్రమే సంపద కలిగి ఉన్నారు. మన దేశంలో 13.6 కోట్ల మంది కడు పేదరికంలో మగ్గుతూ 2004 నుంచి అప్పులతోనే బతుకీడుస్తున్నారు. ఒక్క పూట భోజనం చేయలేనివాళ్లు, చిన్న పిల్లలకు వైద్య అవసరాలు తీర్చలేని వాళ్ళు కోట్లలో ఉన్నారు. చిన్నపిల్లల మరణాల రేట్లు ఇట్లాంటి పేదవాళ్ళ లో మూడు రెట్లు ఇతరులకన్నా అధికంగా ఉన్నాయి. భారత్ లో గత సంవత్సరం బిలియనీర్ల సంఖ్య 101. ఈ సంవత్సరం మరో 18 మంది చేరి అది 119గా నమోదైంది. ఈ బిలియనీర్ల ఆదాయాలు సగటున రోజుకు 2,200 కోట్లు పెరుగుతున్నాయి. 2018లో బిలియనీర్ల ఆదాయం 39 శాతం పెరిగింది. అదే సగటు భారతీయుని ఆదాయం కేవలం మూడు శాతం మాత్రమే పెరిగింది. 2018లో వీరి సంపద 32 లక్షల కోట్లకు చేరింది. ఇది 2017 లో 22 లక్షల కోట్లు గా ఉన్నది. ఒక్క సంవత్సరంలో వంద మంది ఆదాయం పది లక్షల కోట్లు పెరగటం ఖచ్చితంగా ప్రమాదకరమైన ఆర్థిక వ ద్దికి సంకేతమే. 2008లో ఏర్పడిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత ఇంత శాతంలో ధనికుల ఆదాయాలు పెరగడం ఇదే మొదటిసారి. ఇట్లాంటి బిలియనీర్లు అందరూ వారి ఆదాయంపై 0.5 శాతం అదనంగా పన్ను చెల్లిస్తే ప్రభుత్వాలు




ఇప్పుడు ఖర్చుపెడుతున్న ఆరోగ్యంపై మరొక 50 శాతం ఎక్కువగా కర్చు పెట్టవచ్చు. భారత్‌లో హ దయ విదారకమైన దుర్భర పరిస్థితులు కనిపించేది ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే. తెలంగాణా రాష్ట్రం ఇంతగా అభివ ద్ది పథంలో ఉన్నదని చెప్పే నాయకులు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులను సందర్శిస్తే వాస్తవం తెలుస్తుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వైద్యం, ఆరోగ్యం, శానిటేషన్ మరియు నీటి సరఫరా వంటి వాటిపై చేస్తున్న ఖర్చు 2,08,166 కోట్లు. దేశ అత్యంత ధనికుడు ముఖేష్ అంబానీ యొక్క ఆస్తులు 2,80,000 వేల కోట్లు. ఈ గణాంకాలు ఇలాగే కొనసాగితే ఆర్థిక సంక్షోభంతో పాటు సామాజిక సంక్షోభాలు తలెత్తుతాయని ఆక్స్‌ఫామ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ బిలియనీర్ల సంపద 12 శాతం పెరిగితే సగటున ప్రపంచ పేదల ఆదాయంలో 11% తిరోగమన వద్ధి(తగ్గుదల) ఉన్నది. ప్రపంచ ధనవంతుడైన అమెజాన్ అధినేత సంపద 11,200 కోట్ల డాలర్లు.

ఇంతటి దారుణమైన అసమానతలకు కారణం ఎవరు? ప్రభుత్వమా? పెట్టుబడి దారులా? లేక పనిచేసి సంపదను స ష్టించే కార్మిక కర్షకులా? చిన్న చేపను పెద్ద చేప, పెద్ద చేపను మరో పెద్ద చేప...ఇలా మింగుతూ అంతులేని పద్ధతులకు అవకాశమున్నందుకే ఈ కేంద్రీకరణ జరుగుతున్నది. కేవలం తొమ్మిది మంది దగ్గర ఉన్న సంపద 70 కోట్ల మంది దగ్గర ఉన్న సంపదతో సమానం అనగా ఈ తొమ్మిది మంది 70 కోట్ల మంది చేసినంత పని చేస్తున్నట్టా? కూలీల రేట్లు పెరిగినా, ఒక చిరు ఉద్యోగి జీతం పెరిగినా చాలా మందికి కొంత చివుక్కుమంటుంది. కానీ ఒక పెట్టుబడిదారుడికి లాభాలు పెరిగితే "తప్పేముంది వ్యాపారం చేశాడు సంపాదించాడు" అని సాధారణమైన ముక్తాయింపు చేస్తుంటారు. ఇలాంటి అసాధారణమైన అభిప్రాయమే నేడు కొంపముంచుతోంది. ఇదే అభిప్రాయాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వాలు కూడా ఈ బడా వ్యాపారులకు అండగా నిలవడంతో అడ్డదారుల్లో, దొడ్డి దారుల్లో విపరీతమైన సంపద పోగేసుకొని ఇంతటి అసమానతలకు కారణమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఏడవ వేతన సంఘం ఉద్యోగుల మూల వేతనాలపై, బోనస్ చెల్లింపులపై మరియు ఏకంగా జీతాలపైనే సీలింగ్ పెట్టింది కానీ పెట్టుబడి దారులూ లేదా వ్యాపారులు సంపాదించే లాభాలపై సీలింగు పెట్టలేదు. భారతదేశంలోనే కాదు ఏ దేశంలోను పెట్టుబడిదారులు సంపాదించే లాభాలపై నియంత్రణ లేదు. ఆక్స్‌ఫామ్ రిపోర్ట్ చూసిన తర్వాతనైనా సరే ప్రభుత్వాలు కండ్లు తెరవాలి. అత్యధిక ఆదాయం కలిగిన వారు సరైన మోతాదులో పన్నులు చెల్లించడం లేదని కూడా రిపోర్టు అభిప్రాయపడింది.

ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి భారత ప్రభుత్వం గత సంవత్సరం కార్పొరేటు పన్ను 30 శాతం నుంచి 25 శాతానికి కుదించింది. ఇలాంటి నిర్ణయాల వల్ల ఖచ్చితంగా సంపద అసమానతలు మరింత పెరుగుతాయి. ఇప్పటికీ వ్యక్తిగత ఆదాయ పన్ను పరిధిలో వేతన జీవులే తొంబై శాతం. నిజానికి వేతన జీవులు సంఘటిత అసంఘటిత రంగాల్లో కలిపి పదిహేను శాతం మించటం లేదు. మరి మిగతా వారంతా ఎందుకు పన్ను పరిధి లోకి రావటం లేదు? పేదరిక నిర్మూలనకు ప్రత్యేక పథకాలను రచించేందుకు బదులుగా అవసరానికి మించి దండుకుంటున్న వారికి కళ్ళెం వేసే మార్గాలను తక్షణం ప్రవేశపెట్టాలి. రాజకీయాధికారపు పీఠానికై పెనుగులాటలో... ఓట్ల వేలానికి నిధులు సమకూర్చే వారిని ఏమీ అనలేని పక్షపాత దుర్నీతే ఈ అసమానతల తల రాతలకు మూలం. ఈ మూలాలకు మందు వేయకపోతే ప్రజా స్వామ్యం పది మందికే పరిమితమౌతుంది. ఏమంటారు?

సెల్: 9951300016

మానవి
నవతెలంగాణ


సరళ బాగా చదువుకుంది. మంచి ఉద్యోగమే చేస్తుంది. నెమ్మదైన మనిషి. తన పని తాను చూసుకుంటే తప్ప ఎవరి గురించి పట్టించుకోదు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఆమెకు సంబంధాలు చూశారు ఇంట్లో పెద్దవాళ్ళు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే ప్రవీణ్ కుటుంబం నేపథ్యం కూడా నచ్చడంతో పెండ్లి ఖాయం చేశారు. ఇద్దరూ మంచివారే కానీ వారి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్. ప్రవీణ్ ప్రవర్తనలో మార్పు. దాంతో సమస్యలు ... ఎటు తెల్చుకోలేక సరళ, తల్లిదండ్రులను తీసుకుని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

# సాఫ్ట్‌వేర్ మొహమాటం

సరళ తల్లి సుశీల తన బిడ్డ సమస్యను బాధ్యులకు ఇలా వివరించింది. 'మా అల్లుడు ప్రవీణ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఎక్కువగా ప్రాజెక్ట్ పనులు మీద వేరే పట్టణాలకు వెళ్ళాలి. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. అల్లారు ముద్దుగా పెంచారు. తన చదువు, తల్లిదండ్రులు, ఒకరు ఇద్దరు స్నేహితులు తప్ప వేరే ప్రపంచం తెలియదు. ఆఫీస్‌లోనూ ఎక్కువగా స్నేహితులు లేరు. వర్క్‌లో సిన్సియర్ అన్న పేరు ఉంది. వాళ్ళ కుటుంబ నేపథ్యం కూడా నచ్చడంలో సరళను ఇచ్చి పెండ్లి చేశాం. పెండ్లి సమయంలోనూ కట్నకానుల గురించి ఎక్కువగా అడగలేదు. ఇరువైపుల కుటుంబాలు కలిసిమెలిసే ఉన్నాయి. పెండ్లైయిన ఏడాదిలో వారిద్దరు బాగానే ఉన్నా... రెండో ఏడాదికి వారి మధ్య దూరం పెరిగింది. సరళతో ఏ విషయాలు పూర్తిగా చెప్పడు. ఆఫీస్ పని మీద వేరే ఊళ్లకు వెళ్ళాల్సి ఉన్నప్పుడు జస్ట్ మెసెజ్ పెడతాడు. రెండు మూడు రోజుల వరకు మళ్లీ ఎలాంటి మెసెజ్ ఉండదు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా సరిగ్గా మాట్లాడడు. ఈ దూరం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. వారిద్దరూ అన్యోన్యంగా ఉండాలని ఇద్దరిని కలిసి టూర్ వెళ్లమన్నా ఎటూ వెళ్లరు. సరళ ఇటీవల నిరాశగా ఉంటుంది. ప్రవీణ్ కు మీరు కౌన్సెలింగ్ ఇస్తారని మీ దగ్గరకు వచ్చాం. వాళ్ల సంసారం గాడిలో పడితే వాళ్ళకు పుట్టే పిల్లలతో ఆడుకోవాలని ఇటు మేం, అటు ప్రవీణ్ తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నాం.'

సమస్య ఏమిటని సరళను అడిగారు బాధ్యులు..

'మా ఇద్దరికీ ఎలాంటి సమస్యలు లేవు. నాకు వచ్చే జీతం గురించి ఆయన అడగడు. అలాగని ఇంట్లోకి ఏం కావాలని కూడా పట్టించుకోడు. తన ఉద్యోగం, ఆఫీస్, టూర్లు తప్ప మరోటి అవసరం లేదు. పెండ్లైయిన ఏడాది అత్తవారింట్లో పూజలు, వ్రతాలు అమ్మవాళ్లింట్లో పండుగలు ఇలా గడిచి పోయింది. ఫస్ట్ మ్యారెజ్ డే రోజు కూడా ఆయన ఆఫీస్ టూర్‌లోనే ఉన్నాడు. నేను ఆఫీస్ నుంచి వస్తూ ఇంటికి కావల్సిన వస్తువులన్నీ తెచ్చుకోవాలి. మా అత్తమామ వచ్చినప్పుడు కూడా వారికి కావల్సినవి అన్నీ నేనే చూసుకోవాలి. ఇంటి గురించి పట్టించుకోమని మా అత్తమామలు కూడా చెప్తారు. వాళ్ళు ఉన్నన్ని రోజులు కాస్త బాధ్యతగా ఉంటాడు. ఆ తర్వాత మళ్లీ మామూలే. టూర్ వెళ్లేటప్పుడు కూడా జస్ట్ మెసెజ్ పంపిస్తాడు. మళ్లీ తిరిగి ఇంటికి వచ్చేవరకు ఎలాంటి సమాచారం ఉండదు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా లాప్‌టాప్‌తోనే ఎక్కువ టైమ్ ఉంటాడు. ఇల్లంటే కేవలం తనకు ఇష్టం ఉన్నప్పుడు వచ్చిపోయే హొటల్ కాదు కదా మేడమ్. ఆయనకు చిన్నప్పటి నుంచి వర్క్‌పైనే శ్రద్ధ ఎక్కువ. సరే మరి భార్యను కూడా పట్టించుకోవాలి కదా! ఇద్దరం కలిసి తిన్న రోజులు. .. కలిసిఉన్న రోజులు చాలా తక్కువ. మా అత్తమామ, అమ్మనాన్న నన్నే సర్దుకు పోమ్మంటారు. ఇలా ఎన్నిరోజులు? ఆయన లో మార్పు రావాలి. ఇంటి గురించి, నా గురించి పట్టించుకోవాలి. మీరు కౌన్సెలింగ్ ఇస్తారని తెలిసి వచ్చాం. మా కాపురం నిలబెట్టండి' అంటూ కన్నీళ్ల పెట్టుకుంది సరళ.




సమస్య ఏమీ లేనట్టుగానే కనిపిస్తున్నా... ఇది నేటి యువతుల్లో ఎక్కువ మందిని పట్టి పీడిస్తున్న సమస్య. చాలామంది భర్త బాధ్యతారాహిత్యాన్ని భరించలేక... బయటకు చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతున్నారు. సరళ చదువుకున్న అమ్మాయి కాబట్టి తన సమస్యను గుర్తించింది. సమస్య ఏంటో తెలుసుకుని పరిష్కరించుకోవడానికి ఐద్వాకు వచ్చింది. సరే కౌన్సిలింగ్‌కు ప్రవీణ్ వస్తాడా అని అడిగారు బాధ్యులు. మీరు కాల్ చేస్తే తప్పక వస్తాడు అంది సరళ. 'ముందుగా లెటర్ పంపిస్తాం... స్పందించకపోతే ఫోన్ చేస్తాం' అన్నారు బాధ్యులు.

> **ఇద్దరిలో ఉన్న మొహమాటం మీ మధ్య దూరాన్ని పెంచుతుంది. ప్రవీణ్ ముభావంగా ఉన్నాడు అని నువ్వు మౌనంగా ఉండకు. అతనిని మాట్లాడించు. కిచెన్‌లో ఒక్కదానివే కష్టపడకుండా అతను ఇంట్లో ఉన్న సమయంలో చిన్నచిన్న పనులు చేయమను. ఇద్దరు కలిసి ఇంటిపనులు చేసుకుంటే మీ మధ్య అనుబంధం పెరుగుతుంది.**

ప్రవీణకు లెటర్ పంపించారు. సమాధానం లేదు. ఆ తర్వాతి వారం సరళ మళ్లీ ఐద్వాకు రావడంతో ఫోన్ చేశారు. తను ఆఫీస్ టూర్‌లో ఉన్నాను అని వచ్చేవారం వస్తాను అన్నాడు ప్రవీణ్. చెప్పినట్టుగానే ప్రవీణ్ వచ్చాడు. ఒక్కడే వచ్చాడు. తల్లిదండ్రులను తీసుకురాలేదని అడిగితే.. 'మా అమ్మనాన్న చాలా సెన్సిటివ్ మేడమ్. వాళ్లకు మా సమస్య తెలియడం ఇష్టం లేదు' అన్నాడు. సరే అని సరళ చెప్పిన విషయాలు అతనికి చెప్పారు బాధ్యులు. దానికి సమాధానంగా..'సరళ చెప్పిన విషయాలన్ని నిజమే మేడమ్. మా అమ్మనాన్నలకు నేను ఒకడినే. ఎక్కువగా స్నేహితులు కూడా లేరు. ఎవరితో త్వరగా కలవలేను. పెండ్లి అయిన తర్వాతైనా మారుతాను అనుకున్నారు మా అమ్మనాన్న. కానీ, నాలో బిడియం పోలేదు. సరళతో మాట్లాడాలని మనసులో ఎంతో ఉంటుంది. కానీ.. ఎలా తనతో ఉండాలో తెలియదు. ఆమెతో కాస్త టైమ్ స్పెండ్ చేద్దామని నన్ను నేను సిద్ధం చేసుకునేలోగా ఆఫీస్ పని మీద వేరే ఊళ్ళకు వెళ్లాల్సి వస్తుంది. ఇంటి దగ్గర తను నా కోసం ఎదురుచూస్తుంది అన్న విషయం తెలిసినా... ఎలా చెప్పాలో .. ఏం మాట్లాడాలో తెలియక ఫోన్ చేయను. పని అయిపోగానే సరాసరి ఇంటికి వస్తాను. తాను మాట్లాడుతుందేమో అని చూస్తాను. ఆమె వంటచేశాను... తినండి..ఆఫీస్‌కు వెళుతున్నాను.. ఇలా పొడిపొడి మాటలే. నాకు తనంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టాన్ని ఎలా చెప్పాలో తెలియదు. మీరు ఎలా చెప్పితే అలా వింటాను. మా అమ్మనాన్నలకు మాత్రం చెప్పకండి' అన్నాడు ప్రవీణ్.

చిన్నకుటుంబాలు... ఇరుగుపొరుగుతో పరిచయాలు లేకపోవడం..మాటలు కరువై యంత్రాలకు చేరువై మానవసంబంధాలు మరిచిపోతున్న ఈ తరుణంలో ప్రవీణ్ లాంటి వాళ్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. తల్లిదండ్రుల సంతోషం కోసం పెండ్లి చేసుకునే యువకులు తమ కోసం వచ్చే భార్యను పట్టించుకోవడం లేదు. దాంతో కుటుంబాలలో అలజడి. క్రమంగా దూరం పెరిగి ఇంటి వాతావరణంలో ప్రశాంతత లేకుండా చేస్తుంది. అనేక సమస్యలకు కారణం అవుతుంది.

ప్రవీణ్, సరళల మధ్య సఖ్యత లేకపోవడమే అసలు కారణమని గుర్తించిన బధ్యులు వారిద్దరికి విడివిడిగా కొన్ని విషయాలు చెప్పారు. 'ప్రవీణ్ ఇక నుంచి ఆఫీస్ టూర్లు కొంత తగ్గించుకో. ఇంటికి వచ్చిన తర్వాత ఫోన్, లాప్‌టాప్‌తో కాకుండా నీ భార్యతో మాట్లాడు. ఆమెతో వారానికి ఒక సినిమాకు.. పార్క్‌కు వెళ్లు. బయటకు వెళ్ళడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఇద్దరు కలిసి మీకు నచ్చిన సినిమాలు చూడండి. నెలకు ఒకసారైనా మీ అమ్మవాళ్లింటికీ, సరళ అమ్మవాళ్లింటికీ వెళ్ళండి. ఇంట్లోకి కావల్సిన సరుకులు ఇద్దరు కలిసి వెళ్ళి తెచ్చుకోండి. ఇలా చిన్నచిన్న పనులు ఇద్దరూ కలిసి చేసుకోవడం వల్ల మీ ఇద్దరి మధ్య సఖ్యత పెరుగుతుంది' అన్నారు బాధ్యులు. 'సరే మేడమ్!మీరు చెప్పినట్టే చేస్తాను. మా పెద్దవాళ్లకు మాత్రం చెప్పండి' అన్నాడు ప్రవీణ్.

'సరళ మీ మధ్య ఎలాంటి సమస్యలు లేవు. కేవలం ఇద్దరిలో ఉన్న మొహమాటం మీ మధ్య దూరాన్ని పెంచుతుంది. ప్రవీణ్ ముభావంగా ఉన్నాడు అని నువ్వు మౌనంగా ఉండకు. అతనిని మాట్లాడించు. కిచెన్‌లో ఒక్కదానివే కష్టపడకుండా అతను ఇంట్లో ఉన్న సమయంలో చిన్నచిన్న పనులు చేయమను. ఇద్దరు కలిసి ఇంటిపనులు చేసుకుంటే మీ మధ్య అనుబంధం పెరుగుతుంది. వీలైనప్పుడల్లా ఇద్దరూ కలిసి బయటకు వెళ్లండి. సెలవుల్లో ఎటైనా దూరప్రదేశాలకు వెళ్లండి. మళ్లీ ఏదైనా సమస్య అనిపిస్తే రండి' అంటూ సరళకు చెప్పారు.

ఇద్దరిని పిలిచి..'మీరిద్దరూ ఉద్యోగస్తులు. వీకెండ్‌లో ఎలాంటి ఆఫీస్ పనులు పెట్టుకోకుండా కేవలం మీ కోసం కేటాయించుకోండి. ఇంట్లో పనులు షేర్ చేసుకోండి. పార్టీలకు.. ఫంక్షన్లకు కలిసి వెళ్లండి. జీవితమంటే కేవలం ఆఫీస్..ఆస్తులు మాత్రమే కాదు.. భార్యభర్తలిద్దరి మధ్య అనుబంధం కూడా ముఖ్యం. మీ ఇద్దరి తల్లిదండ్రులు మీ కాపురం గురించి దిగులు పడుతున్నారు. ఈ వయసులో మీరు వాళ్ళను సంతోషంగా ఉంచాలంటే ముందు మీరు అన్యోన్యంగా ఉండాలి. మీ కోసం కాస్త టైమ్ కేటాయించుకోండి' అన్నారు. సరే అంటూ రిజిష్టర్‌లో సంతకాలు చేసి బయటకు వచ్చారు. తమ మధ్య ఉన్న మౌనం తెరలు తొలగిపోయి తేలికైన మనసులతో ఇంటికి కాకుండా సినిమా హాలు వైపు నడిచారు దంపతులిద్దరు. బాధ్యుల సూచనలు ఆచరణలో అమలు చేస్తూ ముందుకు సాగారు.

వి.యశోద

## వీటిపై కన్నేయండి.. !

ఇంట్లో ఫ్లోర్‌తో పాటు సోఫా, దుప్పట్లు... ఇలా కొన్నింటిని మాత్రమే శుభ్రం చేస్తారు. కొన్నింటిని అంతగా పట్టించుకోరు. అలా చేయడం వల్ల క్రిములు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఇల్లు శుభ్రం చేసేప్పుడు గమనించాల్సిన కొన్ని వస్తువులు, ప్రాంతాలు...

**హ్యాండిల్స్, స్విచ్‌లు:** రిఫ్రిజిరేటర్ డోర్ హ్యాండిల్, ఎలక్ట్రిక్ స్విచ్‌లను నిత్యం తాకుతూ ఉంటాం. దాంతో వాటిమీద బ్యాక్టీరియా పేరుకుపోతుంది. వారానికి మూడు నాలుగుసార్లయినా క్లీనింగ్ ద్రావణంలో ముంచిన క్లాత్‌తో వాటిని తుడవాలి.

**షెల్ఫ్, క్యాబినెట్‌లు:** వంట గది మీద, పుస్తకాల అరల్లో దుమ్ము పడుతుంది. వారానికి ఒకసారైనా చీపురుతో దులిపి, శుభ్రం చేసుకోవాలి.



**మేకప్ బ్యాగ్స్:** పాత మేకప్ సామగ్రిని పడేయడమే కాదు, మేకప్ బ్యాగ్‌లోపలా చెత్త లేకుండా చూసుకోవాలి. హెయిర్ బ్రష్‌ల ద్వారా చర్మం మీది మృతకణాలు, బ్యాక్టీరియా మేకప్ బ్యాగ్‌లోకి చేరతాయి. కాబట్టి మేకప్ బ్యాగ్‌ను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

**జిమ్ బ్యాగ్స్:** షూస్, మురికి, చెమట పట్టిన దుస్తులు, సాక్సులు జిమ్ బ్యాగులో పడేస్తుంటారు. అలా కాకుండా సాక్సులు, టవల్స్ ఉతికి పెట్టుకోవడంతో పాటు జిమ్ బ్యాగ్‌ను కూడా శుభ్రంగా ఉంచుకోవాలి.

**ఎలక్ట్రానిక్స్:** మొబైల్ స్క్రీన్, రిమోట్ ఎక్కువ సేపు పట్టుకోవడం వల్ల వేళ్ల మీది బ్యాక్టీరియా వాటి మీదకు చేరుతుంది. చేతులు మారడంతో బ్యాక్టీరియా అంతటికి విస్తరిస్తుంది. వాటిని తడి వస్త్రంతో తుడవాలి. తినేటప్పుడు రిమోట్ పట్టుకోకపోవడం మేలు.

**వాషింగ్ మెషిన్:** దుస్తులు వేసి, తీసేశాక వాషింగ్ మెషిన్‌లో తేమ అలాగే ఉంటుంది. దానివల్ల బ్యాక్టీరియా, ఫంగస్ పెరిగే అవకాశం ఎక్కువ. నెలకు ఒకసారైనా వేడి నీళ్లతో వాషింగ్ మెషిన్ లోపలి భాగాన్ని కడగాలి. వాషింగ్ మెషిన్ లోపలి భాగానికి కొద్దిసేపు గాలి తగిలేలా ఉంచాలి.

**టూత్ బ్రష్ హోల్డర్:** ఉదయం నిద్రలేవగానే బ్రష్ చేసుకుంటాం. అక్కడే బ్యాక్టీరియా పొంచి ఉంటుంది. టూత్‌బ్రష్ హోల్డర్స్‌ను తరచుగా శుభ్రం చేసుకోవాలి.


**ఎక్సర్‌సైజ్ మ్యాట్స్:** పాదాల చెమట, మృత కణాలు చేరి ఎక్సర్‌సైజ్ మ్యాట్ అపరిశుభ్రం అవుతుంది. వాటిని ఎండలో పెట్టడం, క్లీనింగ్ ద్రావణంతో శుభ్రం చేయాలి. ❄

## తింటున్నారా.. !

కూరల్లో.. చారుల్లో వేసుకునే టమాటోల్లోని పోషకాల గురించి తెలిసిందే. అయితే ఇది ఆరోగ్యానికే కాదు, అందానికీ తోడ్పడుతుంది. దీన్ని జ్యూస్ రూపంలో తీసుకుంటే అందులోని ఎ, సి విటమిన్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి. దంతాల, ఎముకల ఆరోగ్యాన్నీ పరిరక్షిస్తాయి. ఇందు లోని నియాసిన్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.



- ఇందులో అధికంగా ఉండే పీచు ఆకలిని, బరువును తగ్గించేందుకు తోడ్పడు తుంది. మలబద్ధకాన్ని తగ్గించడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్నీ పరిరక్షిస్తుంది. టమాటోల్లో సమృద్ధిగా ఉండే బి6 గుండె జబ్బులకు కారణమైన హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని విచ్ఛిన్నమయ్యేలా చేస్తుంది.
- టమాటోల్లో పుష్కలంగా ఉండే క్లోరిన్ శరీరం లోని టాక్సిన్లు తొలగిపోయేలా చూస్తుంది. అన్నింటికన్నా ముఖ్యంగా వీటిల్లో అధికంగా ఉండే లైకోపీన్ ప్రొస్టేట్, రొమ్ము, కొలొరెక్టల్, ఊపిరి తిత్తులు, క్లోమ క్యాన్సర్లతో పాటు గుండె జబ్బులు రాకుండా నిరోధిస్తుంది.
- టమాటో జ్యూస్ తాగడం వల్ల సూర్యరశ్మి కారణంగా చర్మంమీద ఏర్పడిన ట్యాన్ క్రమంగా తగ్గడంతో పాటు మొటిమలు కూడా తగ్గుతాయి. ఇందులోని విటమిన్లు పొడిబారిన జుట్టును మెరిసేలా చేస్తాయి. తలస్నానం తర్వాత కాస్త తాజా టమాటో రసాన్ని తలకు పట్టించి ఐదు నిమిషాల తరవాత కడిగేస్తే జుట్టుకు మంచి కండిషనర్‌లా కూడా పనిచేస్తుంది. ❄





# 2 పాయలు ముళ్ల

'జుట్టున్నమ్మ ఏ కొప్పయినా వేయొచ్చు'... ఇది పాత సామెత. తక్కువ జుట్టుతోనే ఎన్నో రకాల హెయిర్‌స్టయిల్ పయత్నించొచ్చు. ఎమర్జెన్సీలో సులభంగా వేసుకోగలిగే ఈ హెయిర్‌స్టయిల్... ఆఫీసుకు కూడా అందంగానే ఉంటుంది.

## నిపుణుల సలహా...

చల్లని ప్రదేశాల్లో నివసించేవారిలో జీవక్రియావేగం నెమ్మదించడంతో ఆయు ప్రమాణం పెరుగుతుంది అంటున్నారు ఇలినాయిస్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ చికాగోకి చెందిన పరిశోధకులు.

– గుండెపోటు మరణాల్లో చాలావరకూ ఫ్లూ వైరస్ తరచూ సోకడం వల్లే సంభవిస్తున్నట్లు చెబుతున్నారు అమెరికాలోని డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ సెంటర్‌కు చెందిన నిపుణులు.

– గుడ్డు తింటే కొలెస్ట్రాల్ అనుకుంటారు కానీ రోజుకో గుడ్డు తినేవాళ్లలో మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్రన్ ఫిన్‌ల్యాండ్‌కు చెందిన పరిశోధకులు.



## వెనక్కి రావాలంటే...

వయసు మీరేకొద్దీ జ్ఞాపకశక్తి లోపించడం, ఆలోచనాశక్తి క్షీణించడం సహజమే. అయితే కొందరిలో ఆలోచనాశక్తి పూర్తిగా తగ్గిపోతుంటుంది. అయితే అలా ఆలోచనాశక్తి తగ్గిపోతున్న దశలో అంటే 65 దాటిన తర్వాత క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆలోచనాశక్తి తిరిగి పెరిగే అవకాశం ఉంది అని గుర్తించారు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ నిపుణులు.



ఇందుకోసం వీళ్లు దాదాపు 160 మంది వృద్ధుల్ని ఎంపికచేసి వాళ్లతో ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా వారా నికి మూడు రోజులు 45 నిమి షాల పాటు వ్యాయామం చేయిం చారట. నడకతో పాటు జాగింగ్, సైక్లింగ్ కూడా చేయించారు. అదే సమయంలో పీచు ఎక్కువగానూ సోడియం తక్కువగానూ ఉండే పండ్లూ, కూరగాయలూ నట్స్ వంటి ఆహారాన్ని ఇచ్చారట. దాంతో వాళ్లలో బీపీ, మధుమేహం వంటివి తగ్గడంతో పాటు, వాళ్ల వయసు మరో తొమ్మిదేళ్లు వెనక్కి వచ్చిందనీ, అంటే ఆలోచనాశక్తి పెరిగిందని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి అరవై దాటాకా వ్యాయామం తప్పనిసరి అన్నమాట. ❄

## ఇట్లా చేద్దాం



దోశ, ఇడ్లీ చేసేటప్పుడు నానబెట్టిన బియ్యం, పప్పులో కొంచెం మెంతులు వెయ్యాలి. ఇడ్లీ దోశలు మెత్తగా వస్తాయి.

## ఏపీ ఆర్టీసీలో సమ్మెకు ఎన్ఎంయూ సై

**అమరావతి:** ఆర్టీసీ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించకుంటే ఫిబ్రవరి 8 నుంచి ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని ఎన్ఎంయూ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ సురేంద్రబాబుకు శుక్రవారం నోటీసు అందచేసింది. 'ఫిబ్రవరి 8న లేదా ఆ తరువాత ఎప్పుడైనా' సమ్మె ప్రారంభిస్తామని ఈ నోటీసులో ఎన్ఎంయూ నేతలు పేర్కొన్నారు. వేతన సవరణతో పాటు, పలు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ), ఎస్‌డబ్ల్యూఎఫ్ తదితర సంఘాలతో కూడిన జేఏసీ ఫిబ్రవరి ఆరవ తేది నుండి సమ్మెకు దిగుతున్నట్టు ఇప్పటికే నోటీస్ ఇచ్చి ఉన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు సమ్మె సన్నాహక కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా 8వ తేది తరువాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని నోటీస్ ఇచ్చిన ఎన్ఎంయూ ఫిబ్రవరి ఒకటవ తేదిన చలో ఆర్ఎం కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య మాట్లాడుతూ శుక్రవారం ఎన్ఎంయూ సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించామని, సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రూ.33 కోట్లు విడుదల

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రూ.33 కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ము ఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ జీవో నెంబర్ 63ను జారీచేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం మొత్తం రూ.120 కోట్లను కేటాయించగా ప్రభుత్వం గతంలో రూ.87 కోట్లను ఇచ్చింది. తాజాగా, మిగతా రూ.33 కోట్లను విడుదల చేసింది.

## మహిళల పట్ల పాలకుల నిర్లక్ష్యం

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

**నవతెలంగాణ- నయీంనగర్**

కేంద్ర రాష్ట్రంలో అధికారంలో ఎవరున్నా మహిళల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. హన్మకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ షమీం అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహిళలను మనువాద సంకెళ్లతో బంధిస్తోందని విమర్శించారు. మహిళలు అడుగుపెడితే శబరిమల ఆలయం అపవిత్రం అవుతుందంటూ రాద్ధాంతం చేయడం రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేయడమేనన్నారు. దేశ ప్రధాని సహా కేంద్ర మంత్రులంతా రామాలయ మంత్రం జపించడం తప్ప మహిళా హక్కుల గురించి ఏనాడూ చర్చించిన దాఖలాల్లేవన్నారు. మతోన్మాదులు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయకపోవడం పాలకుల మోసపూరిత విధానానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ సబ్సిడీ పథకాల పేరుతో ప్రజలను వంచించి మళ్లీ అధికారంలోకి వచ్చి అమలును విస్మరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 30 శాతం ఒంటరి మహిళలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఎందుకు కట్టించలేదని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు లేక వలసబాట పడుతుండగా, తల్లిదండ్రులు పస్తులుంటున్న దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నరేండ్లలో ఎన్నికల హామీలు అమలు చేయకపోగా ఎన్నికల ప్రచారాలకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిన దుర్మార్గపు చరిత్ర టీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతులై పోరాటాల దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నలిగింటి రత్నమాల, జిల్లా కమిటీ సభ్యులు మన్నూరు జ్యోతి, ప్రత్యూష, ఠాకూర్, భవాని, అరుణ, హరిత, రజిత పాల్గొన్నారు.

## సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేసిన పోలీసు నియామక మండలి

- విచారణ 28కి వాయిదా

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షలో ఆరు ప్రశ్నలు తప్పుగా ఉన్నందున వాటిని తొలగించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్ని తెలంగాణ పోలీస్ నియామక మండలి డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేసింది. ఆరు ప్రశ్నలు కరెక్టుగానే ఉన్నాయని, తొలగించాల్సిన అవసరం లేదనే అప్పీల్ వ్యాజ్యాన్ని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారించింది. గత ఏడాది ఆగస్టు 28న నిర్వహించిన పరీక్షలో ఆరు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఉన్నాయని, దీని వల్ల పోస్టుల ఎంపికపై ప్రభావం చూపుతుందని గతంలో ఉపేందర్‌రెడ్డి సహా 15 మంది హైకోర్టును ఆశ్రయించారు.

ఆరు ప్రశ్నల్ని తొలగించాకే అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడించాలని సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రశ్నాపత్రంలోని బుక్‌లెట్ కోడ్ బిలోని 117, 138, 172, 181, 185, 189 ప్రశ్నలు తప్పులని న్యాయమూర్తి తేల్చారు. దీనిపై పోలీస్ నియామక మండలి సవాల్ చేసిన అప్పీల్‌ను సమగ్రంగా విచారించాల్సివుందని ధర్మాసనం ప్రకటించింది. విచారణను 28కి వాయిదా వేస్తున్నామని, ఈలోగా ప్రతివాదులు తమ వాదనల్ని తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది.

## సీపీఆర్‌వోకు పలు పోస్టులు మంజూరు

- సీఎం క్యాంపు కార్యాలయానికి జమేదార్ పోస్టు
- ఉత్తర్వులు జారీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ముఖ్యమంత్రి ముఖ్య పౌర సంబంధాల అధికారి(సీపీఆర్‌వో) కార్యాలయానికి పలు పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పీఆర్‌వో, ప్రయివేటు సెక్రెటరీతోపాటు అదనపు ప్రయివేటు సెక్రెటరీ, పర్సనల్ అసిస్టెంట్ నాలుగు పోస్టులను డిప్యుటేషన్ ప్రాతిపదికన తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇవే కాకుండా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి ఒకటి, ప్రోగ్రామర్స్ 6, నాలెడ్జ్ సెంటర్ ఇన్‌చార్జి 1, డెటా ఎంట్రీ ఆపరేటర్స్2, జీరాక్స్ ఆపరేటర్1, అటెండర్లు6, డ్రైవర్ 1 పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు జారీ చేసిన జీవో 6లో పేర్కొన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలోనూ జమేదార్ పోస్టు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలింగ్ ప్రశాంతం: అదనపు డీజీ జితేందర్


**నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి**

రాష్ట్రంలో శుక్రవారం జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీల పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామ పంచాయతీలలో మినహా మెజారిటీ గ్రామాలలో పోలింగ్ సవ్యంగా జరిగినట్టు రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా రాజకీయంగా చైతన్యం ఎక్కువగా ఉన్న నల్లగొండ, సూర్యాపేట, మొదలైన జిల్లాల్లో రాజకీయ వైరాల కారణంగా పోలింగ్ సందర్భంగా వైరి పక్షాలు ఘర్షణ పడటం, దాడులు చేసుకోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని ఆయన తెలిపారు. అయితే ఇలాంటి సున్నితమైన ప్రాంతాలలో ఘర్షణ వాతావరణాన్ని ముందుగానే పసిగట్టిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ముందస్తు భద్రతా చర్యలను చేపట్టడం వలన ఎక్కడికక్కడ గొడవలను నియంత్రించనట్టు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు విధించడం, మెరుపు దళాలను రంగంలోకి దింపడం, సాయుధ పోలీసులతో గస్తీని విస్తృతం చేయడం వంటి చర్యలతో పరిస్థితి ఎక్కడ కూడా అదుపు తప్పకుండా నివారించామని ఆయన తెలిపారు. నాలుగు వేలకు పైన ఉన్న ఈ విడత గ్రామ పంచాయతీలలో 788 ఏకగ్రీవం కావడంతో మిగతా వాటికి పోలింగ్ జరిగిందని అన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతలలో ఎక్కడ కూడా మావోయిస్టుల నుంచి ఎలాంటి ఆటంకాలూ ఎదురు కాలేదని తెలిపారు. ఇక 30న జరిగే తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ కోసం ఇప్పటి నుంచే పకడ్బందీగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు జితేందర్ తెలిపారు. అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలను మోహరిస్తున్నామన్నారు.

# ఈ దేశం అందరిదీ...

- జాతినుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం
- దేశప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
- ఈ సంవత్సరం ఎంతో ప్రత్యేకమైంది..
- సమస్యలెన్నో ఉన్నాయి..

**"భిన్నత్వం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి...ఈ మూడూ ఉన్నప్పుడే అది 'ఇండియా మోడల్' అవుతుంది. ఇందులో ఏ ఒక్కదానినో మనం ఎంచుకోలేం. భారతదేశానికున్న గొప్ప బలం బహుళత్వమే. ఈ దేశం అందరిదీ, అన్నివర్గాలదీ, అన్ని మతాలదీ, ప్రతి పౌరుడిదీ. 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలందిరకీ శుభాకాంక్షలు"**




**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రజలంతా 70వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నవేళ ప్రజాస్వామ్యం ప్రాముఖ్యతను గుర్తెరగాలనీ, భారత రాజ్యాంగాన్ని భద్రంగా కాపాడుకోవాలనీ పిలుపునిచ్చారు. ప్రసంగంలో రాష్ట్రపతి ప్రస్తావించిన విషయాలు ఇలా ఉన్నాయి.. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. మహిళలు, రైతులు దేశంలో సాధికారత సాధిస్తున్నారని అన్నారు. డిజిటల్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. జాతీయ వనరులపై అందరికీ హక్కులు ఉన్నాయనీ, నేటి మన నిర్ణయాలే భవిష్యత్ భారత్‌కు మార్గదర్శకాలనీ చెప్పారు.

70వ గణతంత్ర దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందనీ, ఈ ఏడాది అక్టోబరు మాసంలో జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలు జరగబోతున్నాయనీ చెప్పారు. ఈ ఉత్సవాల ద్వారా గాంధీజీ ఆలోచనలు, ఆయన సిద్ధాంతాలను యావత్ ప్రపంచం అర్థం చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. అన్ని ఇండ్లను విద్యుదీకరించడం శుభపరిణామమన్నారు. 10శాతం రిజర్వేషన్ల ద్వారా అగ్రవర్ణాల్లో పేదలకు లబ్ది చేకూరుతుందని రాష్ట్రపతి తెలిపారు.

**ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...**

- **ఈ ఏడాది దేశ పౌరులకు తమ కీలక బాధ్యతను నెరవేర్చుకోవాల్సిన అవకాశం వచ్చింది. 17వ లోక్‌సభకు జరగనున్న ఎన్నికలు శతాబ్దంలో ఒకసారి వచ్చే అరుదైన ఘట్టంలా కనపడుతున్నాయి.**
- **21వ శతాబ్దంలో జన్మించిన వారు మొదటిసారి తమ ఓటు హక్కు ద్వారా కొత్త లోక్‌సభను ఎన్నుకోవడంలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపౌరుడూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.**
- **దేశంలో మహిళలు, విద్య, కళలు, ఆరోగ్య, క్రీడా రంగాల్లోనే కాకుండా త్రివిధ దళాల్లోనూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. విద్యా సంస్థల్లో బాలురకంటే బాలికలే బాగా రాణిస్తున్నారు.**
- **ప్రజాస్వామ్యంలోని మన ఆలోచనలు, ఆదర్శాలే ఎన్నికల రూపంలో ప్రతిబింబిస్తాయి. ఓటర్లు తమ తీర్పుతో తమ భవిష్యత్తుకి మార్గం వేసుకుంటారు. ఎన్నికలు అంటే కేవలం రాజకీయ కసరత్తులు మాత్రమే కాదు. ప్రజలు ఎన్నో ఆశలు, లక్ష్యాలు నెరవేరడం కోసం జరిగే ప్రక్రియ.**
- **భారత్ ఎన్నో రంగాల్లో గొప్ప ప్రయాణం కొనసాగించింది. మనం పూడ్చవలసిన చాలా సమస్యలు ఇంకా ఉన్నాయి. చాలామంది కన్నీళ్లను తుడవాల్సిన అవసరముంది.**

## గెలిపిస్తే ఫోనిస్తా : చంద్రబాబు



**అమరావతి:** డ్వాక్రా మహిళలకు, వెలుగు ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరాలు ప్రకటించారు. ముఖ్యమంత్రి శుక్రవారం గుంటూరు జిల్లా నేలపాడు, కడప, విశాఖల్లో జరిగిన డ్వాక్రా గ్రూపు సభ్యుల విస్తృత సమావేశాల్లో మాట్లాడుతూ భవిష్యత్తులో డ్వాక్రా మహిళలందరికీ స్మార్టు ఫోన్లు అందిస్తామని ప్రకటించారు. గత నాలుగేండ్లలో ఒక్కొక్కరికి రూ.10 వేలు సాయం చేశానని, రానున్న మూడు నెలల్లో మరో రూ.10 వేలు సాయం చేస్తానని చెప్పారు. ఈ నిధులు మూడు చెక్కుల రూపంలో ఫిబ్రవరిలో రూ.2500, మార్చిలో రూ.3500, ఏప్రిల్‌లో రూ.4 వేలు చొప్పున చెక్కుల రూపంలో నేరుగా మహిళల పేరున అందిస్తామని వివరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడులో సిఎం మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగించాలంటే తనను మళ్లీ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో 93,81,118 మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని, ఇంతమంది సైన్యం తనకు అండగా ఉండగా తనను ఎవ్వరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు.

## టీడీపీలో సర్వే ప్రకంపనలు

- ఎమ్మెల్యేల పనితీరుపై ఫోన్ ద్వారా సమాచారం సేకరిస్తున్న అధిష్టానం
- నేతల్లో గందరగోళం

**గుంటూరు:** తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల పనితీరుపై ఆ పార్టీ వివిధ రూపాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. తాజాగా ఫోన్‌ల ద్వారా ఎమ్మెల్యేల నడవడికలపై సర్వే చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోని ఫోన్ నంబర్లు సేకరించిన ఒక బృందం రికార్డు వాయిస్ ద్వారా మీ నియోజకవర్గ ఎమ్మెల్యే మీకు అందుబాటులో ఉంటున్నారా? ఆయన ప్రజలతో కలసి మెలసి పనిచేస్తున్నారా? అందుబాటులో ఉండి కలసి మెలసి పనిచేస్తే నాలుగు నొక్కండి.. లేదంటే ఐదు నొక్కండని ఇటీవల కొన్ని వేల మందికి ఫోన్లు వస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సర్వే చేస్తున్నట్టుగానే ఎమ్మెల్యేల గురించి వివరాల సేకరణ నాయకుల్లో కలకలం రేపుతోంది. టిక్కెట్లు ఇవ్వడం ఇష్టం లేని నేతలకు మీకు మీ నియోజకవర్గం ప్రజల నుంచి సానుకూలత రావడం లేదని సర్వే నివేదికలు వ్యతిరేకంగా వచ్చాయని చెప్పి టిక్కెట్లు నిరాకరిస్తారని పలువురు ఎమ్మెల్యేలు మదనపడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఒక సామాజిక తరగతి వారు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జికి వ్యతిరేకంగా జిల్లాలో పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నారు. దీంతో అసమ్మతి కార్యకలాపాలూ ఊపందుకుంటున్నాయి. ఇదే సమయంలో అధిష్టానం నుంచి వచ్చిన ఫోన్లలో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సమాచారం ఇస్తున్నారని సమాచారం. కేవలం రెండు ప్రశ్నలతోనే పూర్తి వివరాలు ఎలా సేకరించగలుగుతారని టీడీపీ ఎమ్మెల్యేలు తమ అనుయాయుల వద్ద నొచ్చుకుంటున్నారు. సామాజిక, ఆర్థిక పరమైన అంశాల ప్రాతిపదికన తమకే టిక్కెట్టు వస్తుందని కొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ధీమాగా ఉన్నారు. మరోవైపు ఐదు నొక్కిన వారి వివరాలు తీసుకుని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారనీ రాజకీయంగా ప్రచారమవడంతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే పనితీరు బాగుందని నాలుగు నొక్కుతున్నారని తెలిసింది. టీడీపీ ఎత్తుగడలకు విరుగుడుగా వైసీపీ తన కార్యకర్తలను అభిమానులను అప్రమత్తం చేసి ఫోన్ ద్వారా ఏం అడిగినా ప్రభుత్వానికి అనుకూలంగా, ఎమ్మెల్యేల పనితీరు బాగుందని చెప్పండని వైసీపీ నేతలు సంకేతాలిస్తున్నారు.

# కొత్త మున్సిపాల్టీలకు ఎన్ని'కల'లేనా?

**వార్డుల విభజన, రిజర్వేషన్లు ఆలస్యమే...**

- ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు... రానున్న పార్లమెంటు ఎన్నికలు
- స్పెషలాఫీసర్ల పాలన కొనసాగింపు!

**గుడిగ రఘు**



గతేడాది ఆగస్టు నెలలో అమల్లోకి వచ్చిన కొత్త మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామపంచాయతీల్లో జనాభా పెరగడం, రెండు, మూడు గ్రామాలు కలిసిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త మున్సిపాల్టీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 31 జిల్లాలు ఉన్నాయి. అందులో 68 కొత్త మున్సిపాల్టీలను ఏర్పాటు చేసింది, 73 పాత మున్సిపాల్టీలు ఉన్నాయి. గ్రామపంచాయతీలకు గడువు ముగియడంతో కోర్టు ఆదేశాల మేరకు సర్కారు పంచాయతీలను ఎన్నికలను నిర్వహిస్తున్నది. ఇప్పటికే రెండు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాల్టీలుగా ఏర్పాటైన వాటికి మాత్రం ఎన్నికలు నిర్వహించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త మున్సిపాల్టీల్లో వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ ఇప్పటికే చేపట్టారు. దానికి సంబంధించిన నివేదికను సర్కారుకు సమర్పించినా దానిపై నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టినట్టు తెలిసింది. కొత్త మున్సిపాల్టీల ఎన్నికల కంటే ముందు పార్లమెంటు ఎన్నికలపై సర్కారు దృష్టి పెడుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదలైతే...కొత్త మున్సిపాల్టీలకు ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరపనుంది. పార్లమెంటు, పంచాయతీ ఎన్నికలకు, మున్సిపాల్టీ ఎన్నికలకు సంబంధం లేకపోయినా...ఒకేసారి రెండు ఎన్నికలను నిర్వహించడానికి సరిపడా యంత్రాంగం లేదని మున్సిపల్ శాఖకు చెందిన పేరు రాయడానికి ఇష్టపడని ఒక అధికారి చెప్పారు. ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణ సాధ్యమయ్యేపనికాదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కత్తిమీద సాము కానుంది. ఈ నేపథ్యంలో సర్కారు కూడా దాని పైనే ఫోకస్ చేయాల్సి ఉంటుంది. కొత్త మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. అంతేగాక పాత మున్సిపాల్టీల పాలక మండళ్ల గడువు జూన్ వరకు ఉన్నది. కొత్త మున్సిపాల్టీలకు, పాత మున్సిపాల్టీలకు కలిపి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచనగా కనిపిస్తున్నది. అప్పటివరకు కొత్త మున్సిపాల్టీల్లో స్పెషలాఫీసర్ల పాలననే కొనసాగించడానికి సర్కారు మొగ్గు చూపుతున్నది. ఇప్పటికే ఆరు నెలలుగా స్పెషలాఫీసర్ల పాలన కొనసాగుతుండగా, మరో ఐదు నెలలపాటు ఇదే తంతు జరగనుంది. మున్సిపాల్టీలకు పాలక మండళ్లు లేకపోవడంతో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాల్టీలను ఏర్పాటు చేసే సమయంలో ప్రజలకు ఒనగూరే సౌకర్యాలపై సర్కారు గొప్పగా ప్రచారం చేసింది. శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో మున్సిపాల్టీల్లో పనులకు అనుమతులు లభించలేదు. ఆ తర్వాత పంచాయతీలు ఎన్నికల కోడ్ అడ్డమెచ్చింది. ఫిబ్రవరిలో పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే కొత్త పనులకు అనుమతులు ఇచ్చే అవకాశం లేదు. దీంతో కొత్త మున్సిపాల్టీల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా తయారైంది. స్పెషలాఫీర్ల పాలనలో సర్కారు కనీస నిధులు కూడా కేటాయించలేదు. ఎంపీడీవోలు, ఎమ్మార్వోలను స్పెషలాఫీర్లుగా నియమించింది. వారికి మున్సిపాల్టీల పాలనపై సరైన అవగాహన లేదు. దీంతోపాటు ఉద్యోగులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నది. కొత్త మున్సిపాల్టీల్లో 2వేల మంది సిబ్బంది అవసరమని మున్సిపల్ శాఖ సర్కారు నివేదిక ఇచ్చింది. దానిపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. కొత్త మున్సిపాల్టీల చట్టం ప్రకారం రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కులు, శ్మశానాల ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ముఖ్యంగా పరిశుభ్రమైన మంచినీటి సౌకర్యం కల్పించాలి. రోడ్ల పరిశుభ్రత, చెత్త నిర్వహణ, డంపింగ్ యార్డు స్థలాల గుర్తించడం వంటి అనేక పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతానికి స్థానికంగా సమీకరించుకున్న నిధులతో కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కొత్త మున్సిపాల్టీ కమిషనర్ ఒకరు తెలిపారు. చెత్త నిర్వహణ కోసం స్థలాల సేకరణ, చెత్త కంపోస్టు చేయడానికి సాంకేతిక తోడ్పాటు అందించాల్సి ఉంటుంది.

## మెడికల్ కాలేజీల్లో పోస్టులను వెంటనే భర్తీ చేయాలి : సీపీఐ(ఎం)

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉద్యోగ విరమణ వయస్సు పరిమితి పెంపుదలపై తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని కోరింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే పద్ధతుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్‌లో మంచి ర్యాంకు పొందిన విద్యార్థులంతా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో చేరేందుకే మొదట ప్రాధాన్యత ఇస్తారని పేర్కొన్నారు. ఉస్మానియా, గాంధీ, కాకతీయ తదితర ప్రభుత్వ కాలేజీలన్నింటిలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉండటంతో విద్యానాణ్యత బాగా దెబ్బతినడంతోపాటు వైద్య, వైద్య ప్రమాదంలో పడిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే అధ్యాపకులు పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు పదవీ విరమణ జరుగుతుంటే, దానికి సరిపోయే విధంగా ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఏడు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉండాల్సిన అధ్యాపకులు, వైద్యుల సంఖ్య 2359 కాగా, కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వారితో కలిపి 1434 మంది మాత్రమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం 925 ఖాళీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అధ్యాపకుల విరమణ వయస్సును 65 ఏండ్లకు పొడిగిస్తూ గత సంవత్సరమే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికి అంది కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. దీంతో ఇక్కడ పదవీవిరమణ పొందిన అధ్యాపకులు ప్రయివేట్ మెడికల్ కాలేజీల వైపు వెళ్లుతున్నారని గుర్తు చేశారు. అధ్యాపకులు కొరత తీవ్రంగా ఉండటంతో రాష్ట్రానికి కేటాయించే పీజీ సీట్ల సంఖ్య కూడా తగ్గుతోందని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా భోదనా ఆస్పత్రుల్లో కూడా భారీ స్థాయిలో ఖాళీలు ఉండటంతో రోగులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు.

## దేశ భద్రత విదేశాలకు తాకట్టు : డీజీ

**నవతెలంగాణ-కంది**



మాట్లాడుతున్న డీజీ నరసింహారావు

దేశభద్రతను ప్రధాని మోడీ విదేశాలకు తాకట్టు పెట్టారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఆర్డినెన్స్ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు రోజుల నుంచి రక్షణ రంగ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఐ(ఎం), సీఐటీయూ మద్దతునిస్తోందని తెలిపారు. ప్రధాని మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలనీ, లేదంటే మరిన్ని పోరాటాలు ఎదుర్కోక తప్పదనీ హెచ్చరించారు. రక్షణ రంగాన్ని ప్రయివేటు పరం చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఎఫ్‌డీఐని ఆహ్వానించడం సరికాదన్నారు. మోడీ, అమిత్‌షాలు నకిలీ దేశ భక్తులని రాఫెల్ కుంభకోణంలో మోడీ కీలకపాత్ర పోషించారని విమర్శించారు. సభలో జేఏసీ నాయకులు బషీర్, రవి, గణేశ్, బాతోజీ, మల్లేశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై హైకోర్టులో పిటిషన్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని సీఎం సొంత నియోజకవర్గం గజ్వేల్‌కు చెందిన శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేసీఆర్‌పై 64 క్రిమినల్ కేసులు ఉంటే కేవలం 2 కేసులు ఉన్నట్టు మాత్రమే చూపారని పిటిషనర్ అందులో పేర్కొన్నారు. కేసీఆర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం పిటిషన్ విచారణకు రానుంది. మరోవైపు మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావుపై కాంగ్రెస్ నేత ప్రేమ్‌సాగర్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అధికా రులకు తెలియకుండా ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. దివాకర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. పోలింగ్ శాతంలోనూ తేడాలున్నాయని చెప్పారు. పిటిషన్‌ను సోమవారం హైకోర్టు విచారించ నుంది. ఎన్నికలు జరిగి 45 రోజులు పూర్తికానున్న నేపథ్యంలో హైకోర్టులో పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు గురు, శుక్రవారాల్లో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# కొన్ని కేసుల్లో కీలక సమాచారం ఇవ్వడం లేదు

- వివరాలు ఇవ్వకపోతే నేరుగా హాజరవ్వాల్సిందే : హైకోర్టు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కొన్ని కేసుల్లో కీలక సమాచారం ఇవ్వకుండా కోర్టు వ్యాజ్యాలను కాలయాపన అయ్యేలా చేస్తున్నారని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలో ఏకశిల ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి గత పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇచ్చారంటూ ఆయన పేరు కౌంటర్ వ్యాజ్యంలో పేర్కొనకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్ దాఖలు చేసిన కౌంటర్ వ్యాజ్యాన్ని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. పంచాయతీ రోడ్‌లో ఏకశిల పాఠశాల భవనాన్ని నిర్మించడాన్ని అడ్డుకోవాలని కోరుతూ సతీష్‌కుమార్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని శుక్రవారం ధర్మాసనం విచారించింది. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన పంచాయతీ సెక్రటరీ పేరు చెప్పకపోవడం వల్ల కోర్టు సమయాన్ని వృధా చేయడమే కాకుండా ఆ నిర్మాణానికి పరోక్షంగా అనుమతి ఇచ్చినట్లే అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. పూర్తి వివరాలు అందజేయకపోతే కార్యదర్శి స్వయంగా కోర్టుకు రావాల్సివస్తుందని హెచ్చరించింది.

ఏకశిల పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్న ఉపేందర్‌రెడ్డి, ఇందిరలకు నోటీసులు ఇచ్చింది. వారిద్దరూ ఈ వ్యవహారంపై వేసిన కేసును కూడా ఈపిల్‌తో జత చేయాలని హైకోర్టు నిర్ణయించింది. విచారణ 29కి వాయిదా పడింది.

# కుర్దు ఎంపీ విడుదలకు టర్కీ కోర్టు ఆదేశాలు



- 80రోజుల పాటు జైలులో నిరాహార దీక్ష చేపట్టిన గువెన్

**అంకారా** : నిర్బంధంలో ఉన్న కుర్దు ఎంపీ, హెచ్‌డీపీ పార్టీ నేత లెయ్‌లా గువెన్‌ను (55) తక్షణమే విడుదల చేయాలని టర్కీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. టర్కీ సైన్యం కుర్దు తిరుగుబాటుదారులపై దాడులకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. కుర్దు తిరుగుబాటుదారులను సమర్థించడమే కాకుండా ఎర్డొగన్ ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేశారు. గతేడాది జనవరిలో ఆమె చెరసాల పాలయ్యారు. ఇదిలా ఉండగా, ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలపై టర్కీ సైన్యం కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పీకేకే ) నేత అబ్దుల్లా ఒక్లాన్‌ను 1999లో అరెస్ట్ చేసింది. ఆయనపై మోపిన అభియోగాలన్నీ ఆర్మీ కోర్టులో రుజువయ్యాయి. ఈనేపథ్యంలో ఆయన 1999 నుంచి ఇస్తాంబుల్ జైలులో యావజ్జీవ కారాగారం అనుభవిస్తున్నారు. అయితే, ఆయన శిక్ష అనుభవిస్తున్న జైలులో సరైన భద్రతా ప్రమాణాలు లేవని, తమ నేతకు సరైన ఆహారం కూడా అందించడం లేదని గువెన్ గళమెత్తారు. టర్కీ ప్రభుత్వ చర్యలను ఆమె నినదించారు.

తన మద్దతుదారులతో వీధుల్లోకి చేరుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన అనంతరం జైలులో కూడా ఆమె నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. గతేడాది నవంబర్8 నుంచి నిరాహార దీక్ష చేపట్టడంతో ఆమె ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణించింది. ఆమె నిరాహారదీక్షను విరమింపజేసేందుకు టర్కీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఆమె చేపట్టిన నిరాహార దీక్షకు 150 మంది సహచర ఖైదీలు మద్దతు తెలపడం గమనార్హం.

## వెనెజులా వ్యవహారాలకు అమెరికా దూరంగా ఉండాలి

- ప్రవాస భారతీయురాలు తులసీ గబ్బార్డ్ వ్యాఖ్య



**వాషింగ్టన్** : వెనెజులా వ్యవహారాలకు అమెరికా దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ప్రవాస భారతీయురాలు తులసీ గబ్బార్డ్ వ్యాఖ్యానించారు. 'వెనెజులన్లు వారి భవితవ్యాన్ని వారే నిర్ణయించుకోవాలి. మనం అనుకున్న నేతలను వారు ఎంపిక చేసుకోవాలని మనం భావించరాదు' అని ఆమె ట్వీట్ చేశారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇతర దేశాల్లో అమెరికా సైన్యాన్ని మోహరించడాన్ని కూడా ఆమె విమర్శిస్తున్నారు. మరో ఇండియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు ఆర్.ఓ.ఖన్నా కూడా ట్రంప్ కొత్త విధానాన్ని విమర్శిస్తున్నారు. వెనెజులాలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో అక్కడి ప్రతిపక్ష నేతను అమెరికా సమర్థించరాదని అన్నారు.

## ట్రంప్ కీలక ప్రచార సభ్యుడు అరెస్ట్

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రచార సభ్యుడు రోగర్ స్టోన్‌ను అరెస్ట్ చేసినట్టు ఎఫ్‌బీఐ వెల్లడించింది. ఫ్లోరిడా నగరంలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు ధ్రువీకరించింది. ఆయనపై పలు క్రిమినల్ కేసులతో పాటు సాక్ష్యాలను తారుమారు చేసిన కేసును నమోదు చేశామని తెలిపింది. స్పెషల్ కౌన్సిల్ రాబర్ట్ ముల్లెర్ రోగర్ స్టోన్‌ను విచారించనున్నారు. కాగా,2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలు వచ్చాయి. డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్‌కు సంబంధించిన వ్యక్తిగత, రహస్య సమాచారం ఎన్నికలు సమీపించే ముందు లీకైంది. అయితే, ఈ లీకేజీ వెనుక రష్యా హస్తముందని డెమోక్రాటిక్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడుగా, పలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అనుకూలంగా ట్రంప్ ప్రసంగించారు. దీంతో, డెమోక్రాటిక్ పార్టీ కీలక నేతలంతా ట్రంప్‌నకు రష్యా మద్దతు ఉందని భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో హ్యాకింగ్ జరిగిందంటూ ఆరోపించారు. ఈ కేసు దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతున్నది. రాబర్ట్ ముల్లెర్ ఈ కేసుపై విచారణ చేపట్టారు.

## నెల రోజుల్లో ఐఎస్‌ను తుదముట్టిస్తాం : ఎస్‌డీఎఫ్ చీఫ్



**డమాస్కస్** : నెలరోజుల్లో ఐఎస్‌ను తుదముట్టిస్తామని సిరియా డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఎస్‌డీఎఫ్) చీఫ్ మజ్లూమ్ కొబానీ వెల్లడించారు. సిరియా తూర్పు ప్రాంతంలో యూఫ్రెయిట్ లోయ ప్రాంతంలో తలదాచుకున్న ఐఎస్ సభ్యులను తరిమివేస్తామని అన్నారు. ఎస్‌డీఎఫ్, యూఎస్ దళాలు గతేడాది సెప్టెంబర్10 నుంచి ఐఎస్ లక్ష్యంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నాయని అన్నారు. కాగా, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ నుంచి యూఎస్ సంకీర్ణదళాలు ఇటీవల తప్పుకున్నాయి. ఐఎస్‌పై ఒంటరిపోరుకు సిద్ధమైనట్టు కొబానీ తెలిపారు.

సిరియాలో పెట్రేగిపోయిన ఐఎస్‌పై గెలుపొందినట్టు గతవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సిరియాలో మోహరించిన 2వేల మంది సైనికులను తక్షణమే వెనక్కి రావాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ నిర్ణయం పట్ల అమెరికా రక్షణ మంత్రి జిమ్ మాటిస్ అసంతృప్తితో పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. అమెరికా రక్షణ శాఖ కీలక అధికారులు కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమ పదవులకు రాజీనామాలు చేశారు. ట్రంప్ నిర్ణయాన్ని మెజారిటీ అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారు. ఉగ్రవాదుల చెర నుంచి సిరియన్లను రక్షించడం కోసం కొంతకాలమైన అమెరికా బలగాలు సిరియాలో మోహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మొహ్మద్ అబ్దుల్లాకు మలేషియా రాజు బాధ్యతలు



**కౌలాలంపూర్** : మలేషియా రాజుగా మొహ్మద్ అబ్దుల్లా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈనెల 6న సుల్తాన్ మొహ్మద్ (49) పాలనా బాధ్యతల నుంచి అకస్మాత్తుగా తప్పుకోవడంతో ఆస్థానం ఖాళీ అయిన సంగతి తెలిసిందే. మలేషియా ఇస్లామిక్ రాయల్టీ సభ్యులు సమావేశమై పీఠంపై కూర్చోబెట్టాల్సిన బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మెజారిటీ సభ్యులు అబ్దుల్లా మొహ్మద్ అబ్దులాకు బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో, ఆయన ఎంపిక ఖరారైంది. ఈనెల31న మొహ్మద్ అబ్దుల్లాకు బాధ్యతలు అప్పగిస్తామని రాయల్టీ సభ్యులు ప్రకటించారు. మొహ్మద్ ఐదేండ్ల పాటు రాజుగా కొనసాగనున్నారు.

## ఇండోనేషియాలో వరదల్లో చిక్కుకొని 59 మంది మృతి



**జకార్తా** : ఇండోనేషియాలో వరదలు పోటెత్తాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. వరదల్లో చిక్కుకొని 59 మంది మృతి చెందారు. 46 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రాణ భయంతో 3,400 మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. సులవేసీ దీవిలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. 9జిల్లాలోని నదులు పొంగిపొర్లుతున్నాయని దక్షిణ సులవేసీ డిజాస్టర్ మిటిగేషన్ ఏజెన్సీ చీఫ్ శ్యామ్‌సిబార్ తెలిపారు. గోవా జిల్లాలో అపార ప్రాణనష్టం జరిగిందని చెప్పారు. ఈ ప్రాంతంలో వరదల్లో చిక్కుకొని 44 మంది మృతిచెందారని అన్నారు. ప్రత్యేక బృందాలు ఈప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టాయని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడంతో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మకాసర్ ప్రాంతంలో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. వరద ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాల ప్రజలు పాఠశాలల్లో, మసీదుల్లో , దేవాలయాల్లో తలదాచుకున్నారు. ఇండోనేషియా సైన్యం సహాయక చర్యల్లో పాల్గొంటున్నది.

## మెక్సికోకు శరణార్థుల బృందం

**వాషింగ్టన్ :** సెంట్రల్ అమెరికన్ శరణార్థుల మొదటి బృందాన్ని అమెరికా మెక్సికోలోని తిజువానాకు పంపనుంది. అమెరికాలోకి అక్రమంగానైనా ప్రవేశించేందుకు నెలల తరబడి వేలాదిమంది శరణార్థులు తిజువానాలో వేచి వున్నారు. మెక్సికోకి తిప్పి పంపబడే ఈ శరణార్థులందరూ అమెరికాకు వెలుపలనే వేచి వుండి ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాలు పూర్తి చేసుకోవాల్సి వుంటుందని శరణార్థుల రక్షణ ప్రొటోకాల్స్ (ఎంపీపీ) తెలిపింది. కేవలం పిల్లలు మాత్రమే వున్నా, లేదా ఒడిదుడుకులు ఎదుర్కొనే కొంతమందిని మాత్రం ఏ కేసుకు ఆ కేసు ప్రాతిపదికన పరిశీలించనున్నారు. దక్షిణ సరిహద్దు ప్రాంతానికి వచ్చే సెంట్రల్ అమెరికన్ కుటుంబాల సంఖ్యను తగ్గించాలన్నది ఎంపీపీ లక్ష్యమని అమెరికా హోం శాఖ తెలిపింది. అమెరికా చట్టాన్ని అవకాశంగా తీసుకుని తప్పుడు పత్రాలతో ఆశ్రయం కోరాలని వచ్చే వారి సంఖ్యను తగ్గించాల్సిందేనని అమెరికా దేశ భద్రతా వ్యవహారాల శాఖ తెలిపింది. అయితే, ప్రత్యేకంగా దృష్టి సారించాలనుకునే గ్రూపులకు చెందిన వారిని మాత్రం తాము ఆమోదించేది లేదని మెక్సికో విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎల్ సాల్వడార్, హోండూరస్, గ్వాటెమాలాల నుంచి ఇటీవలి కాలంలో అమెరికాకు వచ్చే శరణార్థుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.

## కెనడా విమానం అత్యవసర ల్యాండింగ్

- వెంటిలేషన్ సమస్యతో 185 మంది ప్రయాణీకులకు అస్వస్థత



వెంటిలేషన్ సమస్యతో అస్వస్థతకు గురైన 185 మంది ప్రయాణీకులు

ఒట్టవా: కెనడా విమానం అత్యవస ల్యాండింగ్ అయింది. విమానంలోని 185 మంది ప్రయాణికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో ల్యాండింగ్ చేసినట్టు విమానాశ్రయ అధికారులు తెలిపారు. విమానంలో వెంటిలేషన్ సమస్య తలెత్తడంతోనే అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్టు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే... కెనడా విమానశ్రయం నుంచి ఫోర్ట్ లాడర్డేల్క్ ఎయిర్ 782 విమానం 185 మంది ప్రయాణికులతో బయల్దేరింది. గాల్లోకి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అందులో ప్రయాణిస్తున్న వారంతా ఒక్కసారిగా కళ్లు దురదలు, వాంతులు, వికారంతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో విమానాన్ని కెనడాలోని క్యూబెక్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించేశారు. 10 మంది ప్రయాణీకులను వెంటనే ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు వెల్లడించారు. మిగతా వారికి విమానశ్రయంలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. విమానంలో వెంటిలేషన్ సమస్య తలెత్తడంతో ఈ సంఘటన చోటు చేసుకుందని అధికారులు పేర్కొన్నారు. గాలిలో నాణ్యత కొరవడడంతోనే ఇలాంటి ఇబ్బంది ఎదురైనట్టు వైద్యులు గుర్తించారు.

## ఫ్రాన్స్ బాటలో ఇరాక్...!

- ఎల్లోవెస్ట్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకున్న మహిళలు



**బాగ్దాద్ :** ఇరాక్‌లో బాస్రా నగరంలోని మహిళలు ఉద్యమ బాట పట్టారు. ఇరాక్‌లో అవినీతి పెరిగిపోయిందని, పౌర సేవల్లోనూ నాణ్యత లోపించిందంటూ విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా తామంతా ఉద్యమించాలని నిర్ణయించుకున్నామంటూ నిరసనకారులు నినదించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఫ్రాన్స్‌లో ఇంధన ధరలు పెరిగినప్పుడు అక్కడి యువత ఎల్లో వెస్ట్ ఉద్యమాన్ని చేపట్టి సఫలీకృతమైంది. ఫ్రాన్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా ఉద్యమబాట పట్టామని అన్నారు. ఫ్రాన్స్‌లో నిరసనకారులు ధరించిన ఎల్లో వెస్ట్స్ ధరించి మహిళలు నిరసన తెలపడం గమనార్హం.

# ఓడినోళ్లే ఒడిలోకి..!

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలకంటే, ఆ పార్టీ నేతలపైనే తొలి గురి

- అప్‌డేటెడ్ పంథాలో అధికార పార్టీ
- అందులో భాగమే గజ్వేల్ 'ప్రతాప'రెడ్డి రేవంత్ రెడ్డిపైనా అనుమానాలు?

ఇప్పటిదాకా నెలకొన్న ఊహాగానాలేమిటీ? టీడీపీలో ఒకరు, కాంగ్రెస్‌లోని పలువురు ఎమ్మెల్యేలపైకి టీఆర్ఎస్ వల విసిరిందనే కదా! మంత్రిమండలి కూర్పులో ఆలస్యానికి, 'ఆపరేషన్ ఆకర్ష్'కూ కొద్దో గొప్పో లింకు ఉన్నట్టు డౌట్ ఉండనే ఉన్నది. అదేం అవాస్తవం కాకపోవచ్చు. కానీ, అంతకంటే ముందు ఓడినోళ్లనే తొలుత ఒడిలోకి చేర్చుకోవడంపై అధికార పక్షం గురి పెట్టింది. స్థిరంగా ఉండని షేర్ మార్కెట్ రేట్లు, పెట్రోలు, డీజిలు, బంగారం వంటి ధరల్లాగే 'బంగారు తెలంగాణ'లోనూ పార్టీ మారడాల్లోని రాజకీయాలు నిలకడగా ఉండవు. ఏ రోజుకారోజు, కాదు..కాదు..ఏ పూటకాపూట అప్‌డేట్ అవుతుంటాయి మరి!

ఇల్లెందుల దుర్గాప్రసాద్



(ఫైల్)

కేసీఆర్‌తో వంటేరు


ఊహకందని రాజకీయాలు చేయడంలో కేసీఆర్ తర్వాతే ఎవరైనా! అని ఎన్నిసార్లయినా నిరూపితం అవుతూనే ఉంటుంది. అన్నీ కలిసొస్తే మినిమంగా భావి ఉప ప్రధానమంత్రిగా తెలంగాణ ముఖ్యమంత్రిలో 'దర్శనం' షురువైంది. యాగాలు, హోమాలు, రాజకీయాలు, పావులు కదపడాలు, లాబీయింగ్‌లు, పర్యటనలు, మంతనాలు వేటికవే అన్నట్టుగా చంద్రశేఖర్‌రావుది విలక్షణ శైలి అని కొత్తగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. కాంగ్రెస్‌లోని 19 మంది ఎమ్మెల్యేల్లో ఎందరుంటారో, మరెందరు 'ప్రగతి భవన్' ప్రవేశం పొందుతారోనని అనుమానంగా వేచి చూస్తున్నారు. ప్రతిపక్ష హోదానూ కాంగ్రెస్‌కు దూరం చేస్తారని శంకిస్తున్నారు. కానీ, ఆపరేషన్ ఆకర్ష్‌లో సత్వర ప్రాధాన్యం శాసనసభ్యులు కాదట! మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇతరులతోపాటు ఆ పార్టీ నుంచి గట్టి పోటీనిచ్చిన నాయకులేనని తాజాగా వినవస్తున్నది. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల్లో పట్టూ పలుకుబడి ఉన్న లీడర్లకు 'టీఆర్ఎస్ పేరు' పెట్టాలని డిసైడ్ అయ్యారనిపిస్తున్నది. ఈ క్రమంలో మారిన ప్రాధమ్యాన్ని కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న గజ్వేల్ నుంచే మొదటగా కానిచ్చేశారు. అక్కడి ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ నాయకుడు ఒంటేరు ప్రతాపరెడ్డిని టీఆర్ఎస్‌లో చేర్చుకున్న సంగతి ప్రస్తావనార్హం. ప్రతాప్‌రెడ్డి కోరుకున్నదానికీ, అధికార పార్టీ ఆశించినదానికీ భావ సారూప్యత ఉండడంతో ఈ ప్రక్రియ సాఫీగా జరిగిపోయింది. రానున్న కొన్ని నెలల్లోనే కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి వెళితే..గజ్వేల్ అసెంబ్లీ టికెట్ ఒంటేరుకు కేటాయిస్తారనేది టాక్. ఇదిలా ఉంటే, సేమ్ ఇట్లనే రాష్ట్రంలోని ఇతర సెగ్మెంట్లలో కూడా ప్రజా జీవితంలో దృఢమైన లీడర్లుగా గుర్తింపు ఉన్న ఇతరులనూ పనిలో పనిగా టీఆర్ఎస్‌లోకి తీసుకోవాలని యోచిస్తున్నారు. తద్వారా గరిష్ట స్థానాల్లో 'కారు'కు ఒకటి, రెండు దశాబ్దాలపాటు ఎదురు ఉండవద్దన్నది అంతిమ లక్ష్యం. అందుకే ఈ దీర్ఘకాలిక రాజకీయ వ్యూహానికి 'సత్వర ఎత్తుగడ'లను అనురిస్తున్నారు. కొడంగల్‌లో ఓడిపోయిన కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి కూడా రేపో మాపో కొన్నాళ్లకో టీఆర్ఎస్‌లో చేరే పరిస్థితులు ఉత్పన్నం కావన్న గ్యారెంటీ ఏమీ లేదనే భావిస్తున్నారు. మాటకారి రేవంత్‌రెడ్డి మొన్నటి ముందస్తు ఎన్నికల పరిణామాల అనంతరం చాలామటుకు సైలెంట్ అయిపోయారు. సమీప భవిష్యత్తులో ఆయన వైఖరి ఎట్లా ఉండబోతుందన్నది ఆసక్తి గొల్పుతున్నది. ఈ విధంగా రాజకీయాల్లో బలమైన కాంగ్రెస్ నేతలనే కాకుండా, చురుకైన ఇతర నాయకులనూ అక్కున చేర్చుకోవాలనే తపన 'గులాబీ' తోటలో విరబూసింది. భూపాలపల్లిలో గెలుపు అంచుల దాకా వెళ్లి, చివరికి ఓటమి చవిచూసిన గండ్ర సత్యనారాయణరావుకూ స్వయంగా టీఆర్ఎస్ పెద్దల ఊరడింపు లభించిందని తెలియవస్తున్నది. మంత్రి మండలి విస్తరణకూ, నయా చేరికలకూ లంకె ఉన్నదని జోరుగా చెప్పుకొంటున్నారు. తనతోపాటు మహమూద్‌అలీతో ప్రస్తుతం నెట్టుకురావడానికీ, మంత్రివర్గం ఏర్పాటులో జాప్యానికి ఇదో కారణంగా ఉటంకిస్తున్నారు. ముఖ్యంగా ఖమ్మంలో ఈ వ్యవహారం మరింత పదునుగా కేంద్రీకృతమైంది. తెలుగుదేశానికి ఆ ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో విజయం దక్కింది. ఇద్దరు 'దేశం' ఎమ్మెల్యేల్లో ఒకరైన సండ్ర వెంకటవీరయ్య టీఆర్ఎస్‌లోకి రాక, మినిస్టర్ పదవి అనుభవంలోకి రావడమే ఆలస్యమని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చించుకుంటున్నారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌తో మరోసారి సండ్ర మంతనాలు జరిపినట్టు కథనాలొచ్చాయి. మొత్తంగా ఒక్కమాటలో చెప్పాలంటే, మర్రి వృక్షం కింద మరో చెట్టు పోగుపోయనట్టు, ప్రధాన ప్రతిపక్షాలు భవిష్యత్తులో ఎదగకుండా టీఆర్ఎస్ జాగ్రత్త పడుతుందని గుసగుసలు.



రేవంత్

## ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమంటూ బంధువుల ధర్నా



**నవతెలంగాణ- క్లాక్‌టవర్**

గర్భిణికి సకాలంలో చికిత్స చేయకపోవడంతోనే శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బంధువులు ఆందోళన చేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..

కట్టంగూరు మండలం పామనగుండ్లకు చెందిన దేశపాక ధనలక్ష్మి మొదటి కాన్పు కోసం ఈనెల 23న జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో చేరింది. పురిటి నొప్పులు ఎక్కువవడంతో డ్యూటీలో ఉన్న డాక్టర్‌కు తెలిపారు. నొప్పులకు తాళలేకపోతుంది.. ఆపరేషన్ చేయాలని ధనలక్ష్మి తల్లి కోరినా డాక్టర్ పట్టించుకోలేదు. శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు సాధారణ ప్రసవం జరిగింది. కానీ పుట్టిన వెంటనే శిశువు మృతిచెందింది. రెండ్రోజులుగా పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నా ప్రసవం చేయకుండా డాక్టరు నిర్లక్ష్యం చేయడం వల్లే శిశువు ఊపిరాడక మృతిచెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు, బంధువులు మాతాశిశు ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ధనలక్ష్మి భర్త కిరణ్ కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్‌ను కలిసి డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.



# మాకు స్వేచ్ఛను కల్పించండి..

- కన్నడనాట దేవదాసీల ఉద్యమం
- ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు



**బెంగుళూరు :** దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేకంగా కర్నాటకలో నిరసనలు ఉధృతమయ్యాయి. ముఖ్యంగా కొద్ది రోజుల క్రితం బళ్లారి జిల్లాలోని హోసాపేట్‌లో జరిగిన ఆందోళన కార్యక్రమం రాష్ట్రంలో పెద్ద చర్చనీయాంశమైంది. దేవదాసీ వ్యవస్థలో బాధితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వం చేసిన వాగ్దానాల్ని అమలు జేయాలనీ, దేవదాసీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాలనీ 'కర్నాటక దేవదాసీ వుమెన్స్ లిబరేషన్' (కేఆర్‌డీఎంవీఎస్) ఎన్నో ఏండ్లుగా పోరాడుతోంది. కేఆర్‌డీఎంవీఎస్ 3వ రాష్ట్ర సదస్సు సందర్భంగా కర్నాటకలోని అనేక ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు జరిగాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ దేవదాసీ వ్యవస్థకు దళిత, అణగారిన వర్గాల్లోని మహిళలు బలవుతున్నారనీ, దీనిపై ప్రభుత్వాలు, పాలకులు దృష్టిసారించాలనీ పౌరహక్కులనేతలు, పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేఆర్‌డీఎంవీఎస్ చేస్తున్న పోరాటానికి ఇక్కడి వామపక్షాలు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించాయి. ఈ విషయమై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి యు.బసవరాజు మాట్లాడుతూ, "దేవదాసీ వ్యవస్థను రూపుమాపడానికి 1982లో చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ ఆ చట్టం సరిగ్గా అమలుకావటం లేదు. కాబట్టి దానిని మరింత సమర్థవంతంగా అమలుజేయాలి.1982లో కర్నాటక ప్రభుత్వం దేవదాసీ వ్యవస్థను రద్దు చేస్తూ చట్టాన్ని తీసుకొచ్చినా, ఉత్తర జిల్లాలో ఇంకా కొనసాగుతోంది. గ్రామాల్లో పెత్తందార్లు, ధనవంతుల అండదండతో దేవదాసీ వ్యవస్థ ఇంకా కొనసాగుతోందనీ, దేవదాసీ కుటుంబాల్లోని యుక్త వయస్సు బాలికల్ని బెదిరించి, భయపెట్టి దేవదాసీలుగా మారుస్తున్నారనీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కర్నాటక, తమిళనాడు, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ ఈ దేవదాసీ వ్యవస్థ ఇంకా కొనసాగుతోంది.

**బలవంతంగా తీసుకొస్తున్నారు**
**మాలమ్మ, కేఆర్‌డీఎంవీఎస్ రాష్ట్ర కార్యదర్శి**

మాదూర్‌లో దుర్గమ్మ దేవాలయం ఉంది. ఇద్దరు బాలికలు దేవదాసీలుగా తమను తాము దేవుడికి అర్పించుకున్నారనీ, ఆ విషయం తనకు కలలో కనబడిందనీ ఆ దేవాలయ పూజారి ఊరందరికీ తెలిపాడు. సంబంధిత కుటుంబానికి విషయాన్ని తెలిపి, ఆ ఇద్దరు బాలికల్ని దేవదాసీలుగా మార్చాలని కబురు పంపాడు. ' మా బిడ్డల భవిష్యత్తు ఏంటి?'అని బాలికల తల్లి దండ్రులు ఆందోళనవ్యక్తంచేయగా,వారికి ఇళ్లు ఏర్పాటు చేస్తామనీ, భూమి, తగినంత నగదు అందజేస్తామనీ గ్రామపెద్ద, దుర్గమ్మ గుడిపూజారీ ఆశలు కల్పించారు. చివరికి ఒప్పించారు. గ్రామాల్లో ఇప్పటికీ బలవం తంగానైనా దేవదాసీ వ్యవస్థను నడుస్తోందనడానికి ఇదే ఉదాహ రణ. ఈ ఘటన వివరాలు తెలియ గానే మేము వెళ్లి అడ్డుకున్నాం. దేవదాసీ వ్యవస్థను సంపూర్ణంగా రూపామాపాలన్నది మా ప్రధాన డిమాండ్.



దిల్‌రాజు, తమన్నా, అనిల్ రావిపూడి

## మరిన్ని నవ్వులు జోడించాం..

వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఎఫ్2'. దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి విడుదలైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ, 'మా సినిమా సంక్రాంతికి రిలీజ్ అయి ఇంత పెద్ద హిట్ కొట్టడం చాలా హ్యాపీగా ఉంది. ఇండస్ట్రీ నుంచి ప్రతి ఒక్కరు మంచి చిత్రం చేశారని ప్రశంసిస్తున్నారు. రెండు వారాలు పూర్తయి భారీ వసూళ్ళతో దూసుకుపోతుంది. సినిమా కోసం దర్శకుడు అనిల్ అద్భుతమైన సన్నివేశాలని తెరకెక్కించాడు. నిడివి దృష్ట్యా అన్నింటినీ చూపించలేకపోయాం. వాటిలో నుంచి ఐదు కామెడీ సన్నివేశాల్ని శనివారం నుంచి సినిమాకి యాడ్ చేస్తున్నాం. ఈ సీన్స్ ఆడియెన్స్‌ని మరింతగా ఎంటర్‌టైన్ చేస్తాయని నమ్ముతున్నా' అని అన్నారు. 'ప్రేక్షకుల్ని మరింతగా నవ్వించేందుకు ఈ సన్నివేశాలని జోడించాం. ఈ సినిమా వంద కోట్లను వసూళ్ళు చేసిందంటే అది ఏ ఒక్కరిదో కాదు. అదంతా టీమ్ సమిష్టి కృషి. ప్రతి ఒక్కరికి మంచి కిక్‌నిచ్చిన చిత్రమిది. పన్నెండేండ్లుగా వినోదానికి దూరమయ్యారు వెంకటేష్. మళ్ళీ పాత వెంకీని ఈ సినిమా ఆవిష్కరించింది. వరుణ్ తేజ్ ఇప్పటి వరకు కామెడీ చేయలేదు. తెలంగాణ యాసలో తనదైన నటనతో వెంకటేష్, రాజేంద్రప్రసాద్‌లతో పోటీ పడీ నటించాడు. 'బాహుబలి' తర్వాత తమన్నాకి పెద్ద హిట్‌ని అందించిన చిత్రమిది. ఆదరిస్తున్న ఆడియెన్స్‌కి పెద్ద థ్యాంక్స్' అని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తమన్నా చెబుతూ, 'దర్శకుడు అనిల్ ఈ కథ చెప్పినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. షూటింగ్ కూడా అలానే సాగింది. సినిమాని హిట్ చేసిన ఆడియెన్స్‌కి ధన్యవాదాలు' అని తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రగతి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## గణతంత్ర దినోత్సవ కానుక



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్ జంటగా తేజ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం విదితమే. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తాజాగా 'సీత' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్ జంటగా రూపొందిస్తున్న ఈచిత్రానికి 'సీత' అనే టైటిల్‌ని ఖరారు చేయడం ఆనందంగా ఉంది. బెల్లంకొండ గతంలో చేసిన చిత్రాలకిది పూర్తి భిన్నమైనది. తొలిసారి ఓ కొత్త కథలో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. గణతంత్ర దినోత్సవ కానుకగా నేడు(శనివారం) ఈ చిత్ర టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేస్తాం' అని తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: సిర్షా రే, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.

## తప్పుకోవడానికి కారణమదే..!

**'రోహిత్ శెట్టి రూపొందించే 'సూర్యవంశీ' చిత్రంలో నటించబోతున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు' అని తెలిపింది కత్రినా కైఫ్. గతేడాది 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', 'జీరో' చిత్రాల్లో నటించి ఆకట్టుకుంది కత్రినా. ఆ సినిమాలు పరాజయం చెందిన కత్రినాకి మంచి పేరొచ్చింది. ప్రస్తుతం ఆమె సల్మాన్ ఖాన్‌తో కలిసి 'భారత్' చిత్రంలో నటిస్తుంది. ఇదిలా ఉంటే 'ఏబీసీడీ 2'లో కథానాయికగా మొదట కత్రినానే ఫైనల్ చేశారు. కానీ తర్వాత ఆమె తప్పుకుంది. దీనిపై రకరకాల కథనాలు వెలువడ్డాయి. తాజాగా దీనిపై కత్రినా స్పందించింది. 'ఓ సినిమా నుంచి తప్పుకున్నామంటే బలమైన కారణమే ఉంటుంది. ప్రస్తుతం నేను 'భారత్' చిత్రంలో నటిస్తున్నా. ఇది చాలా కష్టతరమైన సినిమా. చాలా ఎఫర్ట్స్ పెట్టాల్సి ఉంది. పైగా రంజాన్‌కి రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. ఈ నేపథ్యంలో నేను మరో సినిమాపై దృష్టి పెట్టలేను. దీంతో ఆ సినిమాకి డేట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయా. అందుకే తప్పుకున్నా. ప్రస్తుతం నా ఫోకస్ అంతా 'భారత్'పైనే ఉంది. ఆ తర్వాత మరే సినిమాకి సైన్ చేయలేదు' అని తెలిపింది. 'ఏబీసీడీ 2'లో కత్రినా తప్పుకోవడంతో ఆ స్థానంలో శ్రద్ధా కపూర్‌ని ఎంపిక చేసిన విషయం విదితమే.**



కత్రినా కైఫ్

## ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది!



అల్లు అర్జున్, త్రివిక్రమ్

అల్లు అర్జున్ తెరపై కనిపించి దాదాపు ఏడాది కావస్తుంది. 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తర్వాత గ్యాప్ తీసుకుని ఇటీవల త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాల్లో నటించిన విషయం విదితమే. ఈ రెండు సినిమాలు బాక్సాఫీసు వద్ద మంచి విజయాలని అందుకున్నాయి. ప్రస్తుతం మూడోసారి ఈ కాంబినేషన్‌ని రిపీట్ చేసి హ్యాట్రిక్ హిట్ కొట్టాలని భావిస్తున్నారు. ఈ సినిమాని ఫిబ్రవరి రెండో వారంలో ప్రారంభించేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తుంది. ఇప్పటికే స్క్రిప్ట్ లాక్ అయిపోయిందని, ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో భాగంగా ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోందని సమాచారం. ఇందులో భాగంగా అల్లు అర్జున్ సరసన కథానాయికగా కైరా అద్వానీ పేరు వినిపిస్తోంది. తండ్రి, తనయుడి సెంటిమెంట్‌తో ఈ చిత్రం ఉంటుందని తెలుస్తుంది. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నారు. త్రివిక్రమ్ గతేడాది ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత' చిత్రాన్ని రూపొందించి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత చిరంజీవి హీరోగా ఓ సినిమా చేయనున్నారు త్రివిక్రమ్.



సమంత

# నవచిత్రం

## పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో నయా సినిమా!



బోయపాటి శ్రీను, బాలకృష్ణ

బాలకృష్ణ నెక్స్ట్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో హ్యాట్రిక్ హిట్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. గతంలో వీరి కాంబినేషన్ 'సింహా', 'లెజెండ్' చిత్రం వచ్చి బాక్సాఫీసు వద్ద బ్లాక్ బస్టర్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో నయా సినిమా ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా? అని అంతా ఎదురు చూస్తున్నారు. అందుకు ఫిబ్రవరిలో ముహూర్తం పెట్టారట. బోయపాటి శ్రీను స్టయిల్‌లో శక్తివంతమైన కథాంశంతో ఈ సినిమాని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. మరి ఇందులో నటించే కథానాయిక ఎవరనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రామ్ చరణ్ హీరోగా బోయపాటి రూపొందించిన 'వినయ విధేయ రామ' ఇటీవల సంక్రాంతి కానుకగా విడుదలై డిజాస్టర్‌గా నిలిచింది. అలాగే బాలకృష్ణ నటించిన బయోపిక్ 'ఎన్టీఆర్–కథానాయకుడు' సైతం సంక్రాంతి కానుకగా విడుదలై ఆశించిన ఫలితాన్ని రాబట్టుకోలేకపోయింది. ఇందులో భాగంగా రెండో భాగం 'ఎన్టీఆర్–మహానాయకుడు' ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నారు. ఆ తర్వాత బోయపాటి సినిమాని ప్రారంభించనున్నారట. ప్రారంభం సందర్భంగానే పలు యాక్షన్ ఎపిసోడ్స్ చిత్రీకరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. రాజకీయ నేపథ్యంలో సినిమా సాగుతుందని తెలుస్తుంది. దీన్ని తన ఎన్‌బీకే ఫిల్మ్స్ పతాకంపై బాలకృష్ణ నిర్మించనున్నారు. ఈ చిత్రం తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ ఓ సినిమా చేయనున్నట్టు తెలుస్తుంది.

## మరో బైలింగ్వల్ చిత్రం



విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ ప్రస్తుతం తెలుగులో అత్యంత క్రేజీ కథానాయకుడు. 'అర్జున్‌రెడ్డి', 'గీత గోవిందం', 'టాక్సీవాలా' విజయాలతో అత్యంత డిమాండెడ్ హీరోగా మారాడు. ఆయనతో సినిమాలు తీసేందుకు స్టార్ డైరెక్టర్స్ నుంచి యువ దర్శకులు సైతం క్యూ కడుతున్నారు. గతేడాది పొలిటికల్ థ్రిల్లర్ 'నోటా' వంటి బైలింగ్వల్ చిత్రంలో నటించి మెప్పించిన విజయ్ దేవరకొండ తాజాగా మరోసారి ద్విభాషా చిత్రం చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారట. ఓ నూతన దర్శకుడి డైరెక్షన్‌లో ఈ సినిమా చేసేందుకు విజయ్ ప్లాన్ చేస్తున్నారు. నవ్యమైన కథాంశంతో సినిమా ఉంటుందని టాక్. ప్రస్తుతం ఆయన 'డియర్ కామ్రేడ్'లో నటిస్తున్నారు. భరత్ కమ్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కాలేజ్ నేపథ్య ప్రేమకథతో సినిమా సాగుతుందని టాక్. ఇందులో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. దీంతోపాటు క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు నటిస్తున్నారు. కె.ఎస్.రామారావు ఈ సినిమాని నిర్మిస్తుండటం విశేషం.

## రీమేక్‌లో శర్వానంద్‌తో..!

**సమంత ఇటీవల మహిళా ప్రధాన చిత్రాలపై దృష్టి సారించింది. 'మహానటి'లో జర్నలిస్ట్‌గా నటించి సినిమా విజయంలో కీలక భూమిక పోషించింది. ఆ తర్వాత 'యూటర్న్'తో మెయిన్ లీడ్‌గా విమర్శకుల ప్రశంసలందుకుంది. త్వరలో లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మిస్‌గ్రానీ' రీమేక్‌లో నటించబోతుంది. తాజాగా మరో రీమేక్‌కి సైన్ చేసినట్టు తెలుస్తుంది. తమిళంలో విజయ్ సేతుపతి, త్రిష జంటగా రూపొంది ఘన విజయం సాధించిన చిత్రం '96'. దీన్ని తెలుగులో నిర్మాత దిల్‌రాజు రీమేక్ చేయబోతున్నారు. ఇందులో శర్వానంద్ హీరోగా నటించబోతున్నట్టు తెలుస్తుంది. ఆయనకు జోడీగా సమంతని ఎంపిక చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉందట. ప్రస్తుతం సినిమాకి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. శర్వానంద్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. తమిళంలో దర్శకత్వం వహించిన సి. ప్రేమ్ కుమార్ ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహించే ఛాన్స్ ఉందని టాక్. ప్రస్తుతం సమంత 'మజిలీ' చిత్రంలో నటిస్తుంది. పెళ్ళైన తర్వాత భర్త, నటుడు నాగచైతన్యతో కలిసి నటిస్తున్న తొలి చిత్రమిది. ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఇక 'మిస్‌గ్రానీ' రీమేక్‌కి నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, దీనికి 'ఓ బేబీ! ఎంత సక్కగున్నావే' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారట. దీంతోపాటు తమిళంలో 'సూపర్ డీలక్స్'లో సమంత నటిస్తోంది.**

## దేశంతో కలిసి ఓ వ్యక్తి జర్నీ



సల్మాన్ ఖాన్

'నీ ఇంటి పేరేంటి?, జాతి ఏంటి? అని ప్రజలు నన్ను అడుగుతుంటారు. వారందరికి నేను చిరునవ్వుతో చెప్పే సమాధానం ఒక్కటే. మా నాన్న నాకు దేశాన్ని దృష్టిలో పెట్టుకుని 'భారత్' అని పెట్టార'ని చెబుతున్నాడు సల్మాన్. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'భారత్'. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో కత్రినా కైఫ్, దిశా పటానీ కథానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రమిది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ట్రీట్ ఇచ్చారు సల్మాన్. శుక్రవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఇందులో పై విధంగా సల్మాన్ చెప్పే డైలాగ్‌లు, ఆయన స్టయిల్, విభిన్న గెటప్స్‌లో కనిపించే తీరు సినిమాపై అంచనాలని పెంచుతుంది. 'దేశంతో కలిసి ఓ మనిషి చేసే ప్రయాణం' అనే క్యాప్షన్ ఆసక్తిని క్రియేట్ చేస్తుంది. ఇందులో సల్మాన్ సర్కస్‌మెన్‌గా కనిపించనున్నారు. అందుకు తగ్గట్టుగానే ఐదు భిన్న గెటప్స్‌లో కనువిందు చేయనున్నట్టు తెలుస్తుంది. రంజాన్ కానుకగా సినిమా విడుదల కానుంది.



ఫరా, అజీజ్, ఆర్.కె.మామ, అలీ రాజా, సూఫీ ఖాన్

## రియల్ ఎస్టేట్ నేపథ్యం

ఆర్.కె.మామ, అజిజ్ నాజర్, అలీ రాజా, ఫరా, సూఫీ ఖాన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'హైదరాబాద్ నవాబ్స్ 2'. ఉటోపియా ఎంటర్‌టైనర్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఆర్.కె.మామ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్, ట్రైలర్ విడుదల కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కె.మామ మాట్లాడుతూ, '2006లో వచ్చిన 'హైదరాబాద్ నవాబ్స్' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికి తెలిసిందే. అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. హైదరాబాదీ సినిమాని నిలబెట్టాలని, 13ఏండ్ల తర్వాత దీనికి సీక్వెల్‌ని తీసుకొస్తున్నాం. మంచి కథను రాసుకున్నా. చిన్న సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తే అదే పెద్ద సినిమా అవుతుంది. రియల్ ఎస్టేట్ నేపథ్యంలో సినిమాని తెరకెక్కించాను. ప్రతి ఒక్కరు తమ లైఫ్‌లో జరిగిన సంఘటనలని గుర్తు చేసేలా ఈ చిత్రం ఉంటుంది. చాలా రియలిస్టిక్‌గా ఉంటూ ఆద్యంతం కామెడీని పంచుతుంది. ఆడియెన్స్‌కి బాగా కనెక్ట్ అవుతుందని ఆశిస్తున్నా. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'కామెడీ కడుపుబ్బా నవిస్తుంది' అని అజీజ్ తెలిపారు.

## 86 సంవత్సరాల తెలుగు సినిమా ప్రయాణం



ధర్మారావు, కృష్ణ, విజయ నిర్మల, రేలంగి నరసింహారావు, నరేష్ తదితరులు

అక్కినేని నాగేశ్వరరావు, దాసరి నారాయణరావు, రామానాయుడు, డి.వి.ఎస్.రాజు సలహాదారుడు, ఫిల్మ్ ఎనలిటికల్ అండ్ అసోసియేషన్(ఫాస్) వ్యవస్థాపకులు కె.ధర్మారావు వెలువరించిన '86 సంవత్సరాల తెలుగు సినిమా' గ్రంథాన్ని నటుడు కృష్ణ, గిన్నిస్ బుక్ రికార్డ్ గ్రహీత, దర్శకురాలు విజయ నిర్మలకి అంకితమిచ్చారు. ఈ అంకితోత్సవ కార్యక్రమం శుక్రవారం కృష్ణ నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా కె.ధర్మారావు మాట్లాడుతూ, 'ఐదు దశాబ్దాలుగా నా వద్దనున్న, వివిధ రకాలుగా సేకరించిన సమాచారంతో 86వసంతాల తెలుగు సినిమాని పుస్తకంగా తీసుకొచ్చాను. ఈ విషయాలని దర్శకరత్న దాసరి నాలుగేండ్లుగా వింటూ తన ప్రశంసించడంతో నేను పడిన కష్టం మర్చిపోయేలా చేసింది' అని అన్నారు. 'ఇంత అందమైన పుస్తకాన్ని తెలుగు సినిమాకి బహుకరిస్తున్నట్టుగా మేం భావిస్తున్నాం. మాకు అంకితం చేయడం ఆనందంగా ఉంది' అని కృష్ణ, విజయ నిర్మల తెలిపారు. '484పేజీల విషయం, 24పేజీల రంగుల పుటలతో విశిష్ట సమాచారంతోపాటు చక్కటి ఫొటోలతో తెలుగు సినిమా విశేషాలని పుస్తకంలో బాగా ఆవిష్కరించారు. ఇది ఖచ్చితంగా తెలుగు సినిమా పరిశ్రమకి ఒక ఎన్‌సైక్లోపీడియాగా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకంపై ధర్మారావు 14ఏండ్లుగా ఎంతగా కష్టపడ్డారో నాకు తెలుసు' అని ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు తెలిపారు. నటుడు నరేష్ చెబుతూ, 'ధర్మారావు తెలుగు సినిమా 86సంవత్సరాల చరిత్రను చక్కగా విశదీకరించి, తెలుగు సినిమా సేవలో మరో ముందడుగు వేశారు' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి రాధ ప్రశాంతి, వంశీ రామరావు, డా॥కేమల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## రొమాంటిక్ కామెడీ సూర్యకాంతం



నిహారిక, రాహుల్ విజయ్

నిహారిక, రాహుల్ విజయ్ జంటగా ప్రణీత్ బ్రమండపల్లి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సూర్యకాంతం'. నిర్వాణ సినిమాస్ పతాకంపై సందీప్ ఎర్రం రెడ్డి, సృజన్ యారబోలు, రామ్ నరేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం కానుకగా ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ, 'రొమాంటిక్ కామెడీగా సినిమాని రూపొందిస్తున్నాం. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కి మంచి స్పందన లభించింది. తాజాగా రిలీజ్ చేసిన టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో రాహుల్ విజయ్, నిహారిక మధ్య వచ్చే సన్నివేశాలు అలరిస్తున్నారు. సూర్యకాంతం చేసే ఫన్ బాగా ఆకట్టుకుంటుంది. టీజర్ రీ ఫ్రెషింగ్‌గా ఉందంటున్నారు. సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. ప్రస్తుతం ప్రోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి మార్చి 29న సినిమాని విడుదల చేయనున్నాం. ఆద్యంతం వినోదాన్ని పంచే మా సినిమాని ఆదరించాలని ప్రేక్షకులని కోరుకుంటున్నాం' అని అన్నారు. శివాజీ రాజా, సుహాసిని, పెర్లెన్ భేసానియా, సత్య ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె.రాబిన్, సినిమాటోగ్రఫీ: హరిజ్ ప్రసాద్, ఆర్ట్: అవినాష్ కొల్లా, ఎడిటర్: రవితేజ గిరిజాల.

# 'పంచాయతీ' ఘటనలు

**నవతెలంగాణ- యంత్రాంగం**

గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికలు స్వల్ప ఘర్షణలు.. నిలదీతలు, నిరసనల నడుమ ముగిశాయి. పలు చోట్ల టీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసుకున్నారు. అభ్యర్థికి కేటాయించిన గుర్తు తప్పుగా రావడంతో నిజామాబాద్‌లో పోలింగ్ నిలిపేశారు. ఆదిలాబాద్‌లో ఓటర్ల పేర్లు తారుమారు రావడంతో ఓట్ల లెక్కింపు ఆపేశారు. ఆదిలాబాద్ జిల్లాలోనే రెండోసారి ఓడిపోయాననే మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. యాదాద్రి జిల్లాలో గ్రామాన్ని మరో కొత్త పంచాయతీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ పోలింగ్‌ను బహిష్కరించారు. జనగామ జిల్లాలో పోలింగ్ బూత్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్న టీఆర్ఎస్ కార్యకర్తను కాంగ్రెస్ వారు నిలదీయడంతో ఘర్షణ జరిగి ఇరువురూ కొట్టుకున్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపులో ఒకటి, రెండు ఓట్ల తేడాతోనూ పలువురు గెలుపొందారు. టాస్ విజేతలూ ఉన్నారు.


**టాస్ విజేత..**

- ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని కొమ్ము గూడెంలో టీఆర్ఎస్ అభ్యర్థి కల్తీ భద్రమ్మ, టీఆర్ఎస్ అభ్యర్థి కల్తీ రాణిలకు సమానంగా 253ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు టాస్ వేసి కల్తీ భద్రమ్మను విజేతగా ప్రకటించారు.
- కారేపల్లి మండల పరిధిలోని గాదెపాడులో పంచాయతీలో సీపీఐ(ఎం) అభ్యర్థి కేళోత్ స్వప్న, టీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా రమాదేవిలకు చెరో 500ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు రెండుసార్లు రీకౌంటింగ్ చేసినా ఫలితం అదే రావడంతో టై అయినట్టు ప్రకటించారు. కాగా ఇరు గ్రూపుల వారు ఆందోళనకు దిగారు.
- గిద్దవారిగూడెంలో జర్పుల బోడెమ్మ రెండు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తొలుత మూడు ఓట్ల మెజార్టీ అని ప్రకటించగా, రీకౌంటింగ్‌లో ఒక ఓటు తగ్గి రెండు ఓట్ల మెజార్టీతో బోడెమ్మ గెలుపొందారు.
- కల్లూరు మేజర్ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి టీఆర్ఎస్ నుంచి ఒకరు ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గ్రూపు నుంచి, మరొకరు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గ్రూపు నుంచి పోటీ పడ్డారు. వీరితో పాటు సీపీఐ(ఎం) అభ్యర్థి బరిలో ఉన్నారు. టీఆర్ఎస్ ఇరు గ్రూపుల వారూ పోలింగ్ బూత్‌ల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.
- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ త్రిపురారం మండలంలోని బాబుసాహెబ్‌పేట గ్రామపంచాయతీలో ఓటరు ఓటు వేసేందుకు కన్పించడం లేదని కాంగ్రెస్ కార్యకర్తల సహాయం తీసుకున్నారు. టీఆర్ఎస్ వారు అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ వారు టీఆర్ఎస్ కార్యకర్తపై దాడి చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టారు.
- నిడమనూరు మండలం శాఖాపురంలో ఓ మహిళ ఓటును కాంగ్రెస్ వారు బాలికతో వేయిస్తుండగా టీఆర్ఎస్ నాయకులు పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**నిలిచిన ఓట్ల లెక్కింపు**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం తోషంతండాలో ఓట్ల లెక్కింపు నిలిపేశారు. 3వ వార్డులో రాథోడ్ మౌనిక తండ్రి రాథోడ్ రమేష్ పేరుతో ఇద్దరు ఓటర్లు ఉన్నారు. అయితే అసలు ఓటరుకు బదులు మౌనిక పేరు గల మరో ఓటరు ఓటేశారు. ఆ సమయంలో ఏజెంట్లుగానీ, పోలింగ్ సిబ్బందిగానీ ఫొటోను గమనించలేదు. కొంత సేపటికి అసలు ఓటరు రావడంతో విషయం బయటపడింది. ఆమెకు టెండర్ ఓటు వేసేందుకు అనుమతిచ్చి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓట్ల పెట్టెలను సీజ్ చేసి ఎంపీడీఓ కార్యాలయాన్ని తరలించారు.

## సర్పంచ్ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నం



రెండోసారీ సర్పంచ్ అభ్యర్థిగా ఓడిపోయాననే మనస్తాపంతో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం ముత్నూర్‌తండా (దాజితండా) టీఆర్ఎస్ అభ్యర్థిని పవార్ కళాబాయి(35) ఆత్మహత్యాయత్నం చేసింది. సర్పంచ్‌గా జాదవ్ సులోచనాబాయి గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థికి 154 ఓట్లు రాగా, 84 ఓట్లతో కళాబాయి నాల్గో స్థానంలో నిలిచారు. ఓడిపోయానని తెలియగానే కళాబాయి పోలింగ్ కేంద్రం నుంచి ఇంటికి వెళ్లిపోయింది. పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కొద్ది సేపటికి ఇంటికెళ్లిన భర్త గమనించి స్థానికుల సాయంతో ద్విచక్ర వాహనంపై జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నారు.

**ఆగిన పోలింగ్**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లాపల్లిలో పోలింగ్ నిలిపేశారు. సర్పంచ్ అభ్యర్థికి కేటాయించిన గుర్తు తప్పుగా రావడంతో వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. సికిందర్‌కు కేటాయించిన కప్పుసాసర్‌కు బదులుగా బ్యాలెట్ పేపర్‌లో బ్యాట్ గుర్తు వచ్చింది.

## ఎన్నికల బహిష్కరణ



యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం తూర్పుబాయి గ్రామాన్ని నూతనంగా ఏర్పడిన కదిరి గూడెం పంచాయతీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ ఆ గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. తూర్పుబాయిని పాత గ్రామపంచాయతీ నాంచారిపేటలోనే కొనసాగించాలని గ్రామస్తులు తీర్మానించుకున్నారు. దీనిపై కలెక్టర్, పంచాయతీరాజ్ సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదు. దీంతో పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

## బూత్ వద్ద ప్రచారం.. ఘర్షణ



జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం రఘునాథపల్లికి చెందిన ఇమ్మడిశెట్టి శివరాం టీఆర్ఎస్ నుంచి 8వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నాడు. ఓటు వేయడానికి వచ్చిన కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి రంగు శ్రీనివాస్.. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేస్తున్న శివరాంను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారితీసి దాడి చేసుకున్నారు. శ్రీనివాస్ బయటకు రాగానే శివరాం సోదరులతో కలిసి కొట్టారు. అది గమనించిన కాంగ్రెస్ నాయకులు అక్కడకు చేరుకుని శివరాంపై దాడి చేశారు. ఇదే సమయంలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య హన్మకొండ నుంచి ఎర్రవెల్లికి వెళ్తున్నారు. రోడ్డుపైనే ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకొని నిరసన తెలిపారు.

## ఓటు కోసం మంచంపై..



ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే కావున పోలింగ్ కేంద్రానికి అందరినీ తీసుకురావడానికి అభ్యర్థులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని సీతానగర్‌లో పక్షపాతంతో బాధపడుతున్న జాదే హోక్టును ఇలా మంచంపై పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి ఆయనతో ఓటు వేయించారు.

## చిన్నారిపై లైంగికదాడి



(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదు చేసింది. వారి సాయంతో బాలికను ఆస్పత్రికి తరలించారు. సీఐ శంకరయ్య సెక్టార్ ఎస్ఐ రామదాస్‌తో కలిసి బస్తీలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. అందులో మొహినుద్దీన్ చిన్నారిని తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. మొహినుద్దీన్‌ను గంట వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. తాగిన మత్తులో తానే చిన్నారిపై లైంగికదాడి చేసినట్టు ఒప్పుకున్నాడు.

**నిందితున్ని కఠినంగా శిక్షించాలని ధర్నా**

నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాధితురాలి బంధువులు, కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం దుండిగల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఏసీపీ గోవర్ధన్ అక్కడకు వచ్చి వారితో మాట్లాడారు. నిందితుడు మొహినుద్దీన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

పాలమూరు ఎత్తిపోతల పథకానికి

# రెండవ దశ అటవీ అనుమతులు

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రెండవ దశ అటవీ అనుమతులు లభించాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. కేంద్ర అటవీ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రావణ్‌కుమార్ శర్మ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి శుక్రవారం లేఖ రాశారు.

పాలమూరు ప్రాజెక్టుకు పూర్తి స్థాయి అటవీ అనుమతులు రావటంతో 500 ఎకరాల అటవీ భూమిలో ప్రాజెక్టు పనులు చేపట్టడానికి మార్గం సుగమం అయిందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రెండవ దశ అటవీ అనుమతులు వచ్చిన విషయాన్ని ఎర్రవల్లిలో యాగంలో ఉన్న సీఎం కేసీఆర్‌కు అధికారులు తెలిపారు. ఈ అనుముతులను ఇచ్చినందుకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. అనుమతుల కోసం కృషి చేసిన రాష్ట్ర సాగునీటి, అటవీ శాఖల అధికారులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. పాలమూరు ప్రాజెక్టు కోసం వినియోగించుకునే అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించి ఈ భూమిలో అడవిని పెంచటానికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12 లక్షల ఎకరాలకు సాగునీరందించే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పూర్తి స్థాయి అటవీ అనుమతులు రావటంతో న్యాయపరమైన వివాదాలు తొలగినట్టేనని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు అటవీ పర్యావరణ అనుమతులు లేక పోయినా పనులు కొనసాగిస్తున్నారంటూ గతంలో ఎన్జీటీలో దాఖలైన పిటిషన్ విచారణలో ఉన్నది. రూ. 40,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు.

# 1300 స్థానాల్లో స్వతంత్రుల హవా

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల హవా కొనసాగుతున్నది. ఇప్పటివరకు జరిగిన రెండు విడతల సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల మద్దతు లేకుండా ప్రజామద్దతుతో స్వతంత్రులు ఇప్పటివరకూ 1300 స్థానాల్లో సత్తా చాటారు. సర్పంచ్ ఎన్నికలు పార్టీల గుర్తులతో కాకుండా సాధారణ గుర్తులతో జరిగినప్పటికీ ఆయా పార్టీల మద్దతు లేకుండా నెగ్గుకురావటం కష్టం. పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన వారికి ఆర్థ, అంగ బలం కలిసివస్తుండగా...స్వతంత్రంగా పోటీచేసే వారు అన్నీ తామై వ్యవహరించాల్సిన పరిస్థితి. ఏ పార్టీ నుంచీ టిక్కెట్ దక్కని వాళ్లు, అధికార, ప్రతిపక్ష, తదితర పార్టీల మద్దతు లభించక బరిలోకి దిగిన వారే ఇందులో ఎక్కువగా ఉన్నారు. పార్టీల నుంచి పోటీచేస్తే తమ పట్ల సానుభూతి చూపే వారి ఓట్లు ఎక్కడ పడకుండా ఉంటాయేమోనన్న కారణంతోనూ కొందరు స్వతంత్రంగా బరిలోకి దిగారు. మరికొందరు రెండు, మూడు పార్టీల మద్దతుతో స్వతంత్రంగా గోదాలోకి దిగారు. ఆర్థికంగా బలహీనంగా ఉండటాన్ని సాకు చూపి పార్టీలు టికెట్ నిరాకరించడంతో పోటీలో నిలిచిన వారు మరికొందరు ఉన్నారు. అయితే, ఆయా గ్రామాల్లో పార్టీల మద్దతుతో బరిలోకి నిలిచిన వారి కంటే స్వతంత్ర అభ్యర్థులూ తమ ప్రభావాన్ని చూపుతున్నారు. ఎక్కువగా గ్రామంలో ఉంటూ ప్రజలతో నిత్యసంబంధాలు కలిగి ఉండటంతో ఆయా పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన వారిని మట్టికరిపించారు. కాంగ్రెస్ పార్టీతో ఇంచుమించు సమానంగా స్వతంత్రులు తమ ప్రభావాన్ని చూపగలిగారు. మొత్తంగా రెండు విడతల్లో స్వతంత్రులు 1300 స్థానాల్లో విజయదుందుబి మోగించారు. వారి గెలుపు వెనుక గ్రామస్తులతో గల సత్సంబంధాలతో పాటు వారి సామాజిక తరగతి, డబ్బు, మద్యం ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. తమదైన శైలిలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడం మూలంగా నమ్మకాన్ని సాధించుకున్నారు. కొందరికి సామాజిక నేపథ్యం కలిసిరాగా, మరికొందరు స్వతంత్ర అభ్యర్థులు సైతం తాయిళాలు ఆశచూపి ప్రజల ఓట్లను కొల్లగొట్టుకున్నారు. రెండో విడతతో ఆదిలాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 80కిపైగా స్థానాల్లో స్వతంత్రంగా బరిలోకి దిగి గెలుపొందారు.

# 'పద్మ అవార్డు'ల ప్రకటన



ద్రోణవల్లి హారిక

(మొదటిపేజీ తరువాయి)

చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, తెలంగాణ నుంచి జాతీయ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛత్రి, రైతునేస్తం వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వర్ రావులకు పద్మశ్రీ వరించింది. తెలుగు సినీరంగంలోని గేయరచయితలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న సిరివెన్నెలకు పద్మశ్రీ అవార్డు వరించడం పట్ల తెలుగు చిత్రసీమ పెద్దలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## పద్మ భూషణ్..

మోహన్‌లాల్.. సినీరంగం, సుఖ్‌దేవ్ సింగ్ దిండ్సా.. పబ్లిక్ అఫైర్స్, మహాశయ్ ధరమ్ పాల్ గులాటి.. పబ్లిక్ అఫైర్స్, దర్శన్‌లాల్ జైన్.. సోషల్ వర్క్, అశోక్ లక్ష్మణ్ రావ్.. మెడికల్, కరియా ముండా.. పబ్లిక్ అఫైర్స్, బుహాదిత్యా ముఖర్జీ.. సంగీతం, నంభి నారయణ్.. సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బచేంద్ర పాల్.. క్రీడలు, వి కె శుంగ్లు.. సివిల్ సర్వీస్, హుకుందేవ్ నారాయణ్ యాదవ్.. పబ్లిక్ అఫైర్స్, కుల్దీప్ నయ్యర్.. జర్నలిజం, ప్రవీణ్ గోర్డన్.. పబ్లిక్ అఫైర్స్ (విదేశీయుడు), జాన్ చాంబర్స్.. పారిశ్రామిక రంగం (విదేశీయుడు)

## పద్మశ్రీలు పొందిన మరికొంత మంది ప్రముఖులు

మనోజ్ బాజ్‌పేయి.. సినీరంగం, శివమణి.. సంగీతం (డ్రమ్మర్), ప్రభుదేవా.. సినీరంగం, గౌతం గంభీర్.. క్రీడలు, అజయ్ ఠాకూర్.. కబడ్డీ, శంకర్ మహదేవన్.. సంగీతం

## 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని డిమాండ్ చేశాయి. మైనింగ్ ప్రాంతాల్లో గిరిజనుల జీవనోపాధికి హామీ ఇవ్వాలని, వారిని ఆప్రాంతాల నుంచి తరలించాలంటే తగిన పరిహారం అందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశాయి. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశాయి. జనసేనతో కలిసి రానున్న ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి సీపీఐ(ఎం), సీపీఐ అంగీకరించాయి. అయితే, తెలంగాణలో జనసేనతో కలిసి పోటీకి సీపీఐ(ఎం) అంగీకరించగా, సీపీఐ తమ నిర్ణయాన్ని వెల్లడించేందుకు మరికొంత సమయం అవసరమని తెలి పింది. దేశంలో మత సామరస్యం, మానవ హక్కుల కోసం పాటు పడటం తమ నైతిక బాధ్యత అని మూడు పార్టీలు స్పష్టం చేశాయి.

**ఈవీఎంలపై అనుమానాలు తొలగించాలి : పవన్**

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ గత రెండేండ్లుగా రాష్ట్రంలో తాము కలిసే పనిచేస్తున్నామని, ఎన్నికల్లో కూడా కలిసే వెళతామని స్పష్టం చేశారు. జనసేన, వామపక్షాల భావజాలం ఒకటే అయినందున ప్రజా పోరాటాలను కూడా కలిసే నిర్వహిస్తామ న్నారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలపై అనుమానాలు నెలకొన్నాయ న్నారు. ఈ అనుమానాలను ఈసీ తొలగించాలన్నారు.

# నిజామాబాద్‌లో కులదురహంకార హత్య?

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి/భీంగల్/కంఠేశ్వర్**

పెద్దింటి కులం అమ్మాయిని ప్రేమించిన ఓ దళిత యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. 'మాట్లాడుకుందాం రా' అంటూ స్నేహితులు తీసుకెళ్లిన అనంతరం ఆ యువకుడు పొలంలో శవమై కనిపించాడు. పోలీసులు ఆత్మహత్యగా ప్రాథమికంగా నిర్ధారించినప్పటికీ.. పథకం ప్రకారమే హత్యచేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే అతన్ని పిలుచుకెళ్లిన స్నేహితులు కూడా ప్రస్తుతం పరారీలో ఉండటంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు పోస్టుమార్టం కూడా ఆలస్యంకావడం తో దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం సికింద్రాపూర్‌లో శుక్రవారం వెలుగుచూసిన ఈ ఘటన కలకలం రేపుతోంది.

మృతుని కుటుంబీకులు, దళిత సంఘాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాల సామాజిక తరగతికి చెందిన సందీప్(28) అదేగ్రామానికి చెందిన మోటాడికాపు అమ్మాయిని ప్రేమించాడు. ఇరువురూ కొన్నేండ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి నిమిత్తం సందీప్ గల్ఫ్ వెళ్లాడు. మొదట్లో ఒకసారి వెళ్లొచ్చాడు. రెండేండ్ల క్రితం మరోసారి గల్ఫ్ వెళ్లి నాలుగు నెలల క్రితమే సికింద్రాపూర్ తిరిగొచ్చాడు. నాటి నుంచి ఆ అమ్మాయితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. బుధవారం ప్రభుత్వ పాఠశాల వద్ద జరుగుతున్న ఆటల పోటీలను చూస్తున్న సందీప్‌ను తన స్నేహితులు చిన్నారెడ్డి, జగదీష్, శేఖర్, రవిలు 'మాట్లాడదాం రా' అంటూ బైక్‌పై ఎక్కించుకుని వెళ్లారు. ఆ సమయంలో సందీప్ అక్క.. 'ఎక్కడికి తీసుకెళ్తున్నారు?' అని ప్రశ్నించింది. 'ఇప్పుడే వస్తాం' అంటూ వారు సమాధానమిచ్చారు. కానీ అదేరోజు రాత్రి పొద్దుపోయినా సందీప్ ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు అతనికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. స్నేహితులకు ఫోన్ చేస్తే 'వస్తాడు' అని చెప్పారు. అయినప్పటికీ రాకపోవడంతో గ్రామ పరిసరాల్లో, పొలాల్లో వెతికారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా కలవలేదు. గురువారం తెల్లవారుజామున సందీప్ మృతదేహం పొలాల పక్కన పడి ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలుసుకున్నారు. ఎస్సై ఎన్నికల విధుల్లో ఉండటంతో ఏఎస్సైని సంఘటనా స్థలానికి పంపించారు. మృతదేహం పక్కనే క్రిమిసంహారక గుళికలు ఉండటంతో ప్రాథమికంగా ఆత్మహత్యగా నిర్ధారించారు. స్నేహితులే తీసుకెళ్లి పథకం ప్రకారం చంపేశారని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం వరకూ పోస్టుమార్టం చేయకపోవడంతో దళిత సంఘాల నాయకులు గ్రామంలో ఆందోళనకు దిగారు. నిందితులను పట్టుకునే వరకూ కదిలేది లేదని భీంగల్‌లో భీష్మించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు చేరుకున్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, అంత్యక్రియలు పూర్తి చేశారు. స్నేహితుల్లో రవికి సంబంధించిన బంధువుల అమ్మాయితో సందీప్ ప్రేమలో ఉన్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు.

## పరారీలో ఎందుకు ఉన్నట్టు?


సందీప్‌ను హత్యచేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. అగ్రకుల అమ్మాయిని ప్రేమించినందుకే సందీప్‌ను ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు హత్య చేశారు. ఒకవేళ హత్య చేసి ఉండకపోతే వారి స్నేహితులు పరారీలో ఎందుకు ఉన్నట్టు?



నాగభూషణం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి

## రెండుమూడు రోజులుగా గొడవలు

రెండుమూడు రోజులుగా చిన్నారెడ్డి, బచ్చుల రవితో సందీప్‌కు గొడవలు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఒకసారి దాడి కూడా చేశారు. చిన్నారెడ్డి స్వయంగా సందీప్‌ను తీసుకువెళ్లడంతో బచ్చుల రవి, జగదీష్ కాపుకాసి అతన్ని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నాం. బుధవారం సందీప్ స్నేహితుల కు ఫోన్ చేస్తే ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పందించారు.



- చిన్న శోభన్, గ్రామస్తుడు

# రెండో విడతలోనూ.. టీఆర్ఎస్ సత్తా

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా రాష్ట్రంలో 3342 సర్పంచ్ పదవులు, వాటి పరిధిలోని 26,191 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్ పదవులకు 10, 668, వార్డు మెంబర్లకు 63,380 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. తొలుత వార్డు సభ్యుల పదవులు, తదుపరి సర్పంచ్ పదవికి వచ్చిన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించారు. ఫలితాల ప్రకటన పూర్తవగానే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. రెండో దశలో మద్దతు తెలిపిన టీఆర్ఎస్ 2548, కాంగ్రెస్ 810, తెలుగుదేశం 37, సీపీఐ(ఎం) 22, సీపీఐ 10. బీజేపీ 35పార్టీలు సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నాయి. తొలి దశతో కలుపుకుని టీఆర్ఎస్ 5177, కాంగ్రెస్ 1730, బీజేపీ 102, సీపీఐ(ఎం) 54, సీపీఐ 29, స్వతంత్రులు 1306 మంది గెలుపొందారు.

**పోలింగ్ ప్రశాంతం : అదనపు డీజీ జితేందర్**

రాష్ట్రంలో శుక్రవారం జరిగిన రెండో విడత గ్రామ పంచాయతీల పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామ పంచాయతీలలో మినహా మెజారిటీ గ్రామాలలో పోలింగ్ సవ్యంగా జరిగినట్టు రాష్ట్రశాంతి భద్రతల విభాగం అదనపు డీజీ జితేందర్ తెలిపారు. ముఖ్యంగా రాజకీయంగా చైతన్యం ఎక్కువగా ఉన్న నల్లగొండ, సూర్యాపేట, మొదలైన జిల్లాల్లో రాజకీయ వైరాల కారణంగా పోలింగ్ సందర్భంగా వైరి పక్షాలు ఘర్షణ పడటం, దాడులు చేసుకోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు.

# ప్రణబ్‌కు భారత రత్న

**న్యూఢిల్లీ :** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని ప్రతిష్టాత్మక భారతరత్న అవార్డు వరించింది. ఆయనతో పాటు ప్రముఖ సంగీత విద్వాంసుడు భుపేన్ హజారికా, ఆర్ఎస్ఎస్ నేత నానాజీ దేశ్‌ముఖ్‌లకూ ఈ అత్యున్నత పురస్కా రాన్ని రాష్ట్రపతి కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. వీరిద్దరి మరణానం తరం ఈ అవార్డులు వరించాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్.. 1935 డిసెంబర్ 11న అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్న మిరాటీ (ప్రస్తుత భిర్భూమ్)లో జన్మించారు.

ఆయన అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి పదవిని చేపట్టారు. 1969లో ప్రత్యక్ష రాజకీయాలలోకి అడుగిడిన ముఖర్జీ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ఇందిరాగాంధీ, పివి నరసింహరావు, మన్మోహన్ మంత్రి వర్గంలో కేంద్రమంత్రిగా పలు శాఖలు నిర్వహించారు. కాంగ్రెస్ కురువృద్ధుడుగా పేరుగాంచిన ఆయన రక్షణ, ఆర్థిక, విదేశాంగ శాఖల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 1986లో రాష్ట్రీయ సమాజ్‌వాదీ కాంగ్రెస్‌ను స్థాపించిన ప్రణబ్.. తదనంతరం దానిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 2012 నుంచి 2017 వరకు భారత రాష్ట్రపతిగా ఆయన సేవలందించారు. రాష్ట్రపతి అంటే రబ్బరు స్టాంపు కాదని చాటారు.

తొలినుంచి కాంగ్రెస్‌వాదిగా పేరొందిన ముఖర్జీ.. ఆరెస్సెస్ గతేడాది నాగ్‌పూర్‌లో నిర్వహించిన సమావేశానికి రావడం అప్పట్లో ప్రకంపనలు సృష్టించింది. ఈ సమావేశం అనంతరం ముఖర్జీ, ఆయన కూతురు శర్మిష్ట బీజేపీలో చేరతారనే ప్రచారం జోరుగా సాగింది. అసోం సంగీత విద్వాంసుడు భుపేన్ హజారికా 1926 సెప్టెంబర్ 8న జన్మించారు. సంగీత రంగంలో అగ్రగామిగా ఎదగడమే కాక గేయ రచయితగా, మానవతావాదిగా పేరు ప్రతిష్టలు గడించారు. ఆయన సేవలకుగానూ సినీ రంగంలో కీలకమైన దాదాసాహేబ్ ఫాల్కే వరించింది. 2001లో ఆయనను భారత ప్రభుత్వం పద్మ భూషణ్‌తో సత్కరించింది. భుపేన్ 2011లో తుదిశ్వాస విడిచారు. కాగా.. 2012లో ఆయనకు కేంద్రం.. పద్మ విభూషణ్ అవార్డును ప్రకటించింది. భుపేన్ ఒకసారి లోక్‌సభకు కూడా పోటీ చేశారు. భారతీయ జన సంఘ్ నేతగా ఎదిగిన నానాజీ దేశ్‌ముఖ్.. 1916 అక్టోబర్ 11న మహారాష్ట్రలో జన్మించారు. బిర్లా కాలేజీ(బిట్స్ పిలానీ) కాలేజీలో విద్యనభ్యసిస్తున్న కాలంలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరడంతో పాటు క్రియాశీలకంగా వ్యవహరించారు. దేశ్‌ముఖ్ మహారాష్ట్రలో జన్మించినప్పటికీ ఎక్కువ కాలం ఉత్తరప్రదేశ్‌లోనే గడిపారు. 1999లో కేంద్రంలో ఎన్‌డీయే ప్రభుత్వం ఉన్న సమయంలో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఆయనను భారత ప్రభుత్వం 1999 పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. నానాజీ దేశ్‌ముఖ్ 2010 ఫిబ్రవరి 27న కన్ను మూశారు.

**ప్రణబ్ అత్యున్నత రాజనీతిజ్ఞుడు : మోడీ**

భారత రత్న అవార్డు పొందడంపై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. ఆయన నేటికాలపు అత్యున్నత రాజనీతిజ్ఞుడు అని మోడీ అభివర్ణించారు. దశాబ్దాలుగా నిర్విరామంగా సేవ చేసిన ప్రణబ్ ముఖర్జీ దేశ అభివృద్ధిపథంలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. దేశ అత్యున్నత పురస్కారానికి ప్రణబ్, దేశ్‌ముఖ్, హజారికాలు ఎంపికవడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆయన ట్వీట్ చేశారు.

**గర్వంగా ఉంది: రాహుల్**

ప్రణబ్ ముఖర్జీ భారత రత్న పురస్కారానికి ఎంపికవడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదిక సంతోషాన్ని పంచుకున్నారు. ప్రణబ్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

ప్రజా సేవ, దేశ నిర్మాణంలో ఆయన కృషిని గుర్తించి అత్యున్నత పురస్కారంతో గౌరవించడంపై కాంగ్రెస్ పార్టీ గర్వపడుతోందని పేర్కొన్నారు. భూపెన్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్‌లూ ఈ పురస్కారానికి ఎంపికవడంపై సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## 855 మంది పోలీసు అధికారులకు మెడల్స్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది దాదాపు 855 మంది పోలీసులు మెడల్స్ అందుకోనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారికి మెడల్స్‌ను బహుకరిస్తారు. ముగ్గురు అధికారులు రాష్ట్రపతి శౌర్య పతకాలను అందుకోనుండగా, 146 మంది పోలీసు శౌర్య పతకాలు అందుకోనున్నారు.

దాదాపు 74 మంది తామందించిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌ను అందుకోనుండగా, ప్రతిభావంతమైన సేవలు అందించినందుకు గాను 632 మంది మెడల్స్ అందుకోనున్నారు. పోలీసుల సేవలను గుర్తిస్తూ అందించే మెడల్స్‌లో రాష్ట్రపతి శౌర్య పతకం (పిపిఎంజి) అత్యున్నతమైనది కాగా, రెండో అత్యున్నత మెడల్ పోలీసు శౌర్య పతకం (పిఎంజి). ఈ మూడు శౌర్య పతకాలను సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సిబ్బందికి అందిస్తారు.

## దాపరికం

**న్యూఢిల్లీ:** 1953 నుంచి నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఏటా దేశంలో జరిగిన పలు రకాల నేరాల లెక్కల్ని వెల్లడిస్తూ వచ్చింది. ఇందులోనే రైతుల ఆత్మహత్యల వివరాలు కూడా ఉండేవి. చిన్నారులు, మహిళలపై జరిగిన దాడులు, హింస ఎస్సీ,ఎస్టీ, బీసీలపై దాడులు, మానవ అక్రమ రవాణా, అవినీతి, వగైరా వివరాలను ప్రతి ఏటా వెల్లడించేవారు. కానీ, మోడీ ప్రభుత్వం మాత్రం గత రెండేండ్లుగా (2017,2018) ఎన్‌సీఆర్‌బీ రికార్డులను వెల్లడించకుండా తొక్కిపెట్టింది. ఇందులో రైతుల ఆత్మహత్యలు ఎంతో కీలకమై నవి. దేశంలో వ్యవసాయరంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దశలో వాస్తవాలను అంచనా వేయాల్సి ఉంటుంది. సంక్షోభం నుంచి వ్యవసా య రంగాన్ని బయట పడేసేలా తీసుకోవాల్సిన చర్యలపై ఓ విధాన నిర్ణయానికి రావాలంటే ప్రతి వివరమూ ఎంతో కీలకం.

**జర్నలిస్టులపై దాడులు**

గతేడాది డిసెంబర్ 18న జర్నలిస్టులపై దాడులు, నిందితులపై కేసుల నమోదుపై అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఇచ్చిన సమాధానం చూస్తే మోడీ సర్కార్ నిర్లక్ష్యమెలాంటిదో అర్థమవుతుంది. ఐపీసీలోని పలు సెక్షన్ల కింద 2014 నుంచి 2016 వరకు నమోదైన కేసులకు సంబంధించి మాత్రమే ఎన్‌సీఆర్‌బీ రికార్డులున్నాయని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రాలవారీగా ఇచ్చిన ఆ వివరాలను పరిశీలిస్తే చాలా రాష్ట్రాల్లో కేసులే నమోదు కాలేదని అర్థమవుతోంది. 2014లో యూపీలో అత్యధికంగా 63, ఆ తర్వాత బీహార్‌లో 22, మొత్తమ్మీద 114 కేసులు జర్నలిస్టులపై దాడులకు సంబంధించి నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 4 నమోదు కాగా, తెలంగాణలో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2015లో దేశం మొత్తమ్మీద 28, 2016లో 47 కేసులు నమోదయ్యాయి.

ప్రపంచ మీడియా స్వేచ్ఛా సూచీలో రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్ భారత్‌కు ఇచ్చిన ర్యాంక్ 138. అంటే మీడియా స్వేచ్ఛ మన దేశంలో ఏమేరకున్నదో ఈ సూచీలోనే అర్థమవుతోంది. ఆ సంస్థ తన నివేదికలో కర్నాటకలో హత్యకు గురైన గౌరీ లంకేశ్ ఉదంతాన్ని ప్రస్తావించింది. జర్నలిస్టుల భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన విద్వేష దాడికి అది నిదర్శనమని ఆ నివేదిక పేర్కొన్నది.

**నిరుద్యోగుల సంఖ్య**

దేశంలో ఉద్యోగాల కల్పనపై నిటి ఆయోగ్ వైస్ చైర్మన్ నేతృత్వంలో ఓ టాస్క్‌ఫోర్స్‌ను మోడీ సర్కార్ 2017, మే 11న ఏర్పాటు చేసింది. దాంతో, అంతకుముందు ఐదేండ్లకోసారి ఉద్యోగులు, నిరుద్యోగులపై లెక్కలు సేకరించిన నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్ఎస్ఎస్‌వో)ను టాస్క్‌ఫోర్స్ బుట్టదాఖలు చేసింది. ఎన్ఎస్ఎస్‌వో చివరిసారిగా 2014 జూన్‌లో 2011-12 ఏడాదికి సంబంధించిన లెక్కల్ని వెల్లడించింది. మరోవైపు లేబర్ బ్యూరో సర్వే నివేదికల్ని కూడా మోడీ సర్కార్ విడుదల కాకుండా నిలిపివేసింది. ఇటీవలే బిజినెస్ స్టాండర్డ్ ఆ వివరాల్ని బహిర్గతం చేసింది. ఆ నివేదిక ప్రకారం దేశంలో నిరుద్యోగుల సంఖ్య 2013-14లో 3.4శాతం ఉండగా, 2015-16లో 3.7శాతం, 2016-17లో 3.9శాతానికి పెరిగింది. 2016, నవంబర్ 8న పెద్దనోట్ల రద్దు తర్వాత నిరుద్యోగుల సంఖ్య పెరగడాన్ని ఆ నివేదిక స్పష్టం చేయడం వల్లే మోడీ సర్కార్ దానిని దాచి పెట్టిందనేది ఎవరికైనా సులభంగా అర్థమయ్యేదే..

**ఓబీసీ జనాభా వివరాలు**

దేశంలో మొదటిసారి బ్రిటీష్ పాలనా కాలంలో కులగణన 1931 లో జరిగింది. అప్పటి లెక్కల ప్రకారం దేశంలోని ఓబీసీల సంఖ్య 52 శాతం. ఆ తర్వాత స్వతంత్ర భారత్‌లో మొదటి కుల గణన 2011లో జరిగింది. అయితే, గత యూపీఏగానీ, ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వంగానీ ఆ వివరాల్ని బహిర్గతం చేయడానికి వెనకాడటం గమనార్హం. ఈ నెలలో పార్లమెంట్‌లో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా మోడీ సర్కార్ ఇచ్చిన సమాధానమేమంటే తమ దగ్గర ఓబీసీల అధికారిక లెక్కలు లేవని.. అధికారిక లెక్కలు వెల్లడిస్తే అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని ఓబీసీలు డిమాండ్ చేస్తారన్న భయం మోడీ సర్కార్‌ను వెంటాడుతోంది. **నల్లధనం :** 2014 ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు మోడీ ఇచ్చిన హామీ ఏమంటే మన దేశంలోని కుబేరులు విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తానని. అంతేకాదు, ఆ నల్లధనమంతా తెచ్చి ఒక్కో పౌరుడి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తానంటూ ప్రధాని మోడీ ఊదరగొట్టారు. ఆ తర్వాత పెద్ద నోట్ల రద్దు సమయంలోనూ నల్లధనాన్ని వెలికి తీసేందుకే అంటూ బీరాలు పలికారు. కానీ, నల్లధనం దేశంలోకి రాకపోగా బ్యాంకులకు వేలకోట్లు ఎగవేసిన విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీలాంటివారు విదేశాలకు పారిపోయి ప్రధాని మోడీని వెక్కిరిస్తున్న దుస్థితి. దేశంలోపల, విదేశాల్లో ఎంత నల్లధనం ఉందో కేంద్ర ఆర్థికశాఖకు కూడా అంచనాకు అందని లెక్కని పార్లమెంట్ సాక్షిగా గతేడాది ఫిబ్రవరిలో సదరు మంత్రిగారే సెలవిచ్చారు.

## విద్యుత్ శాఖలో 6నెలలపాటు సమ్మె నిషేధం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

విద్యుత్ శాఖలో 6నెలల పాటు సమ్మెను నిషేధిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సమ్మెను నిషేధిస్తూ జీఓ నెంబర్ 43ను వెలువరించారు. ఈ నిషేధం ఈ నెల 27నుంచి ఆరు నెలలపాటు అమలులో ఉంటుందని జీవోలో పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▼169 36,025 | నిఫ్టీ ▼69 10,780 | డాలరుకు రూపాయి విలువ 71.19




బంగారం(10గ్రా) రూ. 32,155



వెండి (కేజీ) రూ. 39,050



| కోడిగుడ్లు (వందకి) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 418 | విజయవాడ | 423 |
| ఒక్కగుడ్డుకు | 4.70 | చెన్నై | 455 |
| వరంగల్ | 420 | ముంబయి | 473 |



## ఎయిరిండియా రిపబ్లిక్ డే బొనాంజా



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా రిపబ్లిక్ డేను పురస్కరించుకొని చౌకగా విమాన ప్రయాణం అందించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఏడాది సెప్టెంబరు 30వ తేదీలోగా ప్రయాణాల కోసం జనవరి 26 నుంచి 28వ తేదీ వరకూ ఈ రాయితీ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. ఈ సమయంలో భారీ తగ్గింపును పొందవచ్చని ఎయిరిండియా ప్రతినిధి పేర్కొన్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా నడిచే విమాన టికెట్లను ఈ మూడు రోజుల్లో తక్కువ ధరలకు విక్రయించనున్నామని పేర్కొన్నారు. దేశీయంగా నడిచే విమానంలో ఒకవైపు ప్రయాణానికి కనిష్ఠంగా అన్ని ఛార్జీలు కలిసి ఎకనామిక్ క్లాస్‌లో రూ.979 నుంచి బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ.6,965 వరకూ నిర్ణయించామన్నారు. అంతర్జాతీయంగా ఎకానమీ క్లాస్‌లో రూ.55,000కే అమెరికా ప్రయాణం కోసం టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. బ్రిటన్, యూరప్ దేశాలకు రూ.32వేలు, ఆస్ట్రేలియాకు ఎకానమీ క్లాస్‌లో రూ.50,000కే ప్రయాణం చేయొచ్చన్నారు. రూ.11 వేలకే దక్షిణాసియా దేశాలకు ప్రయాణం అందిస్తున్నామన్నారు. తొలుత వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఆధారంగా టికెట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.

## బీఎస్ఎన్ఎల్ గణతంత్ర దినోత్సవ ఆఫర్

**ముంబయి :** ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీ బిఎస్ఎన్ఎల్ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ప్రీపెయిడ్ ఖాతాదారుల కోసం ఎస్‌టివి-269 పేరుతో కొత్త ప్యాక్‌ను ఆవిష్కరించింది. 70వ రిపబ్లిక్ డే సందర్భంగా వినియోగదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ ఆఫర్‌ను ప్రకటించారు. 26 రోజుల ఈ ప్లాన్‌లో ఏ నెట్‌వర్క్‌కు అయినా 2600 నిమిషాల టాక్‌టైం, 260 మెసేజ్‌లు, 2.6 జిబి డేటాను అందిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ తెలిపింది. అన్ని సర్కిళ్లలో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

## 50% డిస్కౌంట్‌కే టిక్కెట్లు: జెట్ఎయిర్‌వేస్



**న్యూఢిల్లీ:** భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెట్ ఎయిర్‌వేస్ విమానయానంపై ప్రత్యేక డిస్కౌంట్ ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లను సగం ధరకే విక్రయించనున్నట్లు శుక్రవారం పేర్కొంది. జనవరి 30 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రీమియం, ఎకానమీ క్లాసుల్లో ఇరువైపుల ప్రయాణానికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఫిబ్రవరి 8 తర్వాత ప్రయాణాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. మస్కట్, షార్జా తప్ప గల్ఫ్‌లోని అన్ని దేశాలతోపాటు బ్యాంకాక్, సింగపూర్, హాంకాంగ్, ఖట్మాండు, కొలంబో, ఢాకా వెళ్లే ప్రయాణికులకు ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని పేర్కొంది.

# మరిన్ని సంస్కరణలు తేవాలి..

## కొన్నేండ్ల వరకు 7-7.5% మధ్యే వృద్ధి

- ఆర్థిక స్థిరీకరణ నుంచి విచలనం వద్దు: పీఎం ఆర్థిక వ్యవహారాల సలహా మండలి



**న్యూఢిల్లీ:** దేశంలోని ఆర్థిక వ్యవస్థ వృద్ధిపథంలో ముందుకు సాగాలంటే సర్కారు సంస్కరణల పర్వాన్ని ముందుకు తీసుకుపోవాల్సిందేనని ప్రధాన మంత్రి ఆర్థిక వ్యవహారాల సలహా మండలి (ఈఏసీ-పీఎం) సూచించింది. ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక సమస్యలను సంస్కరణల ద్వారా అధిగమించడం ద్వారా ఇప్పుడున్న వృద్ధిరేటుకు అదనంగా మరోక శాతం వృద్ధిని సులువుగా జోడించవచ్చని ఈఏసీ-పీఎం అభిప్రాయపడింది. స్థానికంగా శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన ఈఏసీ-పీఎం సమావేశం దేశ ఆర్థిక పరిస్థితిని మండలి క్షుణ్ణంగా విశ్లేషించింది. రానున్న కొన్ని సంవత్సరాల పాటు దేశం వృద్ధి రేటు 7 -7.5 మధ్య నిలిచే అవకాశం ఉందని అభిప్రాయపడింది. కేంద్ర గణాంకాల కార్యాలయం ఇటీవల వెల్లడించిన 7.2 శాతం వృద్ధి గణాంకాలకు ఇది చాలా దగ్గరగా ఉండడం విశేషం. ప్రభుత్వం నిర్ధేశించుకున్న ఆర్థిక స్థిరీకరణ లక్ష్యం నుంచి పక్కకు తప్పుకుంటూ విచనాన్ని పాటించడం మంచిది కాదని మండలి తెలిపింది. అయితే ఇదే సమయంలో సామాజిక రంగ మార్పునకు కట్టుబడి పని చేయాల్సి ఉంటుందని మండలి వివరించింది. దేశ ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని మండలి పునరుద్ఘాటించింది. ఇదే సమయంలో కొన్ని సవాళ్లు కూడా పొంచి ఉన్నాయని తెలిపింది. ఇవి నిర్మాణాత్మక రూపంలో ఉన్నట్టుగా కౌన్సిల్ ప్రధానికి తెలిపింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి అంత ఆశాజనకంగా లేదని.. మరీ ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో మరింత క్లిషంగా ఉందని ప్యానెల్ తెలిపింది. అయితే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో వృద్ధి తీరు పర్వాలేదని తెలిపింది. అయితే అంతర్జాతీయ పరిణామాలను నుంచి తటుకొనేలా భారత ఆర్థిక వ్యవస్థకు ప్రత్యేక కవచమంటూ లేదని ఈ నేపథ్యంలో రానున్న కొన్ని సంవత్సరాల పాటు దేశ వృద్ధి 7-7.5 శాతం మధ్య నమోదు అయ్యే అవకాశం ఉందని ప్యానెల్ తెలిపింది. దేశంలోని పెట్టుబడుల తీరు, ఆర్థిక స్థిరీకరణ, వడ్డీరేట్ల నిర్వహణ, రుణ, ఆర్థిక మార్కెట్లలోని సమస్యలను ప్యానెల్ ప్రధానంగా చర్చించింది. ఆర్బీఐ విదేశీ మారకపు నిల్వల విధానాన్ని మండలి ప్రశంసించింది. దేశంలో ఆర్థిక పొదుపు పెరుగుతోందని.. ప్రయివేటు బ్యాంకులు సేవల రంగానికి విరివిగా రుణాలను మంజూరు చేస్తున్నాయని సలహ మండలి తెలిపింది. ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు తోడుగా మరిన్ని సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని కమిటీ ప్రతిపాదించింది.

## సాగు మందుల తయారీలోకి నాట్కో

**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** నాట్కో ఫార్మా వ్యవసాయ మందుల తయారీ విభాగంలోకి అడుగు పెట్టింది. ఈ విషయాన్ని సంస్థ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. సముచిత వ్యవసాయ మందుల తయారీ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ప్లాంటు ఏర్పాటు పనులను ప్రారంభించినట్టుగా కంపెనీ తెలిపింది. ఇప్పటి వరకు క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులకు జెనరిక్ మందుల తయారీలో నాట్కో సంస్థ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకొని ముందుకు సాగుతోంది. సంస్థను బహుముఖంగా విస్తరించాలన్న వ్యూహంలో భాగంగానే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. అంతర్జాతీయ వ్యవసాయ మందుల తయారీ దిగ్గజాలైన బాయర్, నోవార్టీస్ సంస్థలు కూడా 90వ దశకం వరకు కూడా మొక్కల సంరక్షణ మందులతో పాటుగా మెడిసన్స్‌ను కూడా తయారు చేసిన సంగతి తెలిసిందే. ఇదే మాదిరిగా నాట్కో కూడా ఇప్పుడు రెండు విభాగాల్లోనూ తమ సత్తా చాటాలని నిర్ణయించుకున్నట్టుగా సమాచారం. ఈ ఏడాది ముగింపు నాటికి నెల్లూరులో ఏర్పాటు చేస్తున్న ప్లాంటు నుంచి ఉత్పత్తి మొదలవగలదని తాము భావిస్తున్నామని కంపెనీ వివరించింది. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో ఈ ప్లాంటు పనులను చేపడుతున్నట్టుగా సంస్థ వివరించింది. అయితే కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్ ద్వారా తయారు చేసే వ్యవసాయ మందులను ఎలా మార్కెట్లోకి అందుబాటులోకి తేనున్నామన్న విషయాన్ని కంపెనీ వెల్లడించలేదే. దేశయ మార్కెట్‌కే వీటి విక్రయాలు పరిమితం అవుతాయా.. లేక అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరిస్తారా అన్న విషయాన్ని కంపెనీ తెలపలేదు. ఇందుకు అంతర్జాతీయ సంస్థలతో చేతులు కలిపి మందుకు సాగుతారా అన్న విషయంపై కూడా కంపెనీ యాజమాన్యం స్పష్టతనివ్వడం లేదు.


## చతికిలపడిన మారుతీ సుజుకీ



**న్యూఢిలీ:** దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి నిరుత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో సంస్థ లాభం 17.21 శాతం పతనమై రూ.1,489.30 కోట్లకు చేరాయి. దీంతో సంస్థ వరుసగా రెండో త్రైమాసికంలోనూ ప్రతికూల ఫలితాలను నమోదు చేసినట్టయింది. అంతకు ముందు ఏడాది (2017-18) డిసెంబరు త్రైమాసికంలో సంస్థ రూ.1,800 కోట్ల లాభాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం కంపెనీ అమ్మకాలు 0.10 శాతం తగ్గి రూ.18,926.40 కోట్లకు పడిపోయాయని మారుతీ తెలిపింది. క్రితం మూడు త్రైమాసికాల నుంచి కూడా ఈ కంపెనీ అమ్మకాల్లో పెద్ద పురోగతి లేకపోగా.. దాదాపు యథాతథంగానే నమోదవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు బాగోలేకపోవడమే లాభాలు తగ్గడానికి ప్రధాన కారణమని సంస్థ పేర్కొంది. కాగా 2014 మార్చి త్రైమాసికం ఫలితాల తర్వాత అత్యంత పేలవమైన ఆర్థిక ఫలితాలు డిసెంబర్ త్రైమాసికంలో నమోదు కావడం విశేషం. పేవలమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించన నేపథ్యంలో శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో ఆ సూచీ తీవ్ర ఒత్తిడికి గురైంది. బీఎస్ఈలో మారుతీ సుజుకీ షేర్ 7.40 శాతం పతనమై రూ.6,516.35కి పడిపోయింది.

# ఎగిసి పడిన స్టాక్ మార్కెట్లు

## అమ్మకాల ఒత్తిడితో కుంగిన ప్రధాన సూచీలు



**ముంబయి:** దేశీయ మార్కెట్లు వారాంతాన నష్టాలలో ముగిశాయి. మీడియా, ఆటోమొబైల్ రంగ షేర్లలో అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఆరంభంలో జోరు మీదున్న సూచీలు క్రమంగా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. వివిధ కంపెనీల ప్రోత్సాహకర త్రైమాసిక ఫలితాలు, కొనుగోళ్ల అండతో శుక్రవారం ఉదయం దేశీయ స్టాక్ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆరంభంలో సెన్సెక్స్ 250 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైన కదలాడింది. యెస్ బ్యాంక్, రిలయన్స్ లాంటి షేర్లు రాణించడంతో తొలి సెషన్‌లో సూచీలు జోరుగా సాగాయి. అయితే ఆ తర్వాత మారుతీ సుజుకీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వంటి భారీ షేర్ల కౌంటర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్‌పై ప్రభావాన్ని చూపింది. దీంతో ఒత్తిడికి గురైన సూచీలు మెల్లగా లాభాలను కోల్పోయి నష్టాల్లోకి జారుకున్నాయి. ఫలితంగా శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 169 పాయింట్లు దిగజారి 36,025 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 69 పాయింట్ల నష్టంతో 10,780 పాయింట్ల వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.19గా కొనసాగింది ఎన్ఎస్ఈలో భారతీ ఇన్‌ఫ్రాటెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యస్ బ్యాంక్, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా లాభపడ్డాయి. జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఈ కంపెనీ షేరు ధర దాదాపు 31 శాతం నష్టపోయింది. మారుతీ సుజుకీ షేర్లు కూడా 8శాతం పతనమయ్యాయి. హీరో మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు కుదేలయ్యాయి. అల్ట్రాటెక్ షేర్లు కూడా 6శాతానికి పైగా పతనమవ్వడం విశేషం. వెనెజులా సంక్షోభం ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేసింది. ఈ ప్రభావం మన దేశీయ మార్కెట్లపై కూడా ప్రతిబింబించింది. ఈ నేపథ్యంలో బీఎస్‌బీ మిడ్‌క్యాప్ సూచీల 1.20%, స్మాల్ క్యాప్ సూచీ 1.58% మేర కుంగాయి. మార్కెట్ విస్తృతి ఆరోగ్యకరంగా కనిపించింది. బీఎస్ఈలో 698 షేర్లు లాభాల్లో నడవగా.. 1854 స్టాక్స్ నష్టాలలో కదలాడాయి.

## 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న నవతెలంగాణ ఎడిటర్ ఎస్. వీరయ్య

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సివిల్స్ ఫ్యాకల్టీ లక్ష్మణ్‌గౌడ్ వట్టికూటి రచించిన 'భారత రాజ్యాంగం' పుస్తకాన్ని నవతెలంగాణ ఎడిటర్ ఎస్.వీరయ్య శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ఎంహెచ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఇంగ్లీష్ మీడియంలోని ప్రామాణిక పుస్తకాలైన డీడీ బాబు, పీఎం భక్షి, సుభాష్ కశ్యప్, గెజెట్స్, పీఐబీ న్యూస్, ఇతర లా బుక్స్‌లను అధ్యయనం చేసి ఏపీపీఎస్సీ, టీఎస్ పీఎస్సీకి సిద్ధమయ్యే తెలుగు మీడియం అభ్యర్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ హైదరాబాద్ ఎడిషన్ మేనేజర్ రాంపంగు శ్రీనివాస్ (వాసు), తండు అంజయ్య, మామిడి శ్రీనివాస్, కొప్పు నిరంజన్, సిహెచ్.రమేశ్, రచయితలు కదిరే అజయ్, మల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, జి.అశోక్, జి.రఘు, సాత్విక్, దాసరి కుమార్ పాల్గొన్నారు.

## బీడీఎల్‌లో అకౌస్టిక్ ట్యాంక్ పరీక్ష సౌకర్యం

- ప్రారంభించిన రక్షణ శాఖ కార్యదర్శి అజేయ్ కుమార్

**హైదరాబాద్:** భారత డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) విశాఖపట్టణం యూని ట్‌లో అకౌస్టిక్ ట్యాంక్ పరీక్ష సౌకర్యాన్ని రక్షణశాఖ (ఉత్పత్తుల) కార్యదర్శి డా. అజేయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జలాంతర్గాములను అందుబాటులో తేవడానికి ముందు వాటి అకౌస్టిక్ సిస్టమ్స్ సామర్థ్యాన్ని పరీక్షించాల్సి ఉంటుదన్నారు. టార్పిడోలు, మైన్స్, డెకాయిస్ వంటి జలాంతర్గాములను పరీక్షించడానికి ఈ సౌకర్యం ఉపయోగపడుతుందని తెలిపారు. దీని వల్ల తయారీ సామర్థ్యం అనేక రెట్లు పెరుగుతుందన్నారు. అంతేకాకుండా అనేక ప్రాజెక్టులను ఏక కాలంలో నిర్వహించడానికి అవకాశం కలుగుతుందని వెల్లడించారు. అనంతరం యూనిట్‌లోని తయారీ విభాగాలను ఆయన పరిశీలించారు.

## తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మడం లేదు

- ఎంపీ బూర నర్సయ్యగౌడ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలే చక్రం తిప్పుతాయని టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. హడావుడిగా ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ల కోటా తీసుకురావడం వల్ల లాభం లేదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఏపీకి ఇచ్చిన నిధుల్లో సగం కూడా తెలంగాణకు ఇవ్వలేదని, అందుకే తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మడం లేదన్నారు. మోడీ పెద్ద నోట్లు రద్దు చేసి సామాన్యుల్ని ఇబ్బంది పెట్టారని విమర్శించారు. ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా ముందుకెళ్తున్న పార్టీలకు, 100 నుంచి 150 సీట్లు వస్తాయన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మడంలేదని, ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. మొన్నటి వరకు మమ్మల్ని నిందించిన చంద్రబాబు, ఏపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవటం లేదని విమర్శించారు. ఓటు గొప్పదన్నారు.

ఈవీఎంలపై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తున్నదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ హవా కొనసాగుతున్నదన్నారు. ఇప్పుడు ఫెడరల్ ఫ్రంట్ పట్ల ఆయా పార్టీలు తమ వైఖరిని సమీక్షించుకుంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో గత కలిసి పోటీచేసిన కాంగ్రెస్, టీడీపీలు, ఏపీలో వేర్వేరుగా బరిలోకి దిగుతున్నాయని గుర్తు చేశారు.

# ఎఫ్‌డీఐలతో దేశభద్రతకు ప్రమాదం

## కాంట్రాక్టులు కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం:

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

- హైదరాబాద్‌లో మానవహారం

### వ్యూహాత్మకంగానే ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం



మాట్లాడుతున్న నాగేశ్వర్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రక్షణ రంగంలోకి ఎఫ్‌డీఐలను ఆహ్వానించడం అంటే దేశ భద్రతకే ప్రమాదకరమని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తాలో మానవహారాన్ని శుక్రవారం నిర్వహించారు. 'సేవ్ డిఫెన్స్ సెక్టార్..సేవ్ డిఫెన్స్ సెక్టార్', 'రక్షణ రంగంలోకి ఎఫ్‌డీఐలను వ్యతిరేకిద్దాం..వ్యతిరేకిద్దాం', 'కార్మిక సంఘాల ఐక్యత వర్ధిల్లాలి', 'మోడీని దించుదాం...దేశాన్ని రక్షించుకుందాం' అంటూ పెద్దపెట్టున నినదించారు. మానవహారాన్ని ఉద్దేశించి కె.నాగేశ్వర్ మాట్లాడుతూ.. యుద్ధవిమానాలు, జలాంతర్గాములు, ఆర్మీ సిబ్బంది పరికరాలు, రక్షణ రంగ సామాగ్రి తయారీలను ప్రయివేటు కంపెనీలకు అప్పగించడం దారుణమన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో ఒప్పందం చేసుకున్న ప్రయివేటు కంపెనీలు సహకరించడానికి నిరాకరిస్తే ప్రభుత్వ రంగ సంస్థలు ఆదుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలోని రక్షణ సామాగ్రి తయారీ సంస్థలను కేంద్రం కావాలనే కాంట్రాక్టులు, నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తున్నదని, అదే సందర్భంలో విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాలయను కట్టబెడుతున్నదని విమర్శించారు. మోడీ అనాలోచిత నిర్ణయాల వల్ల దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు ప్రమాదం పొంచి ఉందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు మాట్లాడుతూ.. రక్షణకు సంబంధించిన మనం స్వావలంబన సాధించామని,273 రక్షణ ఉత్పత్తులను మనమే సొంతంగా తయారు చేసుకుంటామని చెప్పారు. నాలుగేండ్లుగా మోడీ సర్కారు ఆ ఉత్పత్తుల తయారీని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నదన్నారు. దేశభక్తి, జాతీయత ముసుగు కప్పుకుని దేశ రక్షణను సామ్రాజ్యవాదుల చేతుల్లో పెట్టేందుకు యత్నించడం దారుణమని విమర్శించారు. దేశ రక్షణ కోసం సమ్మె చేస్తున్న రక్షణ రంగ ఉద్యోగుల సమ్మెకు నిజమైన దేశభక్తులుగా మద్దతు తెలుపుతున్నామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ..నాలుగున్నర లక్షలకుపైగా రక్షణ రంగ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారన్నారు. ఢిల్లీలో సమ్మెచేసినా, మూడు రోజుల నుంచి దేశవ్యాప్త సమ్మె చేసినా మోడీ సర్కారు పట్టించుకోవట్లేదన్నారు. రక్షణ రంగాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి.వెంకట్ మాట్లాడుతూ..కార్మిక రంగం చేస్తున్న రైతులు, కూలీలు, కార్మికులు సంఘీభావం తెలుపుతున్నారన్నారు. కార్మిక, కర్షక, ఇతర రంగాల వారంతా ఒక్కటై పోరాడితేనే మోడీ అనుసరిస్తున్న దేశ వ్యతిరేక విధానాలను తిప్పిగొట్టగలమన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు మాట్లాడుతూ..అన్ని రంగాల కార్మికులు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేయడం అభినందనీయమన్నారు. సీజీ కాన్ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు టి.నరసింహం...ఆర్థిక డిమాండ్లను పక్కనబెట్టి దేశ రక్షణ కోసం రక్షణ రంగ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ...భారతమాత జపం చేసే బీజేపీ దేశాన్ని తెగనమ్ముకునే కుట్ర చేస్తున్నదని విమర్శించారు. దేశభక్తి కార్మికులకే ఉందని, మోడీకి, బీజేపీకి లేదని ఈ సమ్మె రుజువుచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అనురాధ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ, శ్రామిక మహిళా నాయకులు కె.నాగలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పి.రాజారావు, పాలడుగు భాస్కర్(మున్సిపల్), జె.వెంకటేష్(కాంట్రాక్ట్ ఫెడరేషన్), పి.జయలక్ష్మి(అంగన్‌వాడీ), కె.మల్లిఖార్జున్(సీఐటీయూ), ఎంఎన్‌రెడ్డి, నరహరి(పెన్షనర్స్), బి.ప్రసాద్(వ్యవసాయ కార్మిక సంఘం), కోట రమేష్(ఎస్ఎఫ్ఐ), స్కైలాబ్‌బాబు, కురుమూర్తి(కేవీపీఎస్), నాగేశ్వర్‌రావు(మెడికల్ రిప్స్), ఎస్ఎస్ఆర్ ఎ ప్రసాద్(పోస్టల్), కెవిఎస్ఎన్ రాజు, వై.సుబ్బారావు(ఇన్సూరెన్స్), అరుణజ్యోతి, నాగలక్ష్మి(ఐద్వా), ఎస్ఎల్ పద్మ(ఐఎఫ్‌టీయూ), శ్రీకాంత్(ఏఐవైఎఫ్), పి.సుధాకర్, కె.రమేష్, విఠల్, ఆర్.వాణి, కుమార్ (సీఐటీయూ), నర్సింహ(ఏఐటీయూసీ), జావెద్(ఎస్ఎఫ్ఐ), తదితరులు పాల్గొన్నారు.

# విమర్శలపై స్పందించను

## ఈవీఎంల వివాదంపై సీఈఓ రజత్‌కుమార్

- అపోహలు అవాస్తవమని వ్యాఖ్య



మాట్లాడుతున్న రజత్‌కుమార్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ముందస్తు ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందనడం పూర్తిగా అవాస్తవమని, దీనిపై ఇక వివాదం అనవసరమని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఐ రజత్‌కుమార్ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఈవీఎంల పనితీరుపై వస్తున్న అపోహలు అవాస్తవమని తోసిపుచ్చారు. గతంలో ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కొన్ని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయని కోర్టు ఈవీఎంల పనితీరును పరిశీలించాక అపోహలు అవాస్తవమని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. శుక్రవారం రవీంద్రభారతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ఎవరైనా ఆధారాలతో నిరూపిస్తామంటూ ఎవరైనా ముందుకు వస్తే వారిని స్వాగతిస్తామని చెప్పారు. 1982 నుంచి ఈవీఎంలు వాడుతున్నామని, చాలా సార్లు ఈవీఎంల పనితీరును నిరూపించామని తెలిపారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా స్పష్టం చేసిందన్నారు.

**కాంగ్రెస్ విమర్శలపై నో కామెంట్**

ఈవీఎంలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలపై తాను స్పందించనని సీఈఓ అన్నారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లో కోర్టులో పిటిషన్ వేసుకోవచ్చని తెలిపారు. తాను రాజకీయ పార్టీలను ఉద్దేశించి చెప్పడం లేదని, అనుమానాలు వ్యక్తం చేసే వారికి మాత్రమే సూచిస్తున్నానని వివరించారు. ముందస్తు ఎన్నికల్లో 16లక్షల అభ్యంతరాలు వచ్చాయని, ఎన్నికలకు ముందే హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

**ఓపీ రావత్ ఓటుపై ఈసీఐ సీరియస్**

తెలంగాణలో ఓపీ రావత్‌కు ఓటు ఉందంటూ వచ్చిన ఆరోపణలపై కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుందని తెలిపారు. దీనిపై విచారిస్తున్నామని, బాధ్యులపై కేసు నమోదు చేస్తామని రజత్‌కుమార్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈవీఎంలనే వాడతామని చెప్పారు.

**ఖర్చులు చూపక పోతే చర్యలు**

శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్య ర్థులు ప్రచారానికి చేసిన ఖర్చులు చూపకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖర్చుల వివరాలకు సంబంధించి ఈ నెల 26తో గడువు ముగియనుందని చెప్పారు. 72 మంది అభ్యర్థులు ఖర్చుల వివరాలు వెల్లడించలేదని తెలిపారు. అదేవిధంగా గ్రాడ్యుయేషన్ ఎన్నికల ఏర్పాట్లు కూడా చేస్తున్నామని సీఈఓ వెల్లడించారు.

## కలపరవాణా, జంతువుల వేటపై ఉక్కుపాదం

- వన్యప్రాణుల వేట నివారణకు చర్యలు : పీసీసీఎఫ్ పీకే

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

అడవులు, అటవీ సంపద కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని పీసీసీఎఫ్ పీ.కే.ఝా అన్నారు. హైదరాబాద్‌లో స్టేట్ ఫారెస్ట్ సర్వీస్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, జూనియర్ ఫారెస్ట్ అధికారులు, తెలంగాణ ఎన్జీవో సంఘాలతో పీసీసీఎఫ్, ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఆదేశాలను ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. ఈ సందర్భంగా పీ.కే.ఝా మాట్లాడుతూ.. వన్యప్రాణులు, అటవీ సంపద రక్షణకు అటవీ అధికారులు, సిబ్బంది మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణం కాపాడటం ద్వారా రాష్ట్ర ప్రజలకు మెరుగైన జీవనం ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పానికి అటవీ శాఖ పనితీరే కొలమానం అవుతుందని అన్నారు. సీఎం ఆదేశాల తర్వాత జరుగుతున్న దాడుల్లో అనేక అటవీ నేరాలు వెలుగులోకి వస్తున్నాయని, కొన్ని చోట్ల సిబ్బంది ప్రమేయం కూడా ఉండటం అత్యంత బాధాకరమని అన్నారు. అటవీ నేరాల విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఉద్యోగులతో సహా ఎంతటి వారున్నా ఉపేక్షించబోమని నొక్కి చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఎనిమిది మంది అధికారులు, సిబ్బందిని ఇటీవల సస్పెండ్ చేసిన విషయాన్ని కూడా తెలిపారు. అడవులు, వన్యప్రాణుల రక్షణకు అటవీశాఖ మొదటి ప్రాధాన్యత అని, ఆతర్వాత క్షీణించిన అడవుల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని సూచించారు. కలప అక్రమ నరికివేత, స్మగ్లింగ్, జంతువుల వేట, అటవీ భూముల ఆక్రమణల విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో సమస్యలుంటే, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల రెండు పులులు చనిపోవటం, వాటి చర్మాలు స్వాధీనం చేసుకోవటంపై కూడా సమావేశంలో చర్చించారు. అన్ని అటవీ ప్రాంతాల్లో విజిలెన్స్‌ను మరింత పటిష్టం చేయాలని, నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయటంతో పాటు, పోలీసుల సహకారం కూడా తీసుకుని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని అటవీ ఉద్యోగ సంఘాలకు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్ పృథ్వీరాజ్, రఘువీర్, అదనపు పీసీసీఎఫ్ మునీంద్ర, శోభ, లోకేష్ జైస్వాల్, ఆర్.ఎం.డోబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, అన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




చాలామంది మొబైల్స్ వాడుతున్నప్పటికీ అందులో ఉన్న ఫీచర్స్ తెలుసుకోలేరు. ఫోన్లో ఉండే ప్రతి ఫీచర్ గురించి తెలుసుకోవడం కాస్త కష్టమే. ఏది ఒకే చేస్తే ఏమౌతుందో అనే భయం కొందరిలో ఉంటుంది. అయితే కొన్ని ఫీచర్స్ మాత్రం మన రోజువారి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయి. అలాంటి కొన్ని ఫీచర్ల గురించే ఈ వారం టెక్‌ప్లెస్‌లో మీకు పరిచయం చేస్తున్నాం...



# మళ్ళీ మళ్ళీ చూసుకునేలా...

మళ్లీ మళ్లీ గుర్తు చేసుకునేలా ఏదైనా మ్యాటర్ రాసి మొబైల్ లో పెట్టుకుంటే బాగుండు అని చాలా సార్లు అనుకుంటూ ఉంటాం. మన రోజువారీ దినచర్యలో ఎన్నో ఆలోచనలు వస్తుంటాయి. వాటిని మరుసటి రోజుకి మర్చిపోతుంటాం. అంతేకాదు ఒక్కొక్కసారి మనం చేయాల్సిన పనులను గుర్తుపెట్టుకునే బాధ లేకుండా ఒక జాబితా తయారుచేసుకోవాలి అనుకుంటాం. కానీ వాటన్నింటినీ గుర్తు పెట్టుకోవడం కష్టమవుతుంటుంది. చాలాసార్లు మరచిపోతుంటాం కూడా. కానీ ఇప్పుడు వస్తున్న అన్ని ఆండ్రాయిడ్ మొబైల్స్ లో ఈ ఫీచర్ కచ్చితంగా ఉంటుంది. అవసరం అయినప్పుడు ఆ మ్యాటర్ ను మళ్లీ మళ్లీ ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ఇప్పుడు మనం మొబైల్స్, యాప్స్‌లో ఇంగ్లీష్‌తో పాటు మనకు నచ్చిన ఇతర భాషను కూడా రాసుకునే సౌలభ్యం వుంది.


- ఫిర్దౌస్



## కలర్ నోట్

మొబైల్స్ వాడే వారికి చాలావరకు మెమో, నోట్ లలోని స్పేస్ సరిపోతుంది. కానీ మరికొంతమందికి వేరే పేజ్ లోకి వెళ్ళకుండానే అదే పేజీలో మేటర్‌ను కథలాగా కంటిన్యూ చేయాలని అనుకుంటారు. అటువంటి వారికోసం మరో అద్భుతమైన ఆప్షన్ 'కలర్ నోట్'. ఈ యాప్ లో కథలు, కవితలు... ఏదైనా... ఎంతైనా రాయొచ్చు. సేవ్ చేసుకోవచ్చు. టైప్ చేయడం కష్టం అయిపోయేవారు కలర్ నోట్ ను ఎంపిక చేసుకోవడం మంచి ఆలోచన. ఈ యాప్ లో మన ఆలోచనలను నేరుగా వాయిస్ రూపంలో చెబుతూ ఉంటే అది text రూపంలోకి మార్చుకుంటుంది. నచ్చిన రంగులను ఎంపిక చేసుకునే సౌలభ్యం కూడా ఈ యాప్ లో ఉంది.

ఉదాహరణకు ఒక జోనర్ కు సంబంధించిన మ్యాటర్ ను ఒకే రంగులో కనిపించేలా పెట్టుకోవచ్చు. మరో జోనర్ కు సంబంధించిన మ్యాటర్ కు మరో కలర్ సెట్ చేసి పెట్టుకుంటే చదువుకునేప్పుడు చాలా తేలిక అవుతుంది.





## వన్ నోట్

మైక్రోసాఫ్ట్ సంస్థ రూపొందించిన ఆప్స్ లో ఇది ఒకటి. ఇది ఆల్మోస్ట్ ఒక నోట్ బుక్ లో ఎలా రాసుకో గలమో 'వన్ నోట్' అనే ఫీచర్ లో కూడా అలాగే రాసుకోవచ్చు. ఈ నోట్ లో ప్రైవసీ మెయింటెన్ చేసుకోవచ్చు. పాస్ వర్డ్ ఉపయోగించి మొబైల్ ఎవరి చేతికి వెళ్లినా ఈ నోట్ ఓపెన్ చేయకుండా వ్యక్తిగత విషయాలను డైరీ గా రాసుకునేవారికి చాలా బాగా ఉపయోగపడుతుంది. దాదాపు ఈ ఫీచర్ కూడా మొబైల్ తో పాటే ఇన్స్టాల్ అయి వస్తుంది.

## మెమో...

ఆండ్రాయిడ్ మొబైల్స్ లో 'మెమో' అనే ఫీచర్ ఉంటుంది. మనకు తోచిన ఏ మేటర్ అయినా అందులో టైప్ చేసి సేవ్ చేసుకోవచ్చు. 'టూల్స్' అనే ఫీచర్ లో ఫైల్ మేనేజర్ తో పాటు మెమో అనే ఫీచర్ ఉంటుంది. ఇందులో ఫోటోతో పాటు తో మేటర్ రాయాలనుకునేవారికి ఈ ఫీచర్ చాలా బాగా ఉపయోగపడుతుంది.





## డౌన్లోడ్ ఇలా...

ఏదైనా యాప్ ను download చేసుకునే ఆప్షన్ ప్లే స్టోర్. ప్లే స్టోర్ లోకి వెళ్లి 'నోట్' అని టైప్ చేస్తే చాలు. చాలా రకాల notes అనేక ఫీచర్స్‌తో మనకు కనిపిస్తుంటాయి. మీకు నచ్చిన నోట్ ను ఎంపిక చేసుకోవచ్చు. 'కలర్ నోట్' కూడా అలాంటి ఒక యాప్ లాగా కనిపిస్తూ ఉంటుంది. ఆ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని, దానిని ఓపెన్ చేసి, అవసరమైన సెట్టింగ్స్ కావాలనుకుంటే మార్చుకోవచ్చు. లేదా వాడుకను బట్టి ఫైల్స్ క్రియేట్ చేస్తూ వెళుతుంటే తేలికగానే అర్థమవుతుంది.

# ఫొటోలు క్రియేట్ చేయండి?

**ఫేస్‌బుక్ ఇప్పుడు తన న్యూస్‌ఫీడ్, వర్చువల్ రియాల్టీ (VR) హెడ్‌సెట్స్‌లో 3డి ఫొటోలను సపోర్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి తమ F8 డెవలపర్ కాన్‌నరెన్స్ సందర్భంగా ఈ ప్రకటన చేసినప్పటికీ అది ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. రాబోయే కొద్ది వారాల్లోనే ప్రతి ఒక్కరూ 3డి ఫొటోలను క్రియేట్, షేర్ చేసుకునే అవకాశం లభిస్తుందని తన బ్లాగ్‌స్పాట్ పోస్ట్‌లో తెలిపింది. 'సబ్జెక్ట్, దాని ముందువెనుకల దూరాన్ని బంధించగల సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఫొటో తీసే దృశ్యాలలో డెప్త్, మూవ్‌మెంట్‌లతో జీవం తొణికిసలాడుతుంది' అని అందులో వివరించింది.**

### ఫేస్‌బుక్ 3డి ఫొటో అంటే ఏమిటి?

ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత ఫీచర్... దీని సాయంతో వినియోగదారులు 3డి ఫొటోలను ఐఫోన్, ఇతర స్మార్ట్ ఫోన్లలోని వెనుకభాగపు జంట కెమెరాల పోర్ట్రెయిట్ మోడ్‌ను వాడుకునే న్యూస్‌ఫీడ్, వి.ఆర్. హెడ్‌సెట్స్‌లో పోస్ట్ చేసుకోవచ్చు. ప్రాథమికంగా మీ 2డి ఫొటోలను 3డిలో చూపడానికి ఫేస్‌బుక్ ఈ పోర్ట్రయిట్ మోడ్‌ను వాడుకుంటుంది. ఇందులో భాగంగా ఫొటోలోని సబ్జెక్ట్, దాని ముందువెనుక భాగాల మధ్య డెప్త్ సమాచారాన్ని విశ్లేషిస్తుంది.

### చూడటం ఎలా?

ఫేస్‌బుక్ వాడకందారులు ప్రతి ఒక్కరూ 3డి ఫొటోలను క్రియేట్ చేసుకోవడంతో పాటు తమ న్యూస్‌ఫీడ్‌లో షేర్ చేసుకోవచ్చు. అలాగే ఇలాంటి 3డి ఫొటోలను "Oculus Browser on Oculus Go os Firefox on Oculus Rift" లను వాడుకుంటూ VR లో చూసుకోవచ్చు. ఇక ఫోన్ నుంచి 3డి ఫొటోను చూడాలంటే మీ ఫోన్‌ను స్క్రోల్ లేదా టిల్ట్ చేయడం ద్వారా దాని పర్‌స్పెక్టివ్‌ను మార్చుకోవచ్చు.

### ఫొటోల క్రియేషన్, షేరింగ్...

ఫేస్‌బుక్ 3డి ఫొటోలను వాడుకోవాలంటే మీవద్ద iPhone 7 Plus, iPhone 8 Plus, iPhone XS లేదా iPhone XS Max లలో ఏదో ఒకటి ఉండాలి. అయితే, ఆండ్రాయిడ్ ఫోన్లకు సంబంధించి 3డి ఫొటో ఫీచర్‌ను పొందాలంటే ఆండ్రాయిడ్‌తో పనిచేసే Samsung Galaxy Note 9 లేదా LG V35 లాంటి అత్యాధునిక (వెనుక భాగంలో డ్యుయెల్ కెమెరాగల) స్మార్ట్ ఫోన్లుండాలని "The Verge" తెలిపింది.




### క్రియేట్ చేయండి.. షేర్ చేయండి

ఫేస్‌బుక్‌లో 3డి ఫొటోలను క్రియేట్, షేర్ చేసుకోవాలంటే అధికారిక ఫేస్‌బుక్ యాప్‌ద్వారా కొత్త ఫేస్‌బుక్ పోస్ట్ సృష్టించండి. మరిన్ని ఆప్షన్ల కోసం కుడివైపు కనిపించే మూడు చుక్కల మీద ట్యాప్ చేయండి. తర్వాత కనిపించే మెనూ నుంచి 3D Photo ఆప్షన్‌ను ఎంచుకోండి. ఇప్పుడు ఐఫోన్ పోర్ట్రెయిట్ మోడ్‌తో తీసిన ఫొటోను ఎంచుకోండి. దాని ప్రివ్యూ చూసుకోండి. అంతే... ఇక మీ ఫేస్‌బుక్ 3డి ఫొటో క్రియేట్ చేయడానికి అంతా సిద్ధమైనట్టే. ఇక మీరు తెలుసుకోవాల్సిన రెండు ముఖ్యమైన విషయాలేమింటే... ఉత్తమ ఫలితాల కోసం మీరు ఫోన్‌లో సంబంధిచబోయే సబ్జెక్ట్ 2 నుంచి 4 అడుగుల దూరంలో ఉండాలి. అలాగే మీరు తీయబోయే దృశ్యాలు మల్టిపుల్ డెప్త్ లేయర్లలో (ఉదాహరణకు.. మీ కుటుంబం పూలతోటలో నిలుచున్నట్లు) ఉండేలాగా ప్రయత్నించాలి.

# రెడ్మి నోట్ 7 ప్రత్యేకతలు




ఇటీవలే చైనాలో విరుదల చేసిన రెడ్మి నోట్ 7 స్మార్ట్ ఫోన్ ఇప్పుడు ఇండియాలో కూడ విడుదలకానున్నట్లు సమాచారం. ఈ టీజర్ ఇండియన్ మొబైల్ మార్కెట్లో ఓ కొత్త ఒరవడిని రేకెత్తిస్తున్నాయి. ఇందుకు కారణం ఇది అందించిన 48MP కెమేరా. అయితే ఇప్పుడు ఈ కెమెరాకి సంభంధించిన మరొక కొత్త ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే రానున్న ఒక సాఫ్ట్ వేర్ అప్డేట్ ద్వారా 'సూపర్ నైట్ సీన్ కెమేరా మోడ్' అందుకోనుంది.

డిస్ప్లే పైన వాటర్ డ్రాప్ నోచ్‌తో ఈ రెడ్మి నోట్ 7, 2340 x1080 పిక్సెళ్ళు గల 6.3 అంగుళాల LCD ప్యానెల్ తోవస్తుంది. 450 nits బ్రైట్నెస్‌తో కేవలం 0.8mm మందపాటి bezels ను కలిగిఉంది. ఈ ఫోన్ కూడా 2.5D కర్వ్డ్ గ్లాస్ రక్షణలో ఉంచబడింది. అలాగే బ్యాక్ -మౌంటు ఫింగర్‌ప్రింట్ సెన్సార్ కలిగి ఉంది. ఈ ఫోన్ క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 660 SoC కి జతగా 3GB, 4GB, 6GB RAM వేరియంట్లలో 32GB, 64GB స్టోరేజిలలో లభిస్తాయి. ఒక 4,000 mAh బ్యాటరీతో ఈ స్మార్ట్ ఫోన్ వస్తుంది.

పోర్ట్రైట్ షాట్లకు అనుగుణంగా 5 MP సెకండరీ సెన్సారుతో కలిపి 48MP సెన్సారు కలిగిన మొదటి Redmi ఫోన్ ఇది. ఈ నోట్ 7 48MPసెన్సార్ తక్కువ కాంతిలో కూడా మంచి షాట్లు తీసుకోవచ్చని కంపెనీ చెబుతుంది. ఈ 48 MP కెమెరా సెన్సార్ 1/2 అంగుళ పరిమాణాన్ని కలిగి స్మార్ట్ ఫోన్లలో అందంగా పెద్దదిగా ఉంటుంది. ఇందులో అతితక్కువ 0.8 um అంగుళాల పిక్సెళ్ళు నిజంగా బాగుంటుంది. కెమెరా సెన్సార్లో 48 మెగాపిక్సెళ్లను క్రామ్ చేయగలిగింది. Xiaomi ప్రకారం, Redmi Note 7 పోస్టర్ వంటి HD ఫొటోలను తీయగలదు. ముందుభాగంలో పోర్ట్రైట్ మోడ్, పేస్ బ్యూటిఫికేషన్ కి సపోర్ట్ చేసేలా 13MP కెమెరా ఉంటుంది.

**టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అను భవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి. మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.**

tech+@ navatelangana.com

మీ కంప్యూటర్ నెమ్మదైన పనితీరు చిరాకు పుట్టిస్తుందా..? ఫైల్స్ ఓపెన్ కాక గంటల తరబడి సమయాన్ని వృధా చేస్తున్నారా..? ఈ సమస్యకు చెక్‌పెట్టే సమయం ఆసన్నమైంది. ముందుగా మీ పీసీలోని ముఖ్యమైన డేటాను బ్యాకప్ చేసుకుని కింద పేర్కొన్న ఈ సూచనలను పాటించండి...



# చిరాకు పుట్టిస్తుంటే...

### అనవసరమైన ప్రోగ్రామ్‌లను రిమూవ్ లేదా అన్-ఇన్ స్టాల్ చేయండి:

ముందుగా మీరు ఉపయోగించని అనవసర సాఫ్ట్‌వేర్‌లను పీసీ నుంచి రిమూవ్ లేదా అన్-ఇన్‌స్టాల్ చేయండి. ఇలా చేయడం వల్ల పీసీ హార్డ్‌డ్రైవ్‌లో మరింత స్పేస్ ఏర్పడుతుంది.

### వైరస్‌తో పాటు కుకీలను తొలగించడి:

పీసీ వేగాన్ని తగ్గించటంలో కుకీలతో పాటు టెంపరరీ ఇంటర్నెట్ ఫైళ్లు కీలక పాత్రపోషిస్తాయి. కాబట్టి.. వీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. అలాగే యాంటీ వైరస్ అప్‌డేట్‌ను రెగ్యులర్‌గా పొందుతూ పీసీని స్కాన్ చేసుకోవాలి.

### రీసైకిల్ బిన్‌ను ఖాళీ చేయండి:

మీరు డిలీట్ చేసిన అనవసర ఫైళ్లు, ఫోల్డర్లు రిసైకిల్ బిన్‌లోకి చేరతాయి. వీటిపట్ల నిర్లక్ష్యంగా ఉండకండి. ఎప్పటికప్పుడు రీసైకిల్ బిన్‌ను ఖాళీ చేసుకోవటం వల్ల పీసీ వేగం మెరుగుపడటంతో పాటు హార్డ్‌డ్రైవ్‌లో కొంత స్పేస్ ఏర్పడుతుంది.

### ప్రారంభ ప్రోగ్రామ్‌లను తగ్గించండి:

పీసీ స్టార్ట్‌అప్‌లో భాగంగా అనేక ప్రోగ్రామ్‌లు లోడవుతుంటాయి. ఇది కంప్యూటర్ వేగాన్ని మందగించేలా చేస్తుంది. అందుకే అలాంటి ప్రోగ్రామ్స్‌ను తగ్గించుకోండి.


### అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు ఇన్‌స్టాల్ చేసుకోండి:

విండోస్ ఆపరేటింగ్ సిస్టం మరింత మెరుగ్గా పనిచేసేందుకు మైక్రోసాఫ్ట్ ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లను ప్రవేశపెడుతుంది. వీటిని ఉపయోగించుకుంటే పీసీ పనితీరును మరింత మెరుగుపరుస్తాయి.

ఈ చిన్న చిన్న చిట్కాలు పాటించి మీ కంప్యూటర్ స్పీడ్‌గా పని చేసేలా చూసుకోండి. దాని వల్ల చిరాకు ఉండదు, మీ సమయం కూడా వృధా కాదు.

# గూగుల్ మ్యాప్స్ గ్రూప్ ఫీచర్‌ను ఎలా వాడుకోవాలి?

ఇంటర్నెట్ శోధన దిగ్గజం గూగుల్ తన మ్యాప్ యాప్‌కు "గ్రూప్ ప్లానింగ్" పేరిట కొత్త ఫీచర్‌ను జోడించింది. స్నేహితులతో కలసి విందు వినోదాలు చేసుకునేవారికి ఇదొక అనువైన ఫీచర్. తమ మిత్రులకు వివిధ రెస్టారెంట్లను సూచిస్తూ లింక్ షేర్ చేసేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుంది. అదెలాగో తెలుసుకుందాం...




1. గూగుల్ మ్యాప్స్‌ను ఓపెన్ చేయండి.
2. EXPLORE TAB లో రెస్టారెంట్లను ఎంపిక చేసుకుని వాటిపై ట్యాప్ చేయండి.
3. ఏదైనా లొకేషన్ మీద లాంగ్ ప్రెస్ చేయండి.
4. స్క్రీన్‌పై కుడివైపు దిగువన కనిపించపే బబుల్‌లో లింక్‌ను డ్రాప్ చేయండి.
5. అలా అన్ని ప్రదేశాలనూ ఎంపిక చేసుకున్న అనంతరం వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్ లేదా గూగుల్ హాంగవుట్స్ వంటి సోషల్ మెసేజింగ్ యాప్‌ద్వారా వాటిని షేర్ చేసుకోండి.

మీరు ఎంపిక చేసిన రెస్టారెంట్లు, ప్రదేశాలను ఈ షేర్డ్ లింక్ మీ మిత్రులకు చూపుతుంది. దీని ఆధారంగా అందరూ లైక్, డిజ్‌లైక్ పద్ధతిలో ఓట్ చేసి, ఒక రెస్టారెంట్‌ను ఎంపిక చేసుకుని విందు-వినోదాలతో ఎంజాయ చేయొచ్చు. ఇక ఎంపిక చేసిన, ప్రదేశాలను డిలీట్ చేసే లేదా అదనంగా జోడించే ఆప్షన్ గ్రూప్‌లోని ప్రతి సభ్యుడికీ ఉండాలి. గ్రూప్‌లోని సభ్యులందరూ షేర్ చేసుకున్న లింక్ ద్వారా గూగుల్ మ్యాప్స్ యాప్ వారిని రీడైరెక్ట్ చేస్తుంది. సభ్యులలో ఎవరికైనా మ్యాప్స్ యాప్ లేనప్పటికీ వారు ఆ లింక్‌ను వెబ్‌లో చూసుకోవచ్చు. గ్రూప్ ప్లానింగ్ ఫీచర్ ఆండ్రాయిడ్, ఐవోఎస్‌లలో ఈ వారంలోనే ప్రారంభమవుతుందని, మ్యాప్స్ యాప్ లేనివారు యాప్ ఉన్నవారు అప్‌డేల్ చేసుకోవాలని గూగుల్ ఒక బ్లాగ్ స్పాట్‌లో ప్రకటించింది.

ఆండ్రాయిడ్ వినియోగదారుల కోసం గూగల్ ఇటీవలే ఒక కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు తమ లొకేషన్‌తోపాటు ఫోన్ బ్యాటరీ స్థాయిని కూడా షేర్ చేసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. అయితే, ఇది చాలా కాలం నుంచే అందుబాటులో ఉన్నా అందరి దృష్టికీ రాలేదని Android Police పేర్కొంటోంది. గూగుల్ మ్యాప్స్‌లోని లొకేషన్ షేరింగ్ ఫీచర్‌కు అనుగుణంగా ఈ కొత్త ఫీచర్ పని చేస్తుందని తెలిపింది.



రెండు, మూడో వన్డే కోసం మౌంట్ మౌంగానుయ్‌కు చేరుకున్న భారత జట్టుకు సంప్రదాయ స్వాగతం లభించింది. ప్రకృతిని ప్రధానంగా ఆరాధించే మౌరీ తెగ సంప్రదాయ నృత్యంతో కోహ్లిసేనకు ఘన స్వాగతం పలికారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన (1950) ఏడాది నుంచి ఇప్పటివరకూ గణతంత్ర దినోత్సవాన టీమ్ ఇండియా వన్డే విజయం ఎరుగదు. చరిత్ర తిరగ రాయడాన్ని అలవాటుగా మార్చుకున్న కోహ్లిసేన, నేడు గణతంత్ర దినోత్సవాన సైతం భారత్‌కు తొలి విజయం అందించేందుకు సిద్ధమవుతున్నాడు. ఆరంభ మ్యాచ్‌లో కనీస పోటీ ఇవ్వలేని ఆతిథ్య కివీస్ నేడు ప్రతీకారం కోసం ఎదురుచూస్తున్నది. భారత్, న్యూజిలాండ్ రెండో వన్డే పోరు నేడు.

# జోరు సాగేనా!

- కివీస్‌తో రెండో వన్డే నేడు
- గణతంత్ర విజయంపై కోహ్లి కన్ను
- సమంపై న్యూజిలాండ్ ధ్యాస
- ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మౌంట్ మౌంగానుయ్

సమవుజ్జీల సమరం. కోహ్లిసేనకు దీటుగా పోటీనివ్వగల సత్తా కానెసేన సొంతం. తొలి వన్డేకు ముందు క్రికెట్ విశ్లేషకులు చెప్పిన మాట. నేపియర్ మ్యాచ్ అంచనాలను అనుగుణంగా ముగియకున్నా, న్యూజిలాండ్ నిజంగానే భారత్‌కు పోటీనివ్వగల బలమైన జట్టే. స్పిన్‌కు ఏమాత్రం అనుకూలించని పిచ్‌పై స్పిన్ మాయతో ఆతిథ్య జట్టును కకావికలం చేసిన టీమ్ ఇండియా, నేడు మరో విజయంపై కన్నేసింది. భారీ స్కోర్లు ఖాయమని అంచనా వేస్తోన్న మౌంట్ మౌంగానుయ్ వన్డేలో కోహ్లిసేన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. మిడిల్ ఆర్డర్ బలంతో న్యూజిలాండ్ లెక్క సరి చేయాలని భావిస్తోంది.

**అంబటి ఆడాలిక.. :** ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగమైన మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు కివీస్‌పై సత్తా చాటాల్సిన అవసరం ఏర్పడింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి వైదొలిగిన రాయుడికి ఆసీస్‌తో వన్డేలకు ముందు సరైన మ్యాచ్ ప్రాక్టీస్ కొరవడింది. అది తొలి రెండు వన్డేల్లో ప్రస్ఫుటించింది. నేపియర్‌లో రాయుడు అజేయంగా నిలిచినా, యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ జట్టులోకి దూసుకొచ్చిన నేపథ్యంలో తెలుగు తేజం స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉన్నది. ఆసీస్‌తో చివరి వన్డేకు దూరమైన రాయుడు, న్యూజిలాండ్‌పై నిరూపించుకోకపోతే అతడి స్థానంలోకి గిల్ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు!. టాప్-3 రోహిత్, ధావన్, కోహ్లిల భీకర ఫామ్ కొనసాగుతోంది. ఆల్‌రౌండర్లు కేదార్ జాదవ్, విజయ్ శంకర్‌లు బ్యాట్‌తో అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. చివరి రెండు వన్డేలకు హార్దిక్ పాండ్య రానుండటంతో అప్పట్లోగా తనెంటో నిరూపించుకోవాలని విజయ్ తహతహ లాడుతున్నాడు. ఛేదనలో తనదైన శైలిలో ఆడిన ధోని, ఒకవేళ భారత్ తొలుత బ్యాటింగ్ చేస్తే ఏ విధంగా ఆడతాడనే చర్చ నడుస్తోంది. దీనికి మహి ఏ విధంగా బదులిస్తాడనేది ఆసక్తికరం. భువనేశ్వర్, మహ్మద్ షమిలు పేస్ బాధ్యతలు పంచుకోనుండగా, స్పిన్ ద్వయం కుల్దీప్-చాహల్ మరోసారి కివీస్ మిడిల్ ఆర్డర్‌పై గురిపెట్టారు.

**టాప్ బాధ్యత చూపాలి :** న్యూజిలాండ్ మిడిల్ ఆర్డర్ చాలా బలోపేతంగా ఉంది. కానీ టాప్ ఆర్డర్ అందుకు విరుద్ధంగా తయారైంది. సీనియర్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ ఫామ్‌లోకి రావాల్సి ఉన్నది. భారీ షాట్లు బాదగల కొలిన్ మన్రో సైతం నిలకడగా విఫలమవుతున్నాడు. ఓపెనర్ల వైఫల్యంతో మిడిల్ ఆర్డర్ సహజ శైలిలో ఆడలేకపోతుంది. మౌంట్ మౌంగానుయ్‌లోనైనా టాప్ ఆర్డర్ శుభారంభం అందిస్తే, న్యూజిలాండ్ భారీ స్కోరు దిశగా సాగగలదు. లేదంటే మరో నేపియర్ పతనం పునరావృతం కావటం లాంఛనమే!. కెప్టెన్ విలియమ్సన్‌కు తోడు రాస్ టేలర్, నికోల్స్, లాథమ్‌లు బ్యాటింగ్ బాధ్యత తీసుకోనున్నారు. బంతితో బౌల్ట్, సౌథీ తొలి వన్డేలో ప్రభావం చూపలేకపోయారు. పేస్ అనుకూలిత పిచ్‌పై బౌల్ట్, సౌథీ భారత్‌ను ఇబ్బంది పెట్టగలరని ఆతిథ్య జట్టు ఆశిస్తోంది. శాంట్నర్‌కు తోడు ఇశ్ సోధిని సైతం తుది జట్టులోకి తీసుకోవాలని కివీస్ ఆలోచిస్తునా, మూడో పేసర్‌ను పక్కనపెట్టడానికి విలియమ్సన్ అంగీకరించే అవకాశం లేకపోవచ్చు!.

**పిచ్ రిపోర్టు :** మౌంట్ మౌంగానుయ్ పిచ్ సహజంగానే బ్యాటింగ్‌కు అనుకూలం. శ్రీలంకతో ఇక్కడ జరిగిన వన్డేల్లో 300 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. నేడు కూడా పరుగుల వరద ఖాయమనే చెప్పవచ్చు. నేపియర్ మాదిరి ఇది స్పిన్ సానుకూలం కాదు. వికెట్ల వేటలో పేసర్లకు ఉన్న అనుకూలత స్పిన్నర్లకు లేదు. కానీ పరుగుల పొదుపులో స్పిన్నర్లే కీలకం.

# సైనా దూకుడు

- సెమీస్‌లో హైదరాబాదీ షట్లర్
- క్వార్టర్స్‌లో ఓడిన సింధు, శ్రీకాంత్
- ఇండోనేషియా మాస్టర్స్

**జకర్తా :** భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కొత్త ఏడాదిలో వరుసగా రెండో టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గత వారం మలేషియా మాస్టర్స్ సెమీస్‌కు చేరిన సైనా, అక్కడ టైటిల్ వేటలో నిరాశపరిచింది. తాజాగా జకర్తాలో వరుస విజయాలతో హైదరాబాదీ అమ్మాయి సెమీఫైనల్స్‌కు చేరుకున్నది. క్వార్టర్‌ఫైనల్లో థాయ్‌లాండ్ స్టార్ పొర్నపవీ చొచువాంగ్‌పై 21-7, 21-18తో సైనా నెహ్వాల్ వరుస గేముల్లో గెలుపొందింది. మరో క్వార్టర్స్‌లో తెలుగు తేజం పి.వి సింధు పోరాడి ఓడింది. ఒలింపిక్ చాంపియన్ కరొలినా మారిన్ (స్పెయిన్) చేతిలో 11-21, 12-21తో సింధు సులువుగా చేతులెత్తేసింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 18-21, 19-21తో జొనాథన్ క్రిస్టే (ఇండోనేషియా)తో పోరాడి ఓడాడు.

తొలి గేమ్‌లో 11-4తో విరామ సమయానికి భారీ ఆధిక్యం సాధించిన సైనా నెహ్వాల్, ద్వితీయార్థంలోనూ వెనక్కి తగ్గలేదు. పొర్నపవీ మరో మూడు పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. కానీ సైనా సులువగా గేమ్‌ను గెల్చుకున్నది. రెండో గేమ్‌లో చొచువాంగ్ ఆరంభంలో 8-4తో ముందంజలో నిలిచింది. పుంజుకున్న సైనా 12-12తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత సైనాకు చొచువాంగ్ ఎదురు నిలువలేదు. దూకుడుగా ఆడిన సైనా రెండో గేమ్ సహా సెమీస్ బెర్త్ సొంతం చేసుకున్నది. నేడు జరిగే సెమీస్ సమరంలో చైనా యువ సంచలనం హీ బింగ్జియావ్‌తో సైనా తలపడనున్నది.







# వచ్చేశాడు జోకర్

సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ రికార్డు ఏడో టైటిల్‌పై కన్నేశాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో సెమీస్, ఫైనల్స్‌లో ఓటమెరుగని రికార్డున్న జకోవిచ్, ఆదివారం నాటి ఫైనల్లో స్పెయిన్ బుల్‌తో టైటిల్ ఫైట్‌కు సిద్ధమయ్యాడు. సెమీస్‌లో ఫ్రాన్స్ కుర్రాడు లుకాస్ పౌలీపై అలవోక విజయం సాధించిన జోకర్ కెరీర్ ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌కు అడుడు దూరంలో నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఒసాక, క్విటోవా నేడు టైటిల్ కోసం చావోరేవో తేల్చుకోనున్నారు.

- నడాల్‌తో తుది పోరుకు జకోవిచ్ సై
- సెమీస్‌లో పౌలీపై అలవోక విజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్

**మెల్‌బోర్న్ :** గాయాల బారిన పడుతూ లేస్తూ, గత రెండేండ్లుగా గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఫేవరెట్ల జాబితాలో లేకుండా పోయిన సెర్బియా హీరో నొవాక్ జకోవిచ్ పూర్వ వైభవం సాధించినట్టే కనిపిస్తోంది. న్యూయార్క్‌లో ఫెడరర్‌ను ఓడించి యు.ఎస్ ఓపెన్ నెగ్గిన జకోవిచ్, తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రఫెల్ నడాల్‌తో టైటిల్ ఫైట్‌కు సై అంటున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇప్పటివరకూ ఆరుసార్లు ఫైనల్స్‌కు చేరుకున్న జకోవిచ్, ఒక్కసారీ టైటిల్ జార విడుచుకోలేదు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఫ్రాన్స్ క్రీడాకారుడు లుకాస్ పౌలీపై వరుస సెట్లలో గెలుపొందిన జకోవిచ్ ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. 6-0, 6-2, 6-2తో జకోవిచ్ ఏకపక్ష విజయం నమోదు చేశాడు.

**ఎదురులేని జకో :** ' ఇక్కడ ఆడిన ఉత్తమ మ్యాచుల్లో ఇదొకటి. అంతా, నా ఊహ ప్రకారమే సాగింది. లుకాస్ కఠిన ప్రత్యర్థి, టాప్-10 ఆటగాడి సామర్థ్యం అతడి సొంతం. పౌలీకి ఇదే తొలి మెగా సెమీఫైనల్. ఇటువంటి మ్యాచుల్లో మరిన్ని సార్లు తలపడతాడని అనుకుంటున్నాను' అని సెమీస్ విజయానంతరం జకోవిచ్ అన్నాడు. సెమీస్‌లో కేవలం ఐదు అనవసర తప్పిదాలకే పరిమితమైన జకోవిచ్, పౌలీకి ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. 27 అనవసర తప్పిదాలతో పౌలీ మూల్యం చెల్లించుకున్నాడు. మూడు సెట్లలో ఆరు ఏస్‌లు సంధించిన జకోవిచ్, మొత్తంగా 83 పాయింట్లు సాధించాడు. జకోవిచ్ 11 సర్వీస్‌లను నెగ్గగా, పౌలీ నాలగు సర్వీల్లోనే గేమ్ పాయింట్లు సాధించాడు. సంచలన ప్రదర్శనతో సెమీస్‌కు చేరుకున్న పౌలీ, మరో పార్శ్వంలో గ్రీస్ కుర్రాడు సిట్సిపాస్ మాదిరిగానే చేతులెత్తేశాడు. సెమీఫైనల్స్‌లో కుర్రాళ్లపై అలవోక విజయాలు సాధించిన జకోవిచ్, రఫెల్ నడాల్‌లు ఫైనల్లో అన్ని అస్త్రాలు ప్రయోగించే అవకాశం ఉంది.

మహిళల డబుల్స్ టైటిల్ చైనా, ఆస్ట్రేలియా జోడీ ఎగరేసుకుపోయింది. రెండో సీడ్ క్రిస్టినా మ్లడనోవిచ్, బాబోస్ జంటపై జాంగ్ షుయ్, సమంత జోడీ 6-3, 6-4తో వరుస సెట్లలో విజయం సాధించింది. ఒత్తిడిలో జాంగ్, సమంత జోడీ 8 డబుల్ ఫాల్ట్స్‌కు పాల్పడినా, టైటిల్ వారి చేజారలేదు. ప్రత్యర్థి సర్వీసు మూడు సార్లు బ్రేక్ చేసిన సమంత, జాంగ్ జంట అక్కడే క్రిస్టినా, బాబోస్‌పై పైచేయి సాధించింది. ఓవరాల్‌గా సమంత, జాంగ్‌లు 76 పాయింట్లు సాధించగా, క్రిస్టినా, బాబోస్‌లు 70 పాయింట్ల వద్ద ఆగిపోయారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.